మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

శుక్రవారం FRIDAY 19.7.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 14 | సంచిక (Issue): 44 | వెల (Price) రూ.6.50 | త్రయోదశి

శుక్రవారం, సూర్యోదయం: 5-51, సూర్యాస్తమయం: 6-53. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం శుక్ల పక్షం తిథి: త్రయోదశి రాత్రి 7-41 వరకు. నక్షత్రం: మూల రాత్రి 2-55 వరకు. వర్జ్యం: రాత్రి 1-22 నుంచి రాత్రి 2-56 వరకు. రాహుకాలం: ఉదయం 10-44 నుంచి పగలు 12-22 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-28 నుంచి ఉదయం 9-20 వరకు, పునః దుర్ముహూర్తం: పగలు 12-48 నుంచి పగలు 1-40 వరకు. అమృతకాలం: రాత్రి 8-39 నుంచి రాత్రి 10-13 వరకు. పుష్యమి కార్తె రాత్రి 11-10 గంటలకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline



సూర్యకుమార్ సారథ్యంలో..

టీ20 లకు భారత్ కొత్త జట్టు ఎంపిక

వైస్ కెప్టెన్‌గా శుభ్‌మన్‌గిల్

లంకతో టీ20, వన్డేలకు జట్టు ప్రకటన

ఈ నెల 27 నుంచి టీ20 సిరీస్

› 12

నిపుణ

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..





గురువారం సచివాలయంలో రైతురుణమాఫీ ప్రక్రియను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో అసెంబ్లీ స్పీకర్, మండలి చైర్మన్, డిప్యూటీ సీఎం, మంత్రులు తదితరులు

ఆరు గ్యారెంటీలూ అమలు చేసేశాం

- వాటితోపాటు ఎన్నికల్లో చెప్పిన రుణమాఫీని పూర్తిచేశాం
- నెలాఖరున వరంగల్‌లో రాహుల్‌గాంధీ కృతజ్ఞత సభ › 5
- పాస్‌బుక్కే ప్రామాణికం.. రేషన్‌కార్డుపై అపోహలు వద్దు
- రుణమాఫీ ప్రక్రియ ప్రారంభంలో సీఎం రేవంత్ వ్యాఖ్యలు

రుణమాఫీపై సిద్దిపేటలో రేవంత్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

మాఫీ మాయాజాలం

సర్కారు చెప్తున్న లెక్కల్లో గందరగోళం

లక్షలోపు రుణమున్నా కనిపించని పేర్లు

- అస్పష్ట జాబితాతో రైతుల్లో ఆందోళన.. అర్హుల జాబితా విడుదలలో గోప్యత
- లబ్ధిదారుల జాబితా మాత్రమే ప్రకటన.. రైతుల సందేహాలకు బ్యాంకర్ల మౌనం
- ప్యాక్స్ రైతులకు రెండ్రోజుల్లో మాఫీ..'అదంగల్' అన్నదాతల ఆశలు ఆవిరి
- కొత్తగూడెం సహకార సంఘంలో 720 మంది అన్నదాతలకు రుణమాఫీ నిల్

హైదరాబాద్, జూలై 18(నమస్తే తెలంగాణ): అనేక సందేహాలు, అంతకు మించిన అస్పష్టతతో రుణమాఫీ ప్రక్రియ ప్రారంభమైంది. ఎవరికి మాఫీ అయిందో, ఎవరికి కాలేదో, అందుకు కారణం ఏంటో కూడా తెలియని గందరగోళ పరిస్థితి నెలకొన్నది. రూ. 2 లక్షల రుణమాఫీలో భాగంగా ప్రభుత్వం గురువారం రూ. లక్ష వరకు గల రుణాలను మాఫీ చేసింది. అయితే పూర్తి వివరాలతో ప్రభుత్వం జాబితా ఇవ్వకపోవడం, గోప్యత పాటించడంతో రైతుల్లో గందరగోళం నెలకొన్నది. దీనికి తోడు రుణమాఫీ పొందిన రైతుల జాబితాను చాలా చోట్ల ప్రదర్శించలేదు. రైతులకు సమాచారం కూడా అందించలేదు. దీంతో రైతులు జాబితాలో తమ పేరు ఉందో లేదోనని ఆరా తీస్తున్నారు. తమకు రూ. లక్షలోపే రుణం ఉన్నదని, అయినా జాబితాలో తమ పేరు ఎందుకు లేదని అధికారులను ప్రశ్నిస్తున్నారు. మరో దఫాలోనైనా తమ రుణం మాఫీ అవుతుందా? అని ఆరా తీస్తున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ జాబితాపై గ్రామాల్లో గందరగోళం నెలకొన్నది. జాబితాలు అస్పష్టంగా ఉండడంతో రైతులు ఇబ్బంది › 5వ పేజీలో

కేసీఆర్ మాఫీ చేసిండు.. ఇప్పుడు కాలే!



కేసీఆర్ సర్కారున్న కాలంలో చెప్పినట్టు రైతులందరికీ రుణమాఫీ చేసిండు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కొందరికే ఇచ్చి మిగిలినోళ్లకు ఇయ్యకుంటే మంది గుండదు. మా బాధలను రేవంత్ సార్ అర్థం చేసుకోవాలి. రైతులందరికీ రుణమాఫీ చెయ్యాలి. నేనైతే పంటలేసేందుకు 45 వేలు అప్పు తెచ్చిన. రూ.లక్ష లోపు లోన్ మాఫీ చేస్తమని చెప్పిండ్రు. కానీ లిస్టుల నా పేరు లేదు. ఏం.. నేను రైతును కాదా?

- రాములు, రైతు, మరికల్, నారాయణపేట జిల్లా

కాంగ్రెస్ నేతను.. మాకే రాలే!



మా అమ్మ జాల లక్ష్మి పేరిట 50 వేలు పాత భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని కెనరా బ్యాంకులో క్రాప్‌లోన్ తీసుకున్నం. కానీ, మా కాంగ్రెస్ సర్కారు ప్రకటించిన రూ.లక్ష లోపు మాఫీ రుణాల్లో మా అమ్మ పేరు లేదు. చాలా బాధ అనిపించింది. గ్రామస్థాయిలో కాంగ్రెస్ నాయకుడిగా ఉన్న నాకే ఇట్ల జరిగితే ఎట్లా? ఎవరికి చెప్పాలో అర్థం కాని పరిస్థితి నాది. మా ఇంట్లోనే రుణమాఫీ జరగలేదు.. నేను బయటకుపోయి ఏం మాట్లాడుత? సెకండ్ లిస్టులోనైనా మా అమ్మ పేరు వస్తుందో లేదో!

-జాల రవి, కాంగ్రెస్ నాయకుడు, కట్కూరు, అక్కన్నపేట మండలం (సిద్దిపేట జిల్లా)

అప్పుల బాధతో మరో రైతు ఆత్మహత్య › 5

రైతుబంధు పైసలు రుణ మాఫీకి



- 7వేల కోట్ల రైతుబంధు నిధులు దారిమళ్లించారు
- రేవంత్‌రెడ్డి ప్రభుత్వ మోసానికి ఇదే పరాకాష్ఠ
- 40 లక్షల మంది అర్హుల్లో 11లక్షల మందే ఎంపిక
- గత రుణమాఫీ లబ్ధిదారులతో పోల్చితే నాల్గోవంతే
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ) : రుణమాఫీ పేరిట రాష్ట్ర రైతాంగాన్ని రేవంత్ సర్కార్ మోసం చేస్తున్నదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. రైతులకు జూన్‌లో ఇవ్వాల్సిన రైతుబంధు నిధుల్లోంచి రూ.7000 కోట్లు దారిమళ్లించి వాటిని రుణమాఫీగా అందిస్తున్నామని చెబుతూ రేవంత్ సర్కార్ పోజులు కొడుతున్నదని ఎక్స్‌వేదికగా దుయ్యబట్టారు. రైతులకు హక్కుగా రావాల్సిన రైతుబంధు డబ్బు నుంచి కొంతమొత్తాన్ని విదిల్చి రుణమాఫీగా ఇస్తున్నట్టు చెప్పుకోవడం దారుణమని మండిపడ్డారు. 40 లక్షల పైచిలుకు రైతులు రూ. లక్ష వరకు రుణాలు తీసుకుంటే వీరిలో కేవలం 11 లక్షల మందినే ఎలా ఎంపిక చేస్తారని, 2014, 2018లో కేసీఆర్ సర్కార్ రుణమాఫీతో పోలిస్తే పావు వంతు రైతులే అర్హులా? అని ప్రశ్నించారు. 2014లోనే › 5వ పేజీలో

13 హామీలూ అమలు చెయ్

అప్పుడే 6 గ్యారెంటీలు పూర్తి



ఆగస్టు 15 కల్లా చెప్పినవన్నీ చేస్తే

సవాల్‌కు సిద్ధం

- చేయలేకపోతే సీఎం పదవికి రిజైన్ చేస్తవా?
- సీఎం రేవంత్ వ్యాఖ్యలపై హరీశ్‌రావు ఫైర్

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టు 15లోగా రాష్ట్రంలోని రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేయాలని, 13 హామీలు, ఆరు గ్యారెంటీలను అమలుచేసి చూపిస్తే ఇప్పటికీ తాను రాజీనామా సవాల్‌కు సిద్ధంగా ఉన్నానని మాజీ మంత్రి టీ హరీశ్‌రావు ప్రకటించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పదవికి రాజీనామా చేయకుండా పెన్నుమూసి పారిపోయింది రేవంత్‌రెడ్డి అని దుయ్యబట్టారు. 'కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం చేస్తానని ప్రకటించి, పారిపోయింది మీరే' అంటూ రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి ఎద్దేవా చేశారు. గురువారం ఎక్స్ వేదికగా రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు హరీశ్ కౌంటర్ ఇచ్చారు. 'నిరంతరంగా పారిపోయిన చరిత్ర మీది, నిత్యం ప్రజల పక్షాన నిలిచిన చరిత్ర నాది' అని పేర్కొన్నారు. 'మీరు › 5వ పేజీలో

పదేండ్లు అద్భుతం

కేసీఆర్ హయాంలో తెలంగాణ గణనీయ పురోగతి

2023-24 నివేదికలో నీతి ఆయోగ్ ప్రశంసల వర్షం


పేదరిక నిర్మూలనలో దేశంలోనే రెండో ర్యాంకు

- విద్యుత్తు సరఫరాలో అగ్రగామిగా రాష్ట్రం
- 8 విషయాల్లో జాతీయ సగటు కంటే ముందంజ
- డజను కీలక అంశాల్లో ఎంతో మెరుగు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ పదేండ్ల హయాంలో తెలంగాణలో పదేండ్ల విధ్వంసం జరిగిందని, రాష్ట్రం అన్ని రంగాల్లో అధఃపాతాళానికి చేరుకొన్నదంటూ తప్పుడు ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అగ్రనేతలందరికీ చెంపపెట్టులాంటి వార్త ఇది. బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, చిన్న రాష్ట్రాలకు ఓ సక్సెస్‌ఫుల్ మోడల్‌గా నిలిచిందని బ్రిటిష్ వీక్లీ 'ది ఎకానమిస్ట్' ఇటీవల ప్రశంసించగా, తాజాగా కేంద్ర ప్రభుత్వ మేధోసంస్థ నీతి ఆయోగ్ కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. పేదరిక నిర్మూలన, ఆర్థికాభివృద్ధి, విద్యుత్తు, విద్య, వైద్యం, పారిశుద్ధ్యం, తాగునీరు, పనిహక్కు తదితర అంశాల్లో తెలంగాణ మెరుగైన ప్రగతి సాధించిందని వెల్లడించింది. ఈ మేరకు రెండు రోజుల కిందట 'స్థిరాభివృద్ధి లక్ష్యాలు (ఎస్డీజీ) ఇండియా సూచీ, 2023-24' నివేదికలో పలు వివరాలను వివరించింది.

తగ్గిన పేదరికం : దేశంలో అతి తక్కువ పేదరికం ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ రెండో స్థానంలో నిలిచినట్టు నీతిఆయోగ్ నివేదిక వెల్లడించింది. 2005-06 నుంచి ఇప్పటివరకు దేశంలో 'బహుముఖ పేదరికం'పై (మల్టీ డైమెన్షనల్ పావర్టీ) నీతి ఆయోగ్ విడతలవారీగా నివేదికలను విడుదల చేస్తూ వస్తున్నది. తాజా నివేదిక ప్రకారం.. దేశంలో సగటున ప్రతి వందమందిలో › 2వ పేజీలో



తెలంగాణ భళా.. ఇలా..

1 అచీవర్ 100 మార్కులు — అందుబాటు ధరల్లో నాణ్యమైన విద్యుత్తు సరఫరా

7 ఫ్రంట్ రన్నర్ 65-99 మార్కులు — పేదరిక నిర్మూలన, మెరుగైన వైద్యం, శుద్ధమైన నీరు, ఆర్థికాభివృద్ధి, అసమానతల తొలగింపు, పట్టణీకరణ, బాధ్యతాయుత ఉత్పత్తి-వ్యయం

4 పెర్ఫార్మర్ (50-64 మార్కులు) — ఆకలి బాధలు లేకపోవడం, నాణ్యమైన విద్య, పారిశ్రామికీకరణ, వాతావరణ మార్పులపై చర్యలు

కుక్కల కట్టడికి ఏం చేశారు? › 2

ప్రభుత్వ తీరుపై హైకోర్టు ఆగ్రహం

పరీక్ష కేంద్రాల వారీగా ఫలితాలివ్వండి

రేపటిలోగా నీట్-యూజీ రిజల్ట్ ఇవ్వాలని సుప్రీం ఆదేశం › 7



పెదవాగు ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో దిగువకు వరదనీటి ఉధృతి

పెదవాగుకు పెనుముప్పు

- వరద ఉధృతికి 2చోట్ల గండి.. ఏ క్షణమైనా కట్ట తెగే ప్రమాదం
- కొత్తగూడెం జిల్లాలో హైఅలర్ట్.. ఏపీలోని 6 గ్రామాలకు పొంచి ఉన్న ముప్పు
- వరదనీటిలో చిక్కుకున్న 25మంది కూలీలు.. కాపాడిన రెస్క్యూ బృందాలు

భద్రాద్రి కొత్తగూడెం/హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ)/ అశ్వారావుపేట రూరల్/టౌన్/ఖమ్మం వ్యవసాయం: ఇటీవల అడపాదడపా కురిసిన వర్షాలకు తోడు బుధవారం రాత్రి నుంచి భారీగా కురుస్తున్న వర్షాలకు ఎగువనున్న అనంతారం, గాండ్లగుంపు, తండాల్లో చెరువులు, కుంటలు అలుగుపోస్తున్నాయి. ఆ నీరంతా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి సమీపంలోని పెదవాగు ప్రాజెక్టుకు చేరింది. దీంతో గురువారం వాగుకు వరద ఉధృతి పెరిగింది. దీనికితోడు పైనున్న కొండలు, గుట్టలపై నుంచి కూడా వరద ప్రాజెక్టులోకి చేరడంతో స్థాయికి మించి జలాలు రావడం › 2వ పేజీలో



ఫాస్టాగ్ స్టిక్కర్‌లేకుంటే డబుల్ టోల్

ఎన్‌హెచ్‌ఏఐ ఆదేశాలు › 7



డెంగ్యూతో బ్రెయిన్ స్ట్రోక్! › 7

రక్తం గడ్డ కట్టే ప్రమాదం ఉంటుంది

అప్రమత్తత అవసరం: వైద్య నిపుణులు



భారీ వర్షాలకు అశ్వారావుపేట-బుర్రంపాడు రోడ్డులో అడ్డంగా పడిన భారీ వృక్షం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఉధృతంగా ప్రవహిస్తున్న వెంకమ్మ చెరువు



భారీ వర్షాలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలోని పెదవాగుకు పడిన గండి

పెదవాగుకు పెనుముప్పు

> మొదటిపేజీ తరువాయి...

పెద్ద వాగు కట్టకు రెండుచోట్ల గండి పడింది. దీంతో అప్రమత్తమైన అధికారులు లోతట్టు ప్రాంతంలో ఉండే గుమ్మడవల్లి గ్రామంలోని 300 కుటుంబాలు, కొత్తూరు గ్రామంలోని 200 కుటుంబాల ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రాజెక్టుకు రెండుచోట్ల గండిపడిన దృష్ట్యా.. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని ఆయా గ్రామాల ప్రజలు వివరించారు. ప్రజలంతా బిక్కుబిక్కుమంటూ కంటిమీద కునుకు లేకుండా ఆందోళన చెందుతున్నారు. పోలీసు, రెవిన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు అక్కడే ఉండి పరిస్థితిని అంచనా వేయడంతోపాటు ఎప్పటికప్పుడు వరద ఉధృతిని సమీక్షిస్తున్నారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సైతం అందుబాటులో ఉంచారు. అయితే ప్రాజెక్టు వరద నీరు దిగువకు వెళ్తుండటంతో ఏపీ రాష్ట్రంలోని ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం గుళ్లవాయి, మాదారం, రెడ్డిగూడెంతోపాటు మరో నాలుగు గ్రామాల ప్రజలను అక్కడి అధికారులు అప్రమత్తం చేశారు. వరద నీరంతా ఆయా గ్రామాల మీదుగా రుద్రంకోట వద్ద గోదావరిలో కలుస్తుంది.



వరద నీటిలో చిక్కుకున్న కూలీలను కాపాడుతున్న హెలికాప్టర్

25 మంది కూలీలను ఎన్డీఆర్ఎఫ్ రక్షణ

భద్రాద్రి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం రాత్రి నుంచి ఏకధాటిగా వర్షం కురవడంతో అశ్వారావుపేట నియోజకవర్గంలోని పెదవాగులో భారీగా వరద నీరు చేరి బచ్చువారిగూడెం-నారాయణపురం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వాగుకు రెండుచోట్ల గండి పడటంతో గుమ్మడవల్లి, కొత్తూరు గ్రామాలు నీట మునుగుతున్నాయి. అటుగా వెళ్తున్న ప్రయాణికులు, కూలీలు కలిసి 25 మంది పెదవాగు వరద నీటిలో చిక్కుకున్నారు. పెదవాగు వరద నీటిలో చిక్కుకున్న నారాయణపురం, బచ్చువారిగూడెం, ఏపీకి చెందిన మొత్తం 25 మందిని ఎన్డీఆర్ఎఫ్ బృందంతో పాటు హెలికాప్టర్ సహాయంతో సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చారు. దీంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇరు రాష్ట్రాల ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, చిర్రి బాలరాజు లోతట్టు ప్రాంతాల ప్రజలను ఎగువ ప్రాంతాలకు తరలించేందుకు సహాయక చర్యలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు నుంచి వేలేరుపాడుకు కారులో వెళ్తున్న ఐదుగురు ప్రయాణికులు వరదలో చిక్కుకున్నారు. వారు కారును వదిలేసి చెట్టును పట్టుకోవడంతో పాటు హాహాకారాలు చేశారు. అల్లూరిసీతారామనగర్ వద్ద గ్రామస్థులు వారిని రక్షించారు. భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఖమ్మం నగరంతోపాటు శివారులోని రూరల్, రఘునాథపాలెం, చింతకాని, కొణిజర్ల, సత్తుపల్లి డివిజన్‌లోని సత్తుపల్లి, పెనుబల్లి, మధిర మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. జేవీఆర్, కిష్టారం ఓపెన్ కాస్ట్‌లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడిందని సింగరేణి ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

మంత్రి పొంగులేటి నిరంతర సమీక్ష

అశ్వారావుపేట పెదవాగు ఘటనపై రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిరంతరం పర్యవేక్షిస్తున్నట్టు అధికారులు తెలిపారు. హైదరాబాద్ నుంచి భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్, ఎస్పీలకు స్వయంగా ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారని పేర్కొన్నారు. ప్రభావిత ప్రాంతం ఏపీకి దగ్గరగా ఉండటంతో ఆ రాష్ట్ర సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్‌తో మంత్రి మాట్లాడారని, ఆయన విజ్ఞప్తి మేరకు వాగులో చిక్కుకున్న 30 మంది కూలీలను ఏపీ ప్రభుత్వం ప్రత్యేకంగా రెండు హెలికాప్టర్లను ఏర్పాటు చేసి రక్షించిందని చెప్పారు. పరిస్థితి అదుపులోకి వచ్చేవరకు ఏపీ, తెలంగాణ అధికారులు సమన్వయంతో పని చేయాలని భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌ను ఆదేశించారు.

ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రాణనష్టం జరగొద్దు: సీఎస్

రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎస్ శాంతి కుమారి ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పెద్దవాగుకు పెద్దఎత్తున వరద రావడంతో గేట్లు ఎత్తగా దిగువ గ్రామాల రైతులు వరద నీటిలో చిక్కుకున్న ఘటనపై ఆమె సమీక్షించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్, ఎస్పీ, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సహాయ పునరావాస చర్యలను సమీక్షించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాణనష్టం జరగొద్దని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారని పేర్కొన్నారు. ఎలాంటి సహాయం కావాలన్నా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎస్ వారికి స్పష్టంచేశారు. పరిసర గ్రామాల్లోని చెరువులు, కుంటలు తెగకుండా ముందస్తు చర్యలను చేపట్టాలని సూచించారు.

లోకం పోకడ



వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
రంగారెడ్డి	33.3°c	22.9°c
మెదక్	32.4°c	23.5°c
ఆదిలాబాద్	31.9°c	23.5°c
నిజామాబాద్	29.9°c	23.9°c
నల్లగొండ	29.5°c	23.2°c
కరీంనగర్	29.0°c	24.0°c
వరంగల్	29.0°c	24.0°c
హైదరాబాద్	29.4°c	24.7°c
మహబూబ్‌నగర్	27.1°c	22.3°c
ఖమ్మం	26.0°c	23.0°c



హైదరాబాద్‌లోని ఓ వీధి రోడ్డులో గురువారం రాత్రి కురుస్తున్న వర్షం

రాష్ట్రంలో ఐదు రోజులు భారీ వర్షాలు!

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రానున్న ఐదు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. బంగాళాఖాతంలో తాజాగా మరో అల్పపీడనం ఏర్పడిందని తెలిపింది. దీని ప్రభావంతో వర్షాలు కురుస్తాయని పేర్కొన్నది. కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు రెడ్ అలర్ట్‌ను, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్‌ను, మిగతా జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది. మరోవైపు రాష్ట్రంలో బుధవారం నుంచి గురువారం వరకు పలుచోట్ల వర్షం కురిసింది. నిజామాబాద్ జిల్లా ఎడపల్లిలో అత్యధికంగా 8.71 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఏపీలో కొట్టుకుపోయిన కారు..

ఆంధ్రప్రదేశ్‌లో కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలో రోటు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఈ వాగును దాటుతున్న ఓ కారు కొట్టుకుపోయింది. అయితే అదృష్టవశాత్తూ వాగులోని చెట్ల పొదల్లో కారు చిక్కుకుపోవడంతో అందులో ఉన్న ఐదుగురు ఊపిరి పీల్చుకున్నారు. వీరిని కాపాడటానికి అధికారులు సహాయ చర్యలు చేపట్టారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఉన్న మేడిగడ్డ బరాజ్‌లో దిగువకు వెళ్తున్న వరద నీరు

ప్రాజెక్టులకు జలకళ .. 'మేడిగడ్డ'కు పెరిగిన వరద

ధరూరు/అయిజ/మహదేవపూర్/కన్నాయిగూడెం/వాజేడు, జూలై 18: జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 25,174 క్యూసెక్కుల నీటిని విద్యుత్తు ఉత్పత్తికి వినియోగిస్తున్నారు. గురువారం నెట్టెంపాడుకు 1,500 క్యూసెక్కులు, భీమాలిఫ్ట్-1కు 1,300 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 870 క్యూసెక్కులు, కుడి కాల్వకు 464 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 600 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్-2కు 750 క్యూసెక్కులతో మొత్తం 30,013 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు తుంగభద్ర డ్యాంకు వరద పోటెత్తుతున్నది. 1,12,468 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 411 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం పరిధి అంబట్‌పల్లిలో ఉన్న మేడిగడ్డ(లక్ష్మి) బరాజ్‌కు 53,400 క్యూసెక్కుల వరద వచ్చింది. బరాజ్‌లోని మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం సమ్మక్క బరాజ్‌కు 2,52,400 క్యూసెక్కుల వరదనీరు రాగా.. మొత్తం 59 గేట్లకుగాను 52 గేట్లను ఎత్తి 2,51,817 క్యూసెక్కుల నీటిని దిగువకు పంపిస్తున్నారు.

పదేండ్లు అద్భుతం

> మొదటిపేజీ తరువాయి...

ఇంకా 28 మంది పేదరికంలోనే మగ్గుతున్నారు. తెలంగాణలో మాత్రం ప్రతి వంద మందిలో సగటున 91 మంది పేదరికం నుంచి బయటపడగా.. కేవలం ఎనిమిది మంది మాత్రమే పేదరికంలో ఉన్నట్టు నీతి ఆయోగ్ తాజా నివేదిక వెల్లడించింది. 92 స్కోరుతో పొరుగురాష్ట్రం తమిళనాడు పేదరికం తక్కువగా ఉన్న రాష్ట్రాల జాబితాలో అగ్రస్థానంలో ఉండగా, 91 స్కోరుతో తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. 86 స్కోరుతో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానాన్ని దక్కించుకొన్నది. దేశంలో అతితక్కువ పేదరికం ఉన్న రాష్ట్రాల జాబితాలో టాప్-3 రాష్ట్రాలు దక్షిణాదివే కావడం విశేషం. కాగా, బీజేపీపాలిత యూపీ 57, ఎన్డీయేపాలిత బీహార్ 39 స్కోరుతో పేదరికం ఎక్కువగా ఉన్న రాష్ట్రాలుగా మిగిలాయి.

తెలంగాణ భళా.. ఇలా..

స్థిరాభివృద్ధి లక్ష్యాలు	తెలంగాణ స్కోరు	జాతీయ సగటు స్కోరు
పేదరిక నిర్మూలన	91	72
విద్యుత్తు సరఫరా	100	96
ఆర్థికాభివృద్ధి	84	68
శుద్ధమైన తాగునీరు	90	89
నగరీకరణ	86	83
అసమానతల తొలగింపు	65	65
నాణ్యమైన విద్య	64	61
ఆకలిబాధలు లేకపోవడం	58	52

పన్నెండు మెరుగ్గా..

పేదరికం, ఆకలి సమస్యలు, ఆరోగ్యం, నాణ్యమైన విద్య, లింగ సమానత్వం, శుద్ధమైన తాగునీరు-పారిశుద్ధ్యం, విద్యుత్తు సరఫరా, ఆర్థికాభివృద్ధి, పారిశ్రామికీకరణ, నగరీకరణ ఇలా మొత్తం 13 అంశాల్లో నీతిఆయోగ్ స్కోర్‌ను వెల్లడించగా.. 12 కీలక అంశాల్లో తెలంగాణ మెరుగైన పనితీరు కనబర్చింది. సరసమైన రేటులో నాణ్యమైన విద్యుత్తు సరఫరా అంశంలో 100 మార్కులతో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. పేదరిక నిర్మూలనలో 91 మార్కులతో రెండో స్థానంలో, ఆర్థికాభివృద్ధిలో 84 మార్కులతో మూడో స్థానాన్ని దక్కించుకొన్నది. సేవల రంగంలో గ్రాస్ వ్యాల్యూ యాడెడ్ (జీవీఏ) వాటాను పెంచడంలో, అటవీ విస్తీర్ణం పెంచడంలో తెలంగాణ రెండో స్థానంలో ఉన్నట్టు నివేదిక వివరించింది.

ఎన్‌హెచ్‌ల భూసేకరణలో పీటముడి!

- నష్టపరిహారం పెంపునకు అనుమతించని ఎన్‌హెచ్‌ఏఐ
- పరిహారం పెంచకుంటే భూమిలిచ్చేది లేదంటున్న రైతులు
- ట్రిపుల్ ఆర్ సహా ఇతర రహదారులపై తీవ్ర ప్రభావం



సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ వద్ద రాజీవ్ రహదారిపై ధర్నా చేస్తున్న ట్రిపుల్ఆర్ భూబాధితులు (ఫైల్)

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): జాతీయ రహదారుల భూసేకరణలో మరో పీటముడి పడింది. నష్టపరిహారం విషయంలో రైతులు వెనక్కి తగ్గకపోవడంతో రహదారి ప్రాజెక్టులు ముందుకు సాగే అవకాశం కనిపించడంలేదు. రాష్ట్ర ప్రభుత్వం భూముల ధరలు పెంచినా భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చినాటికి ఉన్న ధరల ప్రకారమే నష్టపరిహారం చెల్లించాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. మానవీయ కోణంలో ఆలోచించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు సూచించినప్పటికీ నిబంధనలను మార్చితే తప్ప తాము చేసేదేమీ లేదని వారు అంటున్నారు.

ఎన్‌హెచ్‌ఏఐ రాష్ట్రంలో చేపడుతున్న ప్రాజెక్టుల్లో నాగపూర్-మంచిర్యాల-విజయవాడ రహదారి, ప్రాంతీయ రింగు రోడ్డు (ట్రిపుల్ ఆర్) ప్రధానమైనవి. మంచిర్యాల-విజయవాడ రహదారిని గ్రీన్‌ఫీల్డ్ హైవేగా నిర్మిస్తుండటంతో ఇది పూర్తిగా వ్యవసాయ పొలాలమీంచే సాగుతున్నది. వీటికోసం మొత్తం 10,000 హెక్టార్ల పైచిలుకు భూములు సేకరించాల్సి ఉండగా, ఇప్పటివరకు సేకరించింది కేవలం 3000 హెక్టార్లు మాత్రమే. ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం పనులకు భూసేకరణ ప్రక్రియ చివరి దశకు చేరుకున్నది. దక్షిణ భాగం ట్రిపుల్ ఆర్ పనులకు అలైన్‌మెంటు ఖరారైతే నోటిఫికేషన్ జారీచేసి భూసేకరణ చేయాల్సి ఉంటుంది. రాష్ట్రంలో భూముల ధరలు ఆకాశాన్ని అంటుతుండగా, నష్టపరిహారం మాత్రం అరకొరగా (రిజిస్ట్రేషన్ ధరపై మూడు రెట్లు) చెల్లిస్తున్నారు. మెదక్ జిల్లాల్లో భూముల ధర బహిరంగ మార్కెట్‌లో ఎకరానికి కనీసం రూ.50 లక్షల వరకు ఉన్నప్పటికీ, రిజిస్ట్రేషన్ ధర మాత్రం సుమారు రూ. 2లక్షలుగా ఉంది. అక్కడ భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.6లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లిస్తున్నారు.

బహిరంగ మార్కెట్ ప్రకారం ఇస్తేనే భూములు

రాష్ట్ర ప్రభుత్వం ఒకవేళ భూముల ధరలు పెంచినా రూ.2 లక్షలను రూ.4లక్షల వరకు పెంచే అవకాశం ఉంటుంది తప్ప రూ.2 లక్షలను ఒకేసారి రూ.15-20 లక్షలకు పెంచే ఆస్కారం లేదని అధికారులు చెప్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధర ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తేనే భూములు వదులుకునేందుకు రైతులు ముందుకొచ్చే వీలుంది. రాష్ట్ర ప్రభుత్వం భూముల ధరలు పెంచినా ఆ మేరకు నష్టపరిహారం చెల్లించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ నిబంధనలు అనుమతించడంలేదు. ఒకసారి ఎన్‌హెచ్‌ఏఐ నిబంధనలను మార్చితే అది దేశవ్యాప్తంగా వర్తిస్తుందని, అందుకే ప్రస్తుతం కేంద్రం అంతటి సాహసం చేసే వీలులేదని వారు పేర్కొంటున్నారు.

కోర్టుకు వెళితే ప్రాజెక్టులు నిలిచిపోవాల్సిందే


ఎన్‌హెచ్‌ఏఐ చెల్లించే నష్టపరిహారం తీసుకునేందుకు రైతులు ఒప్పుకోకుంటే కలెక్టర్ అధ్యక్షతనగల ఆర్బిట్రేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు. ఆర్బిట్రేషన్ ఇరుపక్షాలను కూర్చోబెట్టి ఓ ధరను నిర్ణయిస్తుంది. రెండు పక్షాల్లో ఏ ఒక్కరు ఒప్పుకోకున్నా భూసేకరణ ముందుకు సాగే వీలులేదు. లేనిపక్షంలో ఇరుపక్షాలు కోర్టును ఆశ్రయించే అవకాశం ఉంది. కోర్టుకు వెళితే ప్రాజెక్టులు ముందుకు సాగడం కలనేకమే.

ఎన్‌హెచ్‌ఏఐ ప్రాంతీయ అధికారిని మార్చండి!

ఆ సంస్థ చైర్మన్‌కు మంత్రి కోమటిరెడ్డి ఫిర్యాదు

హైదరాబాద్, జూలై 18(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ)ప్రాంతీయ అధికారిని మార్చాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆ సంస్థ చైర్మన్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. రాష్ట్ర రహదారుల శాఖతో ఎన్‌హెచ్‌ఏఐ సమన్వయంతో పనిచేయడం లేదని, దీంతో రాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టుల్లో తీవ్ర జాప్యం జరుగుతుందని ఇటీవల మంత్రి ఢిల్లీ పర్యటన సందర్భంగా చైర్మన్‌కు చెప్పినట్టు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా సమాచారం కోరితే స్పందించడం లేదని ఆరోపించినట్టు తెలిసింది. దీనిపై చైర్మన్ స్పందించి ఆర్‌వోను మార్చుతామని హామీ ఇచ్చినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం.

వీధి కుక్కల కట్టడికి చర్యలేవి?



స్టెరిలైజ్ చేస్తే దాడి చేయకుండా ఉంటాయా? • ఆరు కమిటీలుంటే సరిపోతుందా?

రాష్ట్ర ప్రభుత్వం తీరుపై హైకోర్టు ఆగ్రహం • పరిష్కార మార్గాలతో రావాలని ఆదేశం

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): వీధికుక్కల నియంత్రణకు తీసుకున్న చర్యలేమిటని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. వీధి కుక్కల నియంత్రణకు తీసుకున్న చర్యలపై సమగ్ర వివరాలతో, పరిష్కార మార్గాలతో వారంలోగా నివేదించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, జీహెచ్‌ఎంసీని ఆదేశించింది. వీధి కుక్కల దాడులపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై హైకోర్టు గురువారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా వీధి కుక్కలు చిన్నారుల మీద దాడి చేసిన ఘటనలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వ చర్యలు ఆశాజనకంగా లేవని ఆగ్రహం వ్యక్తంచేసింది. గత విచారణలో ఎంత చెప్పినా ఫలితం అంతంతమాత్రంగానే ఉన్నదని మండిపడింది. కుక్కలకు స్టెరిలైజ్ చేస్తే సరిపోతుందా? చిన్నారులపై వీరంగం చేయకుండా ఉంటాయా? అని నిలదీసింది. కుక్కల బారిన పిల్లలు పడకుండా ఉండేందుకు పరిష్కారమార్గాలతో రావాలని రాష్ట్రానికి తేల్చి చెప్పింది. ఆరు కమిటీలను ఏర్పాటు చేసినంత మాత్రాన సరిపోదని, చర్యలు కూడా ఉండకపోతే ఎలాగని ప్రశ్నించింది. వీధి కుక్కల దాడిలో పిల్లలు చనిపోయిన ఘటనలకు ఎవరు బాధ్యత వహించాలంటూ నిప్పులు చెరిగింది. వీధుల్లో చెత్త వేయకపోవడం వల్ల వీధి కుక్కల పరిసరాలు ఎక్కువవుతుంటాయని, ఈ క్రమంలోనే పిల్లలపై కుక్కల దాడులు పెరుగుతున్నాయని అభిప్రాయపడింది. వీధుల్లో చెత్త వేయకపోవడానికి అధికారులదే బాధ్యత అని వ్యాఖ్యానించింది. ఈ సమస్యను పరిష్కరిస్తేనే కుక్కల దాడులు తగ్గే అవకాశముందని స్పష్టం చేసింది. వీధికుక్కల నియంత్రణ సక్రమంగా లేదని, వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ వేయడంలేదని, సరైన ఆహారం లేకపోవడంతో జనంపై దాడి చేసి కరుస్తున్నాయని న్యాయవాది మామిడిపూడి చెందిన ఎం విక్రమాదిత్య గతేడు ఫిబ్రవరి 19న ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. నగరంలోని బాగ్ అంబర్‌పేట ప్రాంతంలో కుక్కల దాడిలో ఓ విద్యార్థి మరణించినట్టు పత్రికల్లో వచ్చిన కథనాన్ని హైకోర్టు సుమోటోగా తీసుకుంది. గత నెల 20న సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో వీధికుక్కల దాడిలో బీహార్‌కు చెందిన వలస కార్మికుని కుమారుడు మరణించారు. జవహర్‌నగర్‌లో బుధవారం కుక్కల దాడిలో ఒక బాలుడు మరణించారు. వీటిపై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం తదుపరి విచారణను ఈ నెల 31వ తేదీకి వాయిదా వేసింది.

ఒక్కరోజు కూడా కొనసాగడానికి లేదు

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కేసులో బీఆర్ఎస్ వాదన • విచారణను 22కు వాయిదా వేసిన హైకోర్టు

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టోపై గెలుపొందిన ఖైరతాబాద్, స్టేషన్ ఘన్‌పూర్, భద్రాచలం ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని తీవ్రంగా పరిగణించాలని బీఆర్ఎస్ పార్టీ న్యాయవాదులు హైకోర్టుకు విజ్ఞప్తిచేశారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఒకరోజు కూడా ఆ పదవుల్లో కొనసాగడానికి వీల్లేదని చెప్పారు. ప్రజాతీర్పును కాలరాసిన వ్యక్తులకు చట్టసభల్లో నిర్ణయాలు తీసుకునే అవకాశం ఇవ్వరాదని హైకోర్టును కోరారు. స్పీకర్‌కు ఫిర్యాదు అందిన మూడు నెలల్లోగా పరిష్కరించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసిన విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని అభ్యర్థించారు. బీఆర్ఎస్ తరఫున గెలుపొందిన కొద్దిరోజులకే కాంగ్రెస్ పార్టీలో చేరిన శాసనసభ్యులు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపై అనర్హత వేటు వేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలపై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి గురువారం మరోసారి విచారణ జరిపారు. పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాదులు గండ్ర మోహన్‌రావు, జే రామచందర్‌రావు వాదనలు వినిపిస్తూ.. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వారిపై స్పీకర్ చర్యలు తీసుకునేలా ఉత్తర్వులు జారీ చేయడం వల్ల ఇతర ఎమ్మెల్యేలు ఫిరాయించకుండా నిరోధించేందుకు వీలవుతుందని అన్నారు. ఆ ముగ్గురు ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని స్పీకర్‌కు ఫిర్యాదు అందినప్పటికీ చర్యలు లేకపోవడం వల్ల హైకోర్టుకు రావాల్సి వచ్చిందని వివరించారు. తమ వాదనలు పూర్తయినా ప్రభుత్వం వాదనలు పూర్తి చేయకుండా కాలయాపన చేస్తున్నదని అన్నారు. దీనిపై అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి ప్రతివాదన చేస్తూ, స్పీకర్‌కు కోర్టులు ఉత్తర్వులు జారీ చేయలేవని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ఉన్నాయని చెప్పారు. రాజ్యాంగం ప్రకారం చట్టసభకు స్పీకర్ అత్యున్నత స్థాయిలోని వారని తెలిపారు. భోజన విరామం వరకు వాదనలు కొనసాగడంతో తదుపరి విచారణను సోమవారానికి (22వ తేదీకి) వాయిదా వేయాలని కోరగా అందుకు రామచందర్‌రావు అభ్యంతరం చెప్పారు. పిటిషనర్ల వాదనలు అయ్యాక కేసు సత్వర విచారణకు ప్రభుత్వం సహకరించడం లేదని అన్నారు. మ. 3 గంటలకు విచారణ కొనసాగించి పూర్తి చేయాలని హైకోర్టును కోరారు. విచారణ ఎప్పుడు జరగాలనే అంశంపై ఏజీ అభ్యంతరం చెప్పారు. ఈ సమయంలో న్యాయమూర్తి కల్పించుకుని, ఈ వివాదంలో కోర్టును బద్నాం చేస్తున్నారని, వివాదాన్ని పరిష్కరించడమే తమ విధి అని చెప్పారు. విచారణ ఈ నెల 22కు వాయిదా పడింది.

బీరు బాటిల్‌లో సిగరెట్ ముక్కలు



యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురంలో నరసింహస్వామి వైన్స్‌లో గురువారం ముగ్గురు యువకులు బీరు కొనుగోలు చేశారు. బాటిల్‌ను ఓపెన్ చేసే సమయంలో అందులో సిగరెట్ ముక్కలు కనిపించాయి. వైన్స్ సిబ్బందిని నిలదీయగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. వైన్స్‌పై చర్యలు తీసుకోవాలని మద్యం ప్రియులు డిమాండ్ చేశారు.

-సంస్థాన్ నారాయణపురం

రోడ్లపై గుంతలకు ఓ యాప్

ప్రభుత్వానికి హైకోర్టు సూచన

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): రోడ్లపై గుంతల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఒక యాప్‌ను ఏర్పాటు చేయవచ్చు కదా అని హైకోర్టు సూచించింది. జనం ఆ యాప్ ద్వారా తెలియజేసే ఫిర్యాదులను పరిశీలించి పరిష్కార చర్యలు తీసుకోడానికి సులభం అవుతుందని చెప్పింది. ఈ విధానం కర్ణాటకలో అమల్లో ఉన్నదని తెలిపింది. రోడ్లపై గుంతల పూడ్చివేతకు తీసుకున్న చర్యలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. రోడ్లపై గుంతల్లో పడి కొందరు చనిపోయారని, మ్యాన్‌హోల్స్‌లో పడి చనిపోయిన ఘటనలు కూడా ఉన్నాయని, వారి కుటుంబాలకు పరిహారం చెల్లించేలా ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇవ్వాలని అడ్వకేట్ కే అఖిల్ శ్రీగురుతేజ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. వాదనల తర్వాత హైకోర్టు యాప్ ప్రతిపాదన చేస్తూ తదుపరి విచారణను ఈ నెల 31కి వాయిదా వేసింది.

23 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- 10 రోజులపాటు నిర్వహణ
- 25 లేదా 26న బడ్జెట్

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 23న ప్రారంభంకానున్నాయి. దాదాపు 10 రోజులపాటు ఈ సమావేశాలు కొనసాగుతాయి. 25 లేదా 26న బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి 'రికార్డ్ ఆఫ్ రైట్స్'(ఆర్‌వోఆర్) బిల్లును ఈ సమావేశాల్లోనే ప్రవేశపెట్టనున్నట్టు సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డి వచ్చే నెల 3 నుంచి అమెరికాలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో దాదాపు 10 రోజులు సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నది. కంటోన్మెంట్ శాసనసభ్యురాలిగా ఉన్న సమయంలో మరణించిన లాస్య నందిత కు సభ సంతాపం తెలుపనుంది.

వాలంతరి డీజీగా కృష్ణారెడ్డి

మంచిర్యాల సీఈగా శివకుమార్

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): నీటిపారుదలశాఖ ఎస్ఈ బీవీ కృష్ణారెడ్డిని వాలంతరి డీజీగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఇరిగేషన్‌శాఖ సర్కిల్-2లో ఎస్ఈ శివకుమార్‌ను మంచిర్యాల సీఈగా నియమిస్తూ గురువారం ప్రభుత్వ కార్యదర్శి రాహుల్ బొజ్జ ఉత్తర్వులు జారీచేశారు.

నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్‌పై దృష్టి పెట్టండి

- ఇరిగేషన్ అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం
- నాలుగు వారాలకోసారి ప్రాజెక్టుపై సమీక్ష

హైదరాబాద్, జూలై18 (నమస్తే తెలంగాణ): నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకంపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సాగునీటిపారుదలశాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్‌జీవన్‌పాటిల్, ఈఎన్సీ అనిల్‌కుమార్, ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ రమణారెడ్డి, ఇతర అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత త్వరగా లిఫ్ట్ పనుల గ్రౌండింగ్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టు ద్వారా లక్ష ఎకరాలకు నీరందుతుందని వెల్లడించారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులపై ప్రతి నాలుగు వారాలకోసారి సమీక్షిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. కొడంగల్‌లో ఫిష్ మార్కెట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, మద్దూరు రెసిడెన్షియల్ క్యాంపస్ నిర్మాణంపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.



- ప్రకృతి వనంలో సేదదీరుతూ...

గ్రామీణ ప్రాంత ప్రజలు సాయంత్రం వేళల్లో సేదతీరడానికి ప్రతి పల్లెలోనూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం పల్లెప్రకృతి వనాలను నిర్మించింది. పచ్చని మొక్కలను పెంచి పార్కులను తీర్చిదిద్దింది. అందులో భాగంగానే.. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముఖ్రా(కే)లో పల్లెప్రకృతి వనాన్ని ఏర్పాటు చేసింది. గురువారం సాయంత్రం గ్రామానికి చెందిన ఓ తాత, ఓ అవ్వ తమ మనవరాలితో కలిసి ఊయ్యాల ఊగుతూ ఆనందంగా గడిపారు. కబుర్లు చెప్పుకుంటూ సాయంత్రాన్ని ఆస్వాదిస్తున్న దృశ్యాన్ని 'నమస్తేతెలంగాణ' కెమెరా క్లిక్‌మనిపించింది.

-ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్



ఏడో విడత గ్రీన్ ఇండియా చాలెంజ్‌కు పిలుపునిస్తున్న మాజీ ఎంపీ సంతోష్‌కుమార్

డీజీపీ గారూ ఇదేం భాష?

- లారీ డ్రైవర్‌పై చేయిచేసుకున్న ట్రాఫిక్ ఎస్సై
- వినరాని, రాయలేని భాషలో దుర్భాషలు
- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- ప్రజల జీతాలిస్తున్నారని గుర్తుంచుకోవాలి
- కేటీఆర్ ట్వీట్.. జవాబివ్వాలని డీజీపీకి డిమాండ్
- ఆ పోలీసు అధికారిని బదిలీ చేసినట్టు వివరణ



హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): డీజీపీ గారూ ఇదేం భాష.. ఇటీవల కొందరు పోలీసులు పలుచోట్ల ప్రజలపై తీవ్ర దుర్భాషలాడిన ఘటనలు వెలుగు చూస్తున్నాయి.. ఓఆర్ఆర్‌పై ట్రాఫిక్ ఎస్సై దాడి, దుర్భాషలాడిన ఘటన వెలుగుచూసింది. ఇది పోలీస్ శాఖకు, మీకు ఆంగీకారయోగ్యమేనా? అంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఓఆర్ఆర్ గండి మైసమ్మ ఆలయ సమీపంలో గురువారం ట్రాఫిక్ ఎస్సై ఓ వాహనదారుడిపై చేయిచేసుకొని దుర్భాషలాడిన వీడియోపై కేటీఆర్ స్పందించారు. ప్రజల పట్ల పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై, మాట్లాడుతున్న భాషపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వినరాని, వార్తా పత్రికల్లో రాయలేని భాషలో సాధారణ పౌరులపై పోలీస్ సిబ్బంది విరుచుకుపడుతున్నారని విమర్శించారు. పోలీసులకు, ప్రభుత్వ సిబ్బందికి ప్రజలే జీతాలు చెల్లిస్తున్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని, ప్రజలతో పోలీసులు ప్రవర్తిస్తున్న తీరు అనేకసార్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. పదుల సంఖ్యలో సోషల్ మీడియాలో వీడియోలు వస్తున్నా ఉన్నతాధికారులు స్పందించడం లేదని పేర్కొన్నారు. ప్రజలతో వ్యవహరించే విషయంలో పోలీస్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఓఆర్ఆర్‌పై ట్రాఫిక్ ఎస్సై దౌర్జన్యం, దుర్భాషల వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై గురువారం ట్వీట్ చేసిన కేటీఆర్.. డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆ స్టేషన్ నుంచి బదిలీ చేశాం: పోలీస్‌శాఖ

కేటీఆర్ ఎక్స్ వేదికగా చేసిన ఫిర్యాదు మేరకు తెలంగాణ పోలీస్ శాఖ స్పందించింది. లారీ డ్రైవర్‌పై దాడి చేసి, దుర్భాషలాడిన ట్రాఫిక్ ఎస్సై ఘటన సైబరాబాద్ జీడిమెట్ల ట్రాఫిక్ స్టేషన్ పరిధిలో జరిగినట్టు ఉన్నతాధికారులు తెలిపారు. బాధ్యుడైన అధికారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. సదరు ఎస్సైని ఆ స్టేషన్ నుంచి బదిలీ చేశామని ఎక్స్‌లో పేర్కొన్నారు.

చెట్టోకటైతే.. విత్తనం మరొకటవుతుందా?

'చెట్టు ఒకటైతే విత్తనం మరొకటవుతుందా? పాలించేటోడు ఎట్లుంటడో! కింద వ్యవస్థ కూడా అట్లనే ఉంటది' అని బీఆర్‌ఎస్ పార్టీ ఓఆర్ఆర్‌పై ట్రాఫిక్ ఎస్సై ఘటనను అభివర్ణించింది. కొటర్ రింగ్ రోడ్డు గండి మైసమ్మ దగ్గర లారీ డ్రైవర్‌పై చేయిచేసుకొని దుర్భాషలాడిన ట్రాఫిక్ ఎస్సై తీరును ఆక్షేపించింది. తప్పు చేస్తే జరిమానా విధించాలి లేదా కేసు నమోదు చేయాలి. కానీ తీవ్ర దుర్భాషలాడటం ఏంటి? అని ప్రశ్నించింది. ఫ్రెండ్లీ పోలీసింగ్ కేసీసీ బూతుల పోలీసింగ్ తెచ్చుడేనా మీ మార్పు? అని నిలదీసింది. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేసింది.

5 రోజుల్లో ఏడో విడత గ్రీన్ ఇండియా చాలెంజ్

- రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్‌కుమార్ వెల్లడి

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): ఏడో విడత గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమాన్ని మరో ఐదు రోజుల్లో ప్రారంభించనున్నట్టు రాజ్యసభ మాజీ సభ్యుడు, గ్రీన్ ఇండియా చాలెంజ్ సృష్టికర్త సంతోష్‌కుమార్ తెలిపారు. భారతదేశాన్ని హరితమయంగా మార్చేందుకు ప్రతి ఒక్కరు 'హర హైతో భారా హై- గ్రీన్ ఇండియా చాలెంజ్' (భూమి పచ్చగా ఉంటే లోకం నిండుగా ఉంటుంది)లో చేరాలని ఆయన పిలుపునిచ్చారు. భూమిని పచ్చగా ఉంచేందుకు, జీవజాతుల ప్రాణాలను కాపాడేందుకు అందరం మొక్కలు నాటుదామని గురువారం ఎక్స్ వేదికగా పిలుపునిచ్చారు. వాతావరణ సమతుల్యత, జీవజాతుల ప్రాణాలను రక్షించడంలో పచ్చదనం పాత్ర చాలా కీలకమైనదని, ఈ పచ్చదనాన్ని కాపాడుకోవడానికి 'హర హైతో భారా హై- గ్రీన్ ఇండియా చాలెంజ్' ఉద్యమం పుట్టిందని గుర్తుచేశారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం స్ఫూర్తితోనే పచ్చదనం పెంపునకు కృషి చేస్తున్నట్టు సంతోష్‌కుమార్ వెల్లడించారు.

ఆదిలాబాద్ వైస్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

- పదవి కోల్పోయిన కాంగ్రెస్ వీసీ జహీర్‌రంజానీ
- అనుకూలంగా ఓటు వేసిన ఐదుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు



ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ కార్యాలయం ఎదుట సంబురాలు చేసుకుంటున్న మాజీ మంత్రి జోగు రామన్న, బీఆర్‌ఎస్ నాయకులు

ఆదిలాబాద్, జూలై 18(నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు జహీర్‌రంజానీపై బీఆర్‌ఎస్, బీజేపీతోపాటు సొంత పార్టీకి చెందిన కాంగ్రెస్ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారి, ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్‌కుమార్ అవిశ్వాస తీర్మాన సమావేశం నిర్వహించారు. తీర్మానానికి అనుకూలంగా 34 మంది ఓటు వేయడంతో వైస్ చైర్మన్ జహీర్‌రంజానీ తన పదవిని వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. కాంగ్రెస్‌కు చెందిన ఐదుగురు కౌన్సిలర్లతోపాటు 19 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, తొమ్మిది మంది బీజేపీ, ఒక ఎంఐఎం కౌన్సిలర్ అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేశారు. కాంగ్రెస్ వైస్ చైర్మన్‌కు వ్యతిరేకంగా సొంత పార్టీ కౌన్సిలర్లు ఓటు వేయడం చర్చనీయాంశంగా మారింది. బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన జహీర్‌రంజానీ అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. సొంతపార్టీ నేతలు ఆయన రాకను వ్యతిరేకించారు. వైస్ చైర్మన్ పదవిని నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ నాయకులు కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేసినా ఫలించలేదు. మాజీ మంత్రి జోగు రామన్న, బీఆర్‌ఎస్ నాయకులు పార్టీ కార్యాలయం ఎదుట సంబురాలు చేసుకున్నారు.

'దాశరథి' పురస్కారం కోసం కమిటీ

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): దాశరథి కృష్ణమాచార్య ఆ వార్డు-2024కోసం సాహితీవేత్తను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం ఆరుగురు సభ్యులతో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. కవి డాక్టర్ ఎస్ గోపి అధ్యక్షతన సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మెంబర్ కన్వీనర్‌గా, విశ్రాంత ప్రొఫెసర్ కేతవరపు కాత్యాయని, కవి జయరాజు, అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, మహబూబ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ లెక్చరర్ డాక్టర్ సీతారామ్ సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ సాహితీ రంగంలో విశిష్ట సేవలందించిన కవులు, సాహితీవేత్తల్లో ఒకరిని ఎంపికచేసి వారి పేరును ప్రభుత్వానికి నామినేట్ చేస్తుంది. ఎంపికైన వారికి ఈ నెల 22న దాశరథి కృష్ణమా7/18/2024 9:04:35 PMచార్య జయంతి సందర్భంగా జ్ఞాపికతోపాటు రూ. 1,01,116 నగదు బహూకరిస్తారు.



మరణించిన కౌలు రైతు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న జస్టిస్ చంద్రకుమార్

కౌలు రైతులపై ప్రభుత్వానికి పట్టింపేది?

- రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ నిలదీత

హైదరాబాద్ (ఖైరతాబాద్), జూలై 18: కౌలు రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం లేదని రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రైతు సంక్షేమ సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "కౌలు రైతులు అప్పు చేసి పంట సాగు చేస్తున్నారు. ఒకవేళ పంట దెబ్బతింటే ఏం చెయ్యాలో దిక్కుతోచక ఆత్మహత్య చేసుకుంటున్నారు. సామాన్య రైతులకు అమలు చేస్తున్న పంట నష్టపరిహారాన్ని పెంచి కౌలు రైతులకు కూడా ఇస్తే బాగుంటుంది. పంట బీమా కూడా వర్తింపజేస్తే మేలు జరుగుతుంది' అని పేర్కొన్నారు. కౌలు రైతును ఆదుకునేందుకు రుణమాఫీ తరహాలో ఏదైనా ఆర్థికసాయం ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు రూ.10వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. తెలంగాణ విఠల్, టీజేఏసీ అధ్యక్షుడు పృథ్వీరాజ్, సోమిడి శ్రీనివాస్, జీఎల్ నరసింహారావు, పాండురంగాచారి పాల్గొన్నారు.

టీచర్లు వేధిస్తున్నారని డీఈవో ఫిర్యాదు

- ఒత్తిడి తట్టుకోలేక నిజామాబాద్ రూరల్ పోలీసులకు కంప్లైంట్

ఖలీల్‌వాడి, జూలై 18: కొంత మంది ఉపాధ్యాయులు, మాజీ టీచర్లు తనను మానసికంగా వేధిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు నిజామాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. ఉద్యోగుల బదిలీల విషయంలో తనపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని వాపోయారు. ఇటీవల జరిగిన పదోన్నతుల్లో సిరికొండ మండలంలో పలు అక్రమాలు జరిగాయని కొన్ని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపించాయని, పలువురు టీచర్లు సైతం తమకు అన్యాయం జరిగిందంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే కొందరు టీచర్లు తనను వేధిస్తున్నారని ఇటీవల రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు శంకర్, స్కూల్ అసిస్టెంట్ బాలయ్య, ఇతరులు తనపై వ్యక్తిగతంగా ప్రచారాలు చేస్తూ మానసిక క్షోభకు గురిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్టు వివరించారు. ప్రతి విషయానికి కార్యాలయానికి వచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. వారి వల్ల తనతోపాటు తన కుటుంబం కూడా ఇబ్బంది పడుతున్నదని, ఈ ఒత్తిడిని తట్టుకోలేకే పోలీసులకు ఫిర్యాదు చేశానని డీఈవో స్పష్టం చేశారు.



నిజామాబాద్ డీఈవో దుర్గాప్రసాద్

బీసీలకు మొండి 'చెయ్యే'నా!

- రిజర్వేషన్లు లేకుండానే స్థానిక ఎన్నికలకు కుట్ర
- బీసీ జన సభ అధ్యక్షుడు రాజారాం యాదవ్ విమర్శ



సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బహిరంగ లేఖను విడుదల చేస్తున్న రాజారాంయాదవ్

ఖైరతాబాద్, జూలై 18: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు మొండిచేయి చూపించే ప్రణాళికతో ఉన్నదని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రిజర్వేషన్లు లేకుండానే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని పేర్కొన్నారు. సమగ్ర కుల గణన, 42 శాతం రిజర్వేషన్లపై రెండు నెలలుగా బీసీ జనసభ, బీసీ కులాలు, సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వానికి సోయి రావడం లేదని విమర్శించారు. మొక్కుబడిగా అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి చేతులు దులుపుకున్నారని, ప్రణాళికబద్ధమైన కార్యాచరణకు ప్రభుత్వం పేయడం లేదని మండిపడ్డారు. ఇప్పటికి ఏడు నెలలు కాలయాపన చేశారని, ఇప్పుడు దళపరమైన సమస్యలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కొందరు ప్రైవేట్ వ్యక్తులతో కేసులు వేయించి, రాజ్యాంగ సంక్షోభం పేరుతో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగేలా కుట్రలు చేస్తున్నట్టు తమ వద్ద సమాచారం ఉన్నదని తెలిపారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి అనుసరిస్తున్న వైఖరి, ఆయన వ్యాఖ్యలే నిదర్శనమని పేర్కొన్నారు. ఇటీవల అధికారులతో సమీక్ష నిర్వహించిన సీఎం.. కులగణన సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని, మాజీ మంత్రి జానారెడ్డి సలహాలు తీసుకోవాలని సెలవిచ్చారని అన్నారు. వాస్తవానికి గత అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు 65 సీట్లు కేటాయించాలని, కానీ ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ప్రకారం కనీసం 34 సీట్లు రావాలని, కాని 20 మాత్రమే ఇచ్చారని, అందులోనూ ఓడిపోయే పాతబస్తీ సీటును బీసీకి ఇచ్చారని అన్నారు. కులగణనపై కాంగ్రెస్ ప్రభుత్వ స్పష్టమైన వైఖరి ప్రకటించకుంటే త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. సమావేశంలో హిందూ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్లు, ఎంబీసీల ఫోరం అధ్యక్షుడు కటారి మురిరాజ్, న్యాయవాద జేఏసీ అధ్యక్షుడు గోవర్ధన్, ఎంబీసీ సంఘం జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ, అంబేద్కర్ యువజన సంఘం జాతీయ సభ్యుడు సహదేవ, విద్యార్థి, నిరుద్యోగ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొంపెల్లి రాజు, ఓయూ విద్యార్థి సంఘాల జేఏసీ అధ్యక్షుడు లింగం, తెలంగాణ విద్యార్థి పరిషత్ అధ్యక్షుడు బాలి అశోక్ పాల్గొన్నారు.

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

నేపాల్‌లో కుర్చీలాట

నేపాల్‌లో మరోసారి రాజకీయ అస్థిరత చోటుచేసుకుని ప్రభుత్వం మారిపోయింది. 2008లో రాజరిక వ్యవస్థ రద్దయిపోయి గణతంత్ర దేశంగా ఆవిర్భవించిన తర్వాత గడిచిన 16 ఏండ్ల కాల వ్యవధిలో అక్కడ 13 ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. గత రెండేండ్లలోనే మూడో ప్రభుత్వం కొలువుదీరింది. పుష్పకమల్ దహాల్ అలియాస్ ప్రచండ ఇటీవల అవిశ్వాస తీర్మానం కారణంగా తన పదవి కోల్పోయారు. ఆయన స్థానంలో చైనా అనుకూల నేపాల్ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు కేపీ శర్మ ఓలీ.. నేపాల్ కాంగ్రెస్ పార్టీ మద్దతుతో ప్రధాని పదవి చేపట్టారు. పదే పదే సంకీర్ణాలు మారుతుండటం వల్ల ప్రధానులు మారిపోవడం నేపాల్‌లో పరిపాటి అయ్యింది. ఓలీ ప్రధాని పదవి చేపట్టడం ఇది నాలుగోసారి.

ఇలా ఎడతెరిపి లేకుండా సాగుతున్న కుర్చీలాటకు ఎన్నికల వ్యవస్థలో ఉన్న చిక్కులు కారణమవుతున్నాయి. నేపాల్ పార్లమెంటులో మొత్తం 275 స్థానాలుండగా అందులో 165 స్థానాలను మెజారిటీ ప్రాతిపదికన, 110 స్థానాలను దామాషా పద్ధతిన ఎన్నుకుంటున్నారు. దళితులు, మహిళలు, మైనారిటీలు సహా పీడిత వర్గాలన్నింటికీ ప్రాతినిధ్యం కల్పించి, కేంద్రీకృత అధికారం స్థానంలో సమాఖ్యవాదం తేవాలనే ఉద్దేశంతో ఈ విధానం తెచ్చారు. ఈ మిశ్రమ విధానం ఫలితంగా ఏ ఒక్క పార్టీకీ పూర్తి మెజారిటీ రాక సంకీర్ణాలు తప్పడం లేదు. చిన్న చిన్న పార్టీలు విడివిడిగా స్థానాలు గెలుస్తుండటం వల్ల పెద్ద పార్టీల్లో దేనికీ పూర్తి మెజారిటీ వచ్చే అవకాశం ఉండటం లేదన్నది వాస్తవం. రాజకీయ అస్థిరతకు కారణమవుతున్న ఈ రెండు రకాల ఎన్నికల విధానాన్ని మార్చి, అంతటా మెజారిటీ పద్ధతి తేవాలని నూతన ప్రధాని ఓలీ భావిస్తున్నారు. అయితే ఇది తేనెతుట్టెను కదిలించడమే అవుతుందన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. రద్దయిపోయిన రాజరిక వ్యవస్థ, హిందూరాజ్య పునరుద్ధరణ డిమాండ్లు తలెత్తవచ్చనే సందేహాలే అందుకు కారణం.

కొత్త ప్రధాని ముందు అనేక సవాళ్లున్నాయనేది ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. సరిహద్దు దేశాలైన భారత్, చైనాలతో సమతూకం పాటించడం అనేది అందులో ఒకటి. నేపాల్‌లో చైనా ప్రాబల్యం పెరుగుతుండటం వల్ల భారత్ పాత్ర పెద్దన్నయ్య నుంచి సమవుజ్జీ స్థాయికి చేరుకుంది. నేపాల్‌తో సహా యావత్తు దక్షిణాసియాపై పట్టు కోసం భారత్, చైనా మధ్య పోటీ నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో చైనా అనుకూల ఓలీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టడం భారత్‌కు ఒక విధంగా ప్రతికూల పరిణామమే. గతంలో భారత్-నేపాల్ సంబంధాల్లో పొరపొచ్చాలకు ఓలీ కారణమయ్యారన్న సంగతి మరచిపోరాదు. చమురు, ఆహార పదార్థాలతో సహా నిత్యావసర వస్తువుల కోసం నేపాల్ భారత్‌పైనే ఎక్కువగా ఆధారపడుతున్నది. అలాగే సుమారు 40 లక్షల మంది నేపాలీలు చదువు, ఉపాధి కోసం భారత్‌కు వలస వస్తుంటారు. చైనా పోటీ వల్ల భారత్ నేపాల్‌లో పెట్టుబడులు కూడా పెంచుకుంటున్నది. గతంలో ఓలీ రెండు దేశాల వాణిజ్యంలో ప్రతిష్టంభన తెచ్చినప్పుడు నేపాలీ ప్రజలు ఎంతగానో ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో ఓలీ మరోసారి భారత్‌తో గిల్లికజ్జాలకు దిగకపోవచ్చనే వాదన వినిపిస్తున్నది. అదే జరిగితే ఉభయ దేశాలకూ శ్రేయస్కరం.

అటకెక్కుతున్న కాంగ్రెస్ హామీలు

రితేష్ దేశ్‌ముఖ్ బాలీవుడ్ ప్రముఖ నటుడు, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కుమారుడు. ఆయన భార్య జెనీలియా కూడా మంచి నటి. భార్యాభర్తలిద్దరూ కలిసి సరదాగా రీల్స్ కూడా చేస్తుంటారు. ఒక రీల్‌లో 'పెళ్లికి ముందు డార్లింగ్ అంటూ రోజూ పొగిడేవాడివి, బహుమతులు, పువ్వులు ఇచ్చేవాడివి. పెళ్లయ్యాక ఏమైంది? అలా ప్రేమించడం లేద'ని జెనీలియా అడుగుతుంది. 'ప్రచారం ముగిసింది, పోలింగ్ ముగిసింది' అని రితేష్ దేశ్‌ముఖ్ బదులిస్తారు. నిజమే కదా? పోలింగ్‌కు ముందు రాజకీయ నాయకులు ఇంటింటికి తిరిగి ఓటర్లను ప్రేమ వర్షంలో ముంచెత్తుతారు కానీ, డబ్బాలో ఓట్లు పడి చేతిలోకి అధికారం వచ్చాక ఇక ప్రజలను వారెందుకు ప్రేమిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే రితేష్ దేశ్‌ముఖ్, జెనీలియా చేసిన రీల్ గుర్తుకువస్తున్నది.



బుద్దా మురళి



బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను యథావిధిగా అమలుచేసేందుకే నానా తంటాలు పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను సైతం సరిగా అమలు చేయలేక చతికిలపడుతున్నది. హైదరాబాద్‌లోని అశోక్ నగర్, చిక్కడపల్లి ప్రాంతాల్లో పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చే సంస్థలు కొన్ని వందలున్నాయి. వేలమంది నిరుద్యోగులు కోటి ఆశలతో అక్కడ పోటీ పరీక్షలకు సిద్ధమవుతుంటారు. నగర కేంద్ర గ్రంథాలయంలోకి వెళ్లి స్వయంగా చూస్తే తప్ప నమ్మలేనంత మంది చదువుతుంటారు. వరండాలో, ఓపెన్‌స్పేస్‌లో, చెట్ల కింద, వాహనాల స్టాండ్ వద్ద ఎక్కడ చూసినా విద్యార్థి గుంపులే. గతంలో ఎన్నడూ లేనివిధంగా నగర కేంద్ర గ్రంథాలయం తలుపులు మూసి నిరుద్యోగులను బయటకు రాకుండా పోలీసులు కాపలా ఉన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు, ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్‌గాంధీ అక్కడికి వచ్చి నిరుద్యోగులతో చాలాసేపు మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగ నియామకాలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఎలా జారీ చేయనున్నామో తేదీలతో సహా పత్రికల మొదటిపేజీల్లో ప్రకటనల ద్వారా హామీ ఇచ్చారు. ఎన్నికలు ముగిశాయి, కాంగ్రెస్ పార్టీకి అధికార పీఠం దక్కింది. నాటి వార్తాపత్రిక జీవితం ఒకరోజే కదా అనుకున్నారేమో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆ ప్రకటనలను గాలికివదిలేశారు.

ఇటీవల ఆందుకే ఇప్పుడు డీఎస్సీ పరీక్ష తేదీ మార్చాలంటూ, గ్రూప్ 2, 3 పరీక్షల నోటిఫికేషన్ ఇవ్వాలని నిరుద్యోగులు ఆందోళన చేస్తుంటే వారిని కాంగ్రెస్ ప్రభుత్వం అణిచివేసింది. గ్రంథాలయంలో నిర్బంధించింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్లకు సంబంధించి ప్రక్రియ అంతా పూర్తయ్యాక కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 30 వేల ఉద్యోగాల నియామక పత్రాలు ఇవ్వడం తప్ప కొత్త ఉద్యోగాలు ఇవ్వడం లేదు. లక్షలాది ఖాళీలున్నాయి, ఎప్పుడు భర్తీ చేస్తారని నిరుద్యోగులు ప్రశ్నిస్తుంటే, తెచ్చిన గత దీక్షలు చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు నిరుద్యోగులను తిట్టిన తిట్లు తిట్టకుండా తిడుతుండటం శోచనీయం.

రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కర్నె శిరీష (బర్రెలక్క) అనే ఓ యువతి 'నాకు ఉద్యోగం లేక నేను బర్రెలు కాసుకుంటున్న ఫ్రెండ్స్' అంటూ ఓ వీడియో చేసి బాగా పాపులర్ అయింది. ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వడం లేదంటూ యూట్యూబ్ ఛానల్ ద్వారా సంచలనం సృష్టించింది. ఏకంగా కొల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచింది. ఆ ఎన్నికల్లో ఆమె ఓడిపోయింది, అది వేరే విషయం. కానీ, రేవంత్ ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేయడం లేదంటూ ఆమె ఆందోళన చేస్తే కాంగ్రెస్ సర్కార్ ఆమెను అరెస్టు చేసింది. కేసీఆర్ హయామే బాగుండేదని ఇప్పుడు బర్రెలక్క కూడా అంటున్నది. ఒక్క ఆమెనే కాదు, మహబూబ్‌నగర్ జిల్లాలో అప్పుడు చెరువులు, కుంటలు నిండి పచ్చని పొలాలు కనిపించేవని, ఇప్పుడు అంతా ఎండిపోయిందని, ఇటు ఉద్యోగాలు లేవు, అటు వ్యవసాయం లేదని ఆ జిల్లా వాసులు వాపోతుండటం గమనార్హం.

ఒక్క ఉద్యోగాల విషయంలోనే కాదు, అన్ని హామీల విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వ పరిస్థితి ఇలానే ఉన్నది. గత ప్రభుత్వం అమలుచేసిన పథకాలు యథావిధిగా అమలు చేయాలంటేనే ప్రభుత్వ ఖజానాలో నిధులు లేవు. ఇంకా ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఇతర పథకాలకు నిధులెక్కడివి? సాధారణంగా ఏ పార్టీ అయినా అధికారంలోకి వస్తే గత ప్రభుత్వం కన్నా ఎక్కువ పథకాలు అమలుచేయాలని, గత ప్రభుత్వం కన్నా తమ ప్రభుత్వమే ఉత్తమం అని నిరూపించుకోవాలని చూస్తుంది. అదనం మాట దేవుడెరుగు, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేసిన పథకాలు సైతం అమలుచేసే స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం లేదు. సచివాలయంలో లంకె బిందెలుంటాయనుకున్నాను, అలా ఏమీ లేవని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన ప్రజలను ఆలోచింపజేస్తున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకునే మార్గాలపై ఇప్పటికే ముఖ్యమంత్రి నాలుగైదు సార్లు అధికారులతో సమావేశాలు నిర్వహించారు. భూముల రిజిస్ట్రేషన్ విలువ పెంచాలనేది అందులో వచ్చిన ఒక ఆలోచన. కానీ, రాష్ట్రంలో ప్రభుత్వం మారగానే రియల్ ఎస్టేట్ బాగా పడిపోయింది. హైదరాబాద్ ప్రధాన నగరంపై ప్రభావం తక్కువే కానీ ఇతర ప్రాంతాల్లో కోట్ల రూపాయలు పలికిన వ్యవసాయ భూముల ధరలు పడిపోయాయి. అమ్మకాలు, కొనుగోళ్లు లేవు. క్రయవిక్రయాలు తగ్గిపోయినప్పుడు ఆదాయం ఎలా పెరుగుతుంది.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆసరా పింఛన్లను నాలుగు వేలకు పెంచుతామని నాడు హామీ ఇచ్చారు. ఏడు నెలలు గడిచిపోయినా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ ఆ హామీని అమలుచేయలేదు. వ్యవసాయ రుణమాఫీకి రేషన్‌కార్డు లింకే పెట్టి రైతులందరి కొందరికే పరిమితం చేసి ఈ భారాన్ని సగం తగ్గించుకోవాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి.



కుక్కలున్నాయి... కూనలు జాగ్రత్త

'వీధి కుక్కల దాడిలో చిన్నారి మృతి' అనే వార్త చదివాక నా హృదయం కకావికలమైంది. దాడిచేసిన కుక్కలు ఆ చిన్నారిని పీక్కుతిన్న విధానాన్ని వీడియోలో చూసిన ప్రతి వ్యక్తి గుండె కన్నీరు కార్చకుండా ఉండదేమో! తాజాగా హైదరాబాద్‌లోని జవహర్‌నగర్‌లో జరిగిన వీధికుక్కల దాడి సంఘటన యావత్ ప్రజానీకాన్ని కదిలించింది. అయితే చిన్నారులపై వీధి కుక్కల దాడి ఘటనలు తరచూ జరుగుతుండటం ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నది.

గతంలోనూ ఇలాంటి ఘటనలు అనేకం జరిగాయి. నిద్రలో లేచి గుడిసె నుంచి బయటకువచ్చిన బాలుడిని అర్ధరాత్రి వేళ వీధి కుక్కలు దాడిచేసి చంపాయి. ఈ సంఘటన ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో జరిగింది. అయితే ఇక్కడ గమనించాల్సిన ఒక ముఖ్య విషయం ఏమంటే... కార్లలో తిరిగే ఉన్నత వర్గాల పిల్లలో, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ లాంటి ప్రదేశాల్లో నివసించే అత్యున్నత వర్గాల పిల్లలో కాదు కుక్క కాట్లకు బలయ్యేది. రాష్ట్ర నలుమూలల నుంచి నగరానికి వలస వచ్చి, గుడిసెల్లో బతుకుతున్న, రెక్కాడితేగానీ డొక్క నిండని పేద వర్గాల పిల్లలే వీధికుక్కల దాడులకు బలవుతున్నారు.

ఇలాంటి ఘటనలు జరుగుతున్నప్పుడు మాత్రమే స్పందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం శునక నియంత్రణ పద్ధతులను పాటిస్తున్నామని చెప్తున్నది. అయినా వాటి సంఖ్య మాత్రం తగ్గడం లేదు. పైగా వీటి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నదని గణాంకాలు తెలియజేస్తున్నాయి. కాగా, ఏటా ఫిబ్రవరి నుంచి ఆగస్టు మాసాల మధ్య వీధికుక్కల దాడులు తీవ్రతరమవుతున్నాయని కొన్ని సర్వేలు వెల్లడిస్తున్నాయి.

కుక్కల దాడులకు ముఖ్య కారణం వాటికి తగిన ఆహారం లభించకపోవడమే. గతంలో ప్రతి వీధిలో చెత్తకుండీ ఉండేది. తినగా మిగిలిన ఆహార పదార్థాలను వీధిలోని ప్రజలు ఆ కుండీల్లో వేసేవారు. ఆ రోజుల్లో కుక్కలకు అదే ఆహారమయ్యేది. అయితే నగరాల సుందరీకరణలో భాగంగా నగరాల్లోని చెత్తకుండీలు మాయమయ్యాయి. వాటి స్థానంలో ఇంటింటికీ చెత్త తరలింపు వాహనాలు వస్తున్నాయి. ఇక ప్రజలు తినగా మిగిలిన ఆహార పదార్థాలన్నీ దూరంగా, ఎక్కడో ఉన్న డంప్ యార్డుకు చేరుకుంటున్నాయి.

ఆకలి మనిషిని మృగంగా మారుస్తుందన్నాడొక మేధావి. వివేకం ఉన్న, అన్నీ తెలిసిన మనిషే ఆకలితో మృగంగా మారుతున్నప్పుడు నోరులేని జంతువులైన శునకాలు మృగాలుగా మారడంలో ఆశ్చర్యం లేదు. అందుకే పసి పిల్లల మీద వీధి కుక్కల దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. శునకాల ఆకలి సమస్యకు వెంటనే పరిష్కారం వెతకకపోతే కుక్కల దాడులకు పిల్లలు మాత్రమే కాదు, రానున్న రోజుల్లో పెద్దలు కూడా బలి కావాల్సి వస్తుంది. ఇంతటి తీవ్రమైన అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. పరిష్కారంగా తూతూ మంత్రంగా సాగే శునక నియంత్రణ కార్యక్రమాన్ని ప్రధాన కార్యక్రమంగా నిర్వహించాలి. అంతేకాదు, ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందిన దేశాల్లో పాటిస్తున్న శునక నియంత్రణా విధానాలను పరిశీలించి సాధ్యమైతే, రాష్ట్రంలోనూ అమలుచేయాలి.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న పలు దేశాల్లో రకరకాల జంతువులకు రకరకాల పార్కులున్నాయి. మన దేశంలోనూ జింకల కోసం పార్కులున్నాయి. భయంకరమైన జంతువులు సింహాలు, పులుల కోసం వేల ఎకరాల అభయారణ్యాలున్నాయి. కానీ, చిన్నపిల్లలపై దాడులు చేస్తున్న శునకాలకు పార్కులు లేవు. కాబట్టి కుక్కలకు కూడా నగరాలకు దూరంగా పార్కులను ఏర్పాటుచేయాలి. చదువడానికి విచిత్రంగా అనిపించవచ్చు కానీ, కుక్కల కోసం పార్కులను ఏర్పాటుచేసి, అవి ఆ పార్కు దాటిరాకుండా కంచెలను నిర్మించి, ఎప్పటికప్పుడు వాటికి ఆహారం అందిస్తే క్రమంగా కుక్కల సంఖ్యను నియంత్రించవచ్చు. అప్పుడే మనుషుల మీద కుక్కల దాడుల ఘటనలు తగ్గుతాయి. ఏదేమైనా పిల్లలపై వీధి కుక్కల దాడుల ఘటనలను ప్రభుత్వాలు తేలికగా తీసుకోవద్దు. రాష్ట్ర స్థాయిలోనే కాదు, జాతీయస్థాయిలోనూ ఈ అంశం చర్చలు జరపాల్సిన అవసరం ఉన్నది.



బసవరాజు నరేందర్ రావు
99085 16549

గాయమైన తెలంగాణ

అభివృద్ధి ఆగమైంది
తెలంగాణకు గాయమైంది
ప్రజా సంక్షేమం పాడైపోయింది

ప్రగతి పథ్వానికి పట్టించి
సంక్షేమం పాడు బతుకుల్లో ఉన్నది
కొన జీవితో కొట్టుకుంటున్నది

నీరు లేక చెరువు
నింగి దిక్కు చూస్తుంది
మాగాణి లేక
మా పల్లె మూగబోయింది

కల్యాణలక్ష్మి తులం బంగారం
పథకాలు అటుగుడు పడిపోయే
గ్యారెంటీలన్నీ గతం మత్తుతప్పి
పథకాల పథకాలు అమలు మతి తప్పే

ప్రజావాణి దుబ్బా
ప్రజలు తిరుగుతుండ్రు
నెరవేరని హామీలను
నెమరేసుకుంటున్నది జనం

ప్రజా పాలన
తప్పుడు తోవలో తొక్కిసలాట
గత పరిపాలన గంభీరంగా ఉన్నదని
మతి తప్పినందుకు యాక్టేసుకుంటున్నది



దేవనపల్లి కృష్ణమూర్తి
99634 49579

సీఎం గారూ.. కులగణన ఎప్పుడు?

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడు నెలలవుతున్నా బీసీ కులగణన హామీని నెరవేర్చకపోవడంపై పలు బీసీ సంఘాలు మండిపడ్డాయి. ఇప్పటివరకు సమగ్ర కులగణన జరపకపోవడం, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న కామారెడ్డి డిక్లరేషన్ కార్యరూపం దాల్చకపోవడంపై ఆయా సంఘాల నేతలు ముఖ్యమంత్రి రేవంత్‌ను నిలదీశారు. వివిధదశలు ప్రకటించకుండా స్థానిక సంస్థల ఎన్నికలు జరిపేందుకు కాంగ్రెస్ సర్కార్ సమాయత్తమవుతుండటాన్ని వాళ్లు తప్పుబట్టడమే కాదు, ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాశారు. ఆ లేఖ సారాంశం.



గౌరవనీయులైన సీఎం గారికి..

అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే సమగ్ర కులగణన జరిపి, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న కామారెడ్డి డిక్లరేషన్ హామీ ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. దీనిపై గత రెండు నెలలుగా బీసీ జనసభ, బీసీ కులాలు, బీసీ సంఘాలు పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మీ ప్రభుత్వం స్పందించడం లేదు. ముఖ్యంగా శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టి, చేతులు దులుపుకొన్నారే తప్ప ప్రణాళికాబద్ధంగా ఒక కార్యాచరణకు పూనుకోలేదు. పైగా ఈ అంశాన్ని ఇప్పుడు లీగల్ ఇష్యూలోకి నెట్టివేయాలని చూస్తున్నారు. కొంత మంది ప్రైవేట్ వ్యక్తులతో కేసులు వేయించి, అత్యున్నతమైన రాజ్యాంగ సంక్షోభం వస్తుందని చెప్పించి, ఎన్నికలు వెంటనే నిర్వహించాలంటూ కోర్టు ఆదేశాలు వచ్చేలా కుట్రలు చేస్తున్నారు. నోటితో మాట్లాడి, నొసటితో వెక్కిరించినట్టుగా మీ వ్యవహారశైలి ఉంది. మీ వైఖరి వల్ల బీసీల రాజకీయ అవకాశాలకు తీవ్ర విఘాతం కలిగే ప్రమాదం ఉన్నది.

ఇటీవల మీరు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమీక్ష జరిపారు. ఎన్నికలకు ఏర్పాట్లు చేసుకోవాలని, వీలైతే కులగణన సాధ్యాసాధ్యాలను పరిశీలించి, మాజీ మంత్రి జానారెడ్డి సలహాలు తీసుకోవాలని సెలవిచ్చారని వార్తలు వచ్చాయి. ఇక్కడే తమరి చిత్తశుద్ధిని శంకించాల్సి వస్తున్నది. ఎందుకంటే, గతంలో పంచాయతీరాజ్ మంత్రిగా పనిచేసిన జానారెడ్డి స్థానిక సంస్థల్లో బీసీలకు ఉన్న 33 శాతం రిజర్వేషన్లు 22 శాతానికి పడిపోవడానికి ప్రధాన కారకుడనే ఆరోపణలున్నాయి.

2004-2014 వరకు ఉమ్మడి ఏపీలో కొందరు బీసీ వ్యతిరేకులు స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 33 శాతం ఉండడం వల్ల రిజర్వేషన్లు 50 శాతం పరిమితి దాటుతుందని, అది రాజ్యాంగ వ్యతిరేకమని హైకోర్టుకు వెళ్లారు. అదృష్టవశాత్తూ జస్టిస్ రోహిణి బీసీలకు అనుకూలంగా తీర్పు ఇచ్చారు. కానీ, అదే బీసీ వ్యతిరేకులు జస్టిస్ రోహిణి తీర్పును సవాలు చేస్తూ హైకోర్టు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. దీంతో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ వల్ల స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ల పరిమితి దాటుతున్నదని, దాన్ని 50 శాతం పరిమితికి లోబడేటట్టు తగ్గించుకోవాలని హైకోర్టు ట్రిబ్యునల్ తీర్పునిచ్చింది. దీనికి ప్రధాన కారణం నాటి ప్రభుత్వం, ముఖ్యంగా అప్పటి పంచాయతీరాజ్ శాఖ మంత్రి జానారెడ్డినే. ఆయన సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున సవాలు చేయకపోవడంతోనే అప్పుడు అన్యాయం జరిగింది. చివరకు 2018లో హైకోర్టు ట్రిబ్యునల్ తీర్పును సమర్థిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. తద్వారా నేడు బీసీల రిజర్వేషన్లు 22 శాతానికి తగ్గే పరిస్థితి వచ్చింది. తమరు కులగణన, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు సాధ్యాసాధ్యాలపై ఇప్పుడు జానారెడ్డి సలహాలు తీసుకోవాలని అధికారులకు సూచించడం మాకు ఆశ్చర్యం కలిగిస్తున్నది.

ఓటర్ జాబితా ఆధారంగా కులగణన చేద్దామని మీరు చెప్తున్నారు. కానీ, ఓటర్ జాబితాలో ఎక్కడా కుల ప్రస్తావన ఉండదు. కుల అస్తిత్వ ప్రస్తావన లేని ఓటర్ జాబితా ఆధారంగా కులగణన ఎలా చేస్తారు. అశాస్త్రీయంగా కులగణన చేసి, న్యాయపరమైన చిక్కుల్లోకి నెట్టి, బీసీలకు రిజర్వేషన్లను అడ్డుకోవాలనే కుట్ర మీ చర్యల్లో స్పష్టంగా కనిపిస్తున్నది.

కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కులగణన చేసిన విషయం మీకు తెలిసిందే. గతేడాది బీహార్‌లోనూ సమగ్ర కులగణన నిర్వహించడమే కాకుండా ఈడబ్ల్యూఎస్ కలుపుకొని రిజర్వేషన్లను 75 శాతానికి పెంచి, విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలు, ఎంబీసీలకు పెద్దఎత్తున అవకాశాలు కల్పించారు. కాబట్టి, సమగ్ర కులగణన చేయకుండా ఉండేందుకు తమరు దారులు వెతకడం మానేసి, తక్షణమే దాని కోసం విధివిధానాలను రూపొందించాలి. వాటికోసం ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలి. న్యాయపరమైన చిక్కులు రాకుండా బీహార్, కర్ణాటక లాంటి రాష్ట్రాలను ఆదర్శంగా తీసుకోవాలి. అందుకోసం సామాజిక వర్గాల పట్ల సంపూర్ణ అవగాహన కలిగిన, సామాజిక శాస్త్రవేత్తలు, న్యాయకోవిదులైన ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్.సింహాద్రి, మాజీ న్యాయమూర్తులు జస్టిస్ చంద్రకుమార్, జస్టిస్ ఈశ్వరయ్య, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు సలహాలు తీసుకోవాలి.

సమగ్ర కులగణన హామీ కాంగ్రెస్ పార్టీ జాతీయ మ్యానిఫెస్టోలో ఉన్నది. సమగ్ర కులగణన చేసి, ఓబీసీ జనాభా లెక్కలు తీస్తామని, తద్వారా అన్నిరంగాల్లో ఎవరి వాటా ఎంతో తేలుస్తామని రాహుల్‌గాంధీ దేశమంతా కలియదిరిగి ప్రచారం చేశారు. మీరు మాత్రం కులగణనపై మీనమేషాలు లెక్కిస్తున్నారు. కులగణన బీసీ సమాజానికి జీవన్మరణ సమస్య. పదే పదే మీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకు పదవులు ఇస్తూ.. బీసీ సమాజాన్ని అవమానిస్తున్నది మీరు కాదా? గత అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు 65 సీట్లు ఇవ్వాల్సి ఉన్నది. కాంగ్రెస్ ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ప్రకారం 34 సీట్లు ఇవ్వాల్సి ఉండగా, 20 సీట్లు మాత్రమే ఇచ్చారు. ఇక మీరు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మీరు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ పదవులు, నామినేటెడ్ పదవులన్నింటిలోనూ బీసీలకు అన్యాయమే జరిగింది. అందుకే కులగణనపై ప్రభుత్వం తక్షణమే ఒక స్పష్టమైన వైఖరి తీసుకోవాలి. లేకుంటే త్వరలోనే బీసీ జనసభ, వివిధ బీసీ కుల సంఘాల ఆధ్వర్యంలో భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తాం.

– డి.రాజారాం యాదవ్, బత్తుల సిద్దేశ్వర్లు, కరుణాకర్ ముదిరాజ్, లొడంగి గోవర్ధన్, కొండూరు సత్యనారాయణ, మేకల కృష్ణ, కొంగర నరహరి, కొంపెల్లి రాజు, బొడ్డుపల్లి లింగం, భారి అశోక్



తుగ్లక్ దర్బార్‌ను తలపిస్తున్నది!

ప్రైవేట్ రంగంలో కన్నడిగులకు 100 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కర్ణాటక క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని మొదట మీరు (ముఖ్యమంత్రి సిద్ధరామయ్య) సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఆ తర్వాత కొంతసేపటికే దాన్ని తొలగించారు. అనంతరం మళ్లీ.. క్యాబినెట్‌లో అలాంటి నిర్ణయమేమీ తీసుకోలేదని చెప్పారు. ఇది క్యాబినెట్‌లా లేదు, తుగ్లక్ దర్బార్‌ను తలపిస్తున్నది.

- ఆర్.అశోక్, కర్ణాటక ప్రతిపక్ష నేత

రైతుబంధు పైసలు రుణమాఫీకి

> మొదటిపేజీ తరువాయి...

కేసీఆర్ సర్కార్ లక్షలోపు రుణాలను మాఫీ చేసేందుకు రూ. 16,144 కోట్లు వెచ్చించి సుమారు 35 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూర్చిందని గుర్తుచేశారు. 2018లో అదే లక్ష లోపు రుణమాఫీకి రూ. 19,198 కోట్లు అంచనా కాగా మొత్తం లబ్ధిదారుల సంఖ్య సుమారు 37 లక్షలు అని వివరించారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చినట్టు రూ. 2 లక్షల వరకు పంట రుణాలన్నీ వెంటనే మాఫీ చేయాలని, అర్హులైన రైతులందరికీ రైతుబంధు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మెడికల్ డివైజెస్ పార్క్ సంపద సృష్టించే వనరు

హైదరాబాద్‌ను మెడికల్ ఎక్విప్‌మెంట్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దాలన్న కృతనిశ్చయంతో కేసీఆర్ సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్‌లో మెడికల్ డివైజెస్ పార్క్ ఏర్పాటు చేశారని, అది రాష్ట్రానికి ఎంతో సంపద సృష్టించే వనరు కానుందని కేటీఆర్ తెలిపారు. ఈ పార్క్‌లో ఏర్పాటైన సహజానంద్ మెడికల్ టెక్నాలజీస్ లిమిటెడ్ మొదటిసారిగా స్టెంట్లను ఉత్పత్తి చేసిందని, ఆ సంస్థకు సంబంధించిన స్టెంట్లు నేటి నుంచి మార్కెట్‌లో రానుండటం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో ఉత్పత్తయ్యే ప్రొడక్ట్‌లు దేశ, ప్రపంచ వ్యాప్తంగా ఎక్స్‌పోర్ట్ కానుండటం గర్వంగా ఉందని చెప్పారు.

సవాల్‌కు సిద్ధం

> మొదటిపేజీ తరువాయి...

పదవుల కోసం పెదవులు మూసుకొని కూర్చుంటే, నేను మంత్రి, ఎమ్మెల్యే పదవులను తృణప్రాయంగా భావించి రాజీనామా చేసిన. నాకు పదవులు, రాజీనామాలు కొత్తకాదు. ప్రజలకు, రైతులకు, పేదలకు, అణగారిన వర్గాలకు నా వల్ల మంచి జరుగుతుందంటే నేను ఎన్నిసార్లు పదవులకు రాజీనామా చేసేందుకైనా వెనుకాడను' అని స్పష్టం చేశారు. 'మరోసారి చెబుతున్నా.. ఆగస్టు 15 వరకు రాష్ట్రంలోని రైతులందరికీ 2 లక్షల రుణమాఫీ, ఆరు గ్యారెంటీలు (అందులోని 13 హామీలు) సంపూర్ణంగా అమలు చేసి చూపించు. నేను రాజీనామాకు సిద్ధం, అమలు చేయని పక్షంలో నువ్వు సిద్ధమా?' అంటూ రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు.

గ్యారెంటీలన్నీ అమలు చేశాం

- రైతు రుణమాఫీని నెరవేరుస్తున్నాం
- కాంగ్రెస్ మాటిస్తే అది శిలాశాసనం
- రుణమాఫీ నిధుల విడుదలలో సీఎం
- రుణమాఫీకి పాస్‌బుక్కే ప్రామాణికం
- అన్నదాతలు రేషన్‌కార్డుపై అపోహలు నమ్మవద్దని సూచన



లబ్ధిదారులకి రుణమాఫీ చెక్కు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు తుమ్మల, ఉత్తమ్, పొంగులేటి, పొన్నం

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీని నిలబెట్టుకున్నదని, వాటితో పాటు రైతు రుణ మాఫీ వాగ్దానాన్ని కూడా అమలు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రైతు రుణ మాఫీ ప్రక్రియను ముఖ్యమంత్రి గురువారం సాయంత్రం సచివాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని రైతువేదికల వద్దనున్న అన్నదాతలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ.. 2022 మే 6వ తేదీన వరంగల్ డిక్లరేషన్‌లోనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ లోక్‌సభాపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రకటించారని, 2023, సెప్టెంబర్ 17న కాంగ్రెస్ అగ్ర నేత సోనియాగాంధీ ఆరు గ్యారెంటీలతోపాటు రైతు రుణమాఫీ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. హామీని మంత్రివర్గ సహచరులు, అధికారుల సహకారంతో నిలబెట్టుకున్నామని చెప్పారు. తన 16 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇది మరుపురాని రోజని వివరించారు. కాంగ్రెస్ మాటిస్తే శిలా శాసనమని, అందుకు రుణమాఫీనే నిదర్శనమని అభివర్ణించారు. మిగులు రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణలో పదేండ్ల అధికారంలో ఉన్న కేసీఆర్ రైతు రుణమాఫీ విషయంలో విఫలమయ్యారని ఆరోపించారు. మొత్తంగా పదేండ్లలో రూ.21 వేల కోట్లను మించి రుణ మాఫీ చేయలేదని, కానీ కాంగ్రెస్ సర్కార్ ఒకే దఫా ఆగస్టు నెల పూర్తికాక ముందే రైతుల రుణాలు రూ.31 వేల కోట్లను మాఫీ చేస్తున్నదని వివరించారు. రుణమాఫీకి పాస్‌బుక్కే ప్రమాణికమని, అపోహలను నమ్మవద్దని స్పష్టం చేశారు. రుణమాఫీకి రేషన్‌కార్డు ఉండాలనే అపోహను కొందరు సృష్టిస్తున్నారని, అవేవీ నమ్మవద్దన్నారు. రేషన్‌కార్డు కేవలం కుటుంబాన్ని గుర్తించడానికి మాత్రమేనని, రుణమాఫీకి అది ప్రాతిపదిక కాదని, పాస్‌బుక్కే ప్రామాణికమని నొక్కిచెప్పారు. భూమి ఉండి, ఆ భూమికి పాస్‌బుక్ ఉండి, పాస్‌బుక్‌పై రుణం తీసుకుంటే దానిని మాఫీ చేస్తామని వివరించారు. ఈ విషయంపై అవగాహన కల్పించాలని అధికారులను కోరారు. రుణమాఫీకి సంబంధించి విద్య లేని, సాంకేతిక నైపుణ్యం లేని రైతులెవరికైనా సమస్యలు తలెత్తితే బ్యాంకు అధికారులను సంప్రదించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతు ఖాతాల్లోకి రుణ మాఫీ సొమ్ము చేరేలా చూడాలని కోరారు. గత ప్రభుత్వం జీతాలే సరిగా ఇవ్వలేకపోయిందని, ఆర్థిక ఇబ్బందులున్నా 8 నెలల కాలంలోనే తాము రూ.29 వేల కోట్ల విలువైన సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని, ఇప్పుడు రుణ మాఫీ చేశామని అన్నారు.

వరంగల్‌లో కృతజ్ఞత సభ

రైతు రుణమాఫీ హామీ ఇచ్చి నిలుపుకున్నందున కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జునఖర్గేలకు ధన్యవాదాలు తెలపాల్సిన అవసరమున్నదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. రుణమాఫీ హామీ ఇచ్చిన వరంగల్ ఆర్ట్స్ కళాశాల మైదానంలోనే కృతజ్ఞత సభ పెడతామని, ఆ సభకు రాహుల్‌గాంధీని ఆహ్వానించి, రాష్ట్ర రైతుల తరఫున కృతజ్ఞతలు తెలుపుతామని వెల్లడించారు. అనంతరం రూ.లక్ష రుణ మాఫీ పొందిన 10 మంది రైతులకు సీఎం చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కట్టించిన రైతువేదికల్లో సంబురాలు

కాంగ్రెస్ ప్రభుత్వ రుణమాఫీ సంబురాలకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కట్టించిన రైతువేదికలు వేదికయ్యాయి. నాడు రైతువేదికలు ఎందుకు, ఇవి ఏ మాత్రం ఉపయోగపడవని విమర్శించిన వారే నేడు వాటి వద్ద సంబురాలు జరుపుకొన్నారు. రుణమాఫీ సందర్భంగా ఆయా గ్రామాల్లోని రైతు వేదికల్లో సంబురాలు నిర్వహించాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు రైతువేదికల్లో నిర్వహించిన రుణమాఫీ సంబురాల్లో రైతులతో కలిసి పాల్గొన్నారు. ఏఈవోలు ఎంపిక చేసిన రైతులను రైతు వేదికలకు తరలించారు. కేసీఆర్ కట్టించిన సచివాలయం నుంచే సీఎం వీసీ నిర్వహించారు.

11.50 లక్షల మందికి 6 వేల కోట్ల మాఫీ

రాష్ట్ర ప్రభుత్వం తొలి దఫాలో రూ.లక్ష వరకు రుణాలను మాఫీ చేసింది. ఈ మేరకు 11.50 లక్షల మంది రైతులకు సంబంధించిన రూ. 6098.93 కోట్లను బ్యాంకులకు విడుదల చేసింది. అత్యధికంగా నల్లగొండ జిల్లా రైతులు ప్రయోజనం పొందారు. ఈ జిల్లాలో రూ.లక్ష వరకు రుణం ఉన్న 83,124 మంది రైతులకు రూ. 454.49 కోట్లు మాఫీ అయింది. ఆగస్టు 15వ తేదీలోపు రూ. 2 లక్షల రుణాన్ని మాఫీ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. రూ. లక్షన్నర రుణాలను ఈ నెలాఖరు వరకు, రూ. 2 లక్షల వరకు గల రుణాలను ఆగస్టు మొదటి వారంలో మాఫీ చేస్తామని ప్రకటించింది.

రాములమ్మ తడబాటు.. సీఎంకు షాక్



కొల్లాపూర్: రుణ మాఫీ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం రామాపురం గ్రామంలోని రైతువేదిక వద్దకు వచ్చిన మహిళా రైతు వసంతపురం రాములమ్మ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె తడబాటుకు గురై ప్రభుత్వాన్ని పొగడటానికి బదులు కంగారులో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తమ ఆదాయం పోయిందని అన్నారు. ఆ వెంటనే తేరుకున్న రాములమ్మ తాను తీసుకున్న రూ. 60 వేల రుణం మాఫీ చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. తనకున్న ఎకరం పొలంలో వరి, వేరుశనగ సాగు చేస్తున్నట్టు సీఎంకు వివరించింది. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ బదావత్ సంతోష్ పాల్గొన్నారు.

బ్యాంకర్లూ.. పండుగ చేసుకోండి

- రుణమాఫీ నిధులు ఇతర అప్పులకు జమ చేయొద్దు
- రైతులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలి
- గురువారం 11 లక్షల మంది రైతులకు రుణమాఫీ
- బ్యాంకులకు 6 వేల కోట్లు విడుదల చేశాం
- బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రుణమాఫీ నేపథ్యంలో రైతులు పండుగ చేసుకుంటున్నట్టుగానే బ్యాంకర్లూ పండుగ చేసుకోవాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రైతు రుణమాఫీ కింద వచ్చిన నిధులను తిరిగి అదే రైతులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలని తెలిపారు. ఈ నిధులు ఇతర అప్పులకు జమచేసి, రైతులను ఇబ్బందులు పెట్టవద్దు అని ఆదేశించారు. గురువారం ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆగస్టు నెలాఖరువరకు రైతు రుణమాఫీకి రూ.31వేల కోట్లు విడుదల చేస్తామని తెలిపారు. గురువారం సాయంత్రం 4గంటల వరకు 11లక్షలకుపైగా రైతులకు రూ.6000 కోట్ల వరకు నిధులు విడుదలైనట్టు చెప్పారు. ఈ నెలలోనే రెండో దఫాలో లక్షన్నర వరకు రుణమాఫీకి నిధులు విడుదల చేస్తామని పేర్కొన్నారు. మొత్తం 40 లక్షల బ్యాంకు ఖాతాల ద్వారా రూ.31వేల కోట్లు రుణమాఫీకి ప్రభుత్వం జమ చేస్తుందని చెప్పారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. బ్యాంకుల వద్ద తొక్కిసలాట జరగకుండా గ్రామాల వారీగా తేదీలు ఇచ్చి రుణమాఫీని సజావుగా జరిగేలా చూడాలని బ్యాంకర్లకు తెలిపారు. రైతు రుణమాఫీ నిధులు సకాలంలో అందితే వ్యవసాయం పండుగలా మారుతుందని అభిప్రాయపడ్డారు.

ఒకేసారి.. దఫదఫాలుగా!

- ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామంటూ పత్రికల్లో భారీగా యాడ్స్
- ఆచరణలో మూడు దఫాలు
- ఇప్పుడు లక్ష, నెలాఖరుకు రూ. లక్షన్నర, ఆగస్టు 2న రూ. 2 లక్షల రుణమాఫీ

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి సర్కారు చెప్పే మాటలకు చేసే పనులకు ఎక్కడా పొంతన కుదరడం లేదు. రూ. 2 లక్షల వరకు పంట రుణాలను ఏకకాలంలో మాఫీ చేస్తున్నట్టు ప్రభుత్వం గురువారం వార్తా పత్రికల్లో ప్రకటనలు ఇచ్చింది. గురువారం సాయంత్రం వరకు రూ. లక్ష వరకు మాత్రమే మాఫీ చేస్తామని సీఎం ప్రకటించారు. ఈ నెలాఖరులోగా రూ.1.5 లక్షల వరకు, ఆగస్టులో రూ.2 లక్షల వరకు మాఫీ చేస్తామని స్పష్టంచేశారు. ప్రభుత్వ ప్రకటనలకు, సీఎం చెప్పున్నదానికి పొంతన లేకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఏకకాలంలో రూ.2 లక్షల మాఫీ అంటే అబద్ధమా? అని రైతులు నిలదీస్తున్నారు.

వరంగల్ డిక్లరేషన్‌కు తిలోదకాలు

వరంగల్‌లో నిర్వహించిన రైతు సంఘర్షణ సభలో 'వరంగల్ రైతు డిక్లరేషన్'ను రాహుల్‌గాంధీ ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఏకకాలంలో రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామని, రైతులు, కౌలు రైతులకు ఎకరాకు ఏడాదికి రూ.15 వేల పెట్టుబడి సాయం అందిస్తామని హామీలు గుప్పించారు. ఆ తర్వాత ఒకే దఫాలో డిసెంబరు 9వ రూ. 2 లక్షల రుణం మాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. అయితే, ఏడు నెలల తొమ్మిది రోజుల తర్వాత ఇప్పుడు మూడు దఫాల్లో రైతులకు రుణవిముక్తి కల్పిస్తామనడం రేవంత్‌కే చెల్లిందింది. పంట సీజన్ మొదలై రెండు నెలలవుతున్నా రైతు భరోసా ఇవ్వకుండా నిధులను రుణమాఫీకి మళ్లించారని రైతులు ఆరోపిస్తున్నారు.

మాఫీ మాయాజాలం

> మొదటిపేజీ తరువాయి...

వచ్చారు. కొన్ని గ్రామాలకు బుధవారం రాత్రి జాబితా అందిందగా, మరికొన్ని గ్రామాల్లో అయితే గురువారం మధ్యాహ్నం వరకు కూడా జాబితాలు విడుదల చేయ్యలేదు ఉన్నారు. రుణమాఫీ జాబితా విడుదలలో ప్రభుత్వం ఎందుకో కొంత గోప్యత పాటించినట్టు తెలిసింది. అరకొర సమాచారంతో ఇవ్వడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. వాస్తవానికి ప్రభుత్వం ఫలానా జిల్లాలో గానీ, మండలంలో గానీ మొత్తం ఎంతమంది రుణాలు తీసుకున్నారు? ఒక్కొక్కరు ఎంత మొత్తం తీసుకున్నారు? ఎంతమందికి మాఫీ అయింది? ఎంత మొత్తం మాఫీ అయింది? అనే వివరాలతో జాబితా ఇవ్వాలి. కానీ ప్రభుత్వం మాత్రం కేవలం రుణమాఫీ అయిన రైతుల జాబితాను మాత్రమే విడుదల చేసింది. దీంతో జాబితాలో పేరు లేని రైతులు ఆందోళనకు గురయ్యారు. ఒక బ్యాంకు నుంచి రూ. లక్షలోపు రుణాలు గల వెయ్యిమంది రైతుల జాబితాను పంపిస్తే, 200 మంది రైతులతో జాబితా తిరిగి వెనక్కి రావడం గమనార్హం.

బ్యాంకర్ల వద్ద కూడా లేని సమాచారం

రుణమాఫీలో నెలకొన్న పలు సందేహాలు, సమస్యలకు బ్యాంకర్లు, అధికారుల వద్ద కూడా సమాచారం కరువైంది. లక్ష లోపు రుణం ఉన్నప్పటికీ తమ పేరు జాబితాలో ఎందుకు లేదంటూ ప్రశ్నించిన రైతులకు అధికారుల నుంచి మౌనమే సమాధానంగా మారింది. తమకు ఇప్పుడు ఎలాంటి వివరాలు తెలియవని, రెండు రోజులు ఆగితే అన్ని వివరాలు చెప్తామని దాటవేస్తున్నారు. గతంలో ఒక రైతుకు రుణమాఫీ కాకపోతే ఏ కారణంతో కాలేదో తెలుసుకునే వెసులుబాటు ఉండేదని, కానీ ఇప్పుడు ఆ వెసులుబాటు కూడా లేదని బ్యాంకర్లు తెలిపారు.

ప్యాక్స్ రైతులకు మరో రెండు రోజులు

ఇతర బ్యాంకుల్లో రైతులకు రుణమాఫీ డబ్బులు జమవుతుండగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(ప్యాక్స్)లో జమ కాకపోవడంపై ఆ రైతులు ఆందోళనకు గురవుతున్నారు. దీనిపై ప్యాక్స్ అధికారులను సంప్రదించగా ప్యాక్స్‌లోని రైతులకు రుణమాఫీ కావడానికి మరో రెండు మూడు రోజుల సమయం పట్టే అవకాశం ఉందని తెలిపారు. ప్యాక్స్‌లకు సంబంధించి రుణ మొత్తం సహకార బ్యాంక్ టెస్కాబ్ నుంచి డీసీసీబీల్లోని ప్యాక్స్ అకౌంట్‌లో జమవుతుంది. ప్రభుత్వం ప్రస్తుతం రుణమాఫీ మొత్తాన్ని టెస్కాబ్‌కు పంపిందగా ఆ మొత్తం క్రమంగా డీసీసీబీలకు చేరుతున్నది. ఆ తర్వాత ప్యాక్స్‌లలో రైతులవారీగా విభజించి ఎవరికి ఎంత మాఫీ అయిందో తేల్చిన తర్వాత రైతుల ఖాతాల్లో రుణమాఫీ మొత్తాన్ని జమ చేయనున్నారు. కాబట్టి ప్యాక్స్‌లలో రుణం ఉన్న రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు.

రేషన్‌కార్డు నిబంధనతో అన్యాయం

రేషన్ కార్డు నిబంధనతో చాలా మంది రైతులకు అన్యాయం జరిగింది. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం గ్రామంలో ఒక కుటుంబంలో ముగ్గురు వ్యక్తులు ఒకరు రూ.60వేలు, మరొకరు రూ.70వేలు, మరొకరు రూ.90 వేల వరకు రుణాలు తీసుకున్నారు. రేషన్ కార్డు నిబంధన పెట్టి కుటుంబం యూనిట్‌గా రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తుండడంతో ఈ కుటుంబానికి తొలి విడతలో రుణమాఫీ కాలేదు. మాఫీ కావాలంటే రూ.20వేలు కట్టాల్సిన పరిస్థితి వచ్చింది.

అందరికీ కాదు.. కొందరికే

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 7,383 మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురుచూస్తుండగా తొలి విడతలో 2,667 రైతు కుటుంబాలకు మాత్రం రుణమాఫీ పథకం వర్తించింది. నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని 23 గ్రామాల్లో 1993 మందికి రుణమాఫీ చేశారు. మండలంలోని గ్రామాల్లో 10, 12, 22, 41 ఇలా దాదాపు 19 గ్రామాల్లో వంద కంటే తక్కువ మందికి రుణమాఫీ చేశారు. సగటున ఒక్కో గ్రామంలో 20 శాతం నుంచి 30శాతం మందికే రుణ మాఫీ వర్తించినట్టు తెలుస్తోంది. ప్రభుత్వం చెప్తున్న లెక్కల ప్రకారం ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,58,168 మంది రైతులు ఉన్నారు. వీరిలో సిద్దిపేట జిల్లాలో 58,137 మంది, మెదక్ జిల్లాలో 48,864 మంది, సంగారెడ్డి జిల్లాలో 51,167 మందికి మాత్రమే పంట రుణాలు మాఫీ అయ్యాయి. హుస్నాబాద్ వ్యవసాయ డివిజన్ పరిధిలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాల్లో మొత్తం 54,739 మంది రైతులు ఉండగా, 10,359 మంది రైతులకు మాత్రమే రుణ మాఫీ దక్కింది. ముల్కనూర్ మండలంలో 4,694 మంది, మిరుదొడ్డి మండలంలో 3,521 మంది, తొగుట మండలంలో 1,970 మంది, దౌల్తాబాద్ మండలంలో 2,961 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిద్దిపేట జిల్లాలో 1,67,771 మంది, మెదక్ జిల్లాలో 1,53,883 మంది, సంగారెడ్డి జిల్లాలో 1,90,002 మంది రైతులకు ఎలాంటి షరతులు లేకుండా పంట రుణ మాఫీ అయ్యాయి.

కరీంనగర్ ప్యాక్స్ పరిధిలో ఒక్కరికే కాలే

కరీంనగర్ జిల్లా జమ్మికుంట ప్రాథమిక సహకార కేంద్రం పరిధిలో ఎనిమిది గ్రామాలుండగా మొత్తం 1,016 మంది రైతులు రుణం తీసుకున్నారు. అందులో లక్ష వరకు రుణం తీసుకున్న రైతుల సంఖ్య 799 మంది కాగా, వీరు తీసుకున్న రుణం రూ.4.93 కోట్లు. లక్షపైన అప్పు తీసుకున్న రైతులు 217 మంది కాగా, వీరు తీసుకున్నది రూ. 3.90 కోట్లు పైనే. ఈ సొసైటీ పరిధిలో ఒక్కరికీ రుణ మాఫీ కాలేదు. మహబూబ్‌నగర్ రూరల్ మండలం ఎదిర గ్రామంలో 1,365 మంది రైతులు లక్షలు రుణాలు తీసుకుంటే వారిలో కేవలం 653 మందికి మాత్రమే రుణమాఫీ జాబితాలో పేర్లు వచ్చాయి.

మహబూబ్‌నగర్ జిల్లాలో 30% మందికే

మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 39,380 మంది రైతులకు సంబంధించి రూ.211 కోట్లు విడుదలైనట్టు కలెక్టర్ విజయేందిరబోయి ప్రకటించారు. రూ.లక్ష రుణాలు తీసుకున్న వారంతా సుమారు ఒక లక్ష మందికిపైనే ఉంటారని అంచనా. అయితే, వీరిలో కేవలం 30 శాతం మందికి మాత్రమే రుణమాఫీ వర్తింపజేశారు. వనపర్తి జిల్లాలో 28,408 మంది ఉండగా రూ.156.91 కోట్లు మాఫీ అయింది. గద్వాల జిల్లాలో 1.40 లక్షల మంది రైతులుండగా 24,398 మంది రైతులకు రూ. 144 కోట్లు విడుదలయ్యాయి. నారాయణపేట జిల్లాలో 28,684 మందికిగాను రూ.165.45 కోట్లు మాఫీ అయింది. నల్లగొండ జిల్లా వ్యవసాయ అధికారి లెక్కల ప్రకారం 83 వేల మందికి రూ.453 కోట్ల లబ్ధి చేకూరుతుందని ప్రకటించారు. గొల్లగూడ కోఆపరేటివ్ సొసైటీలో మొత్తం 1274 మంది రైతులు రెండు లక్షల వరకు రుణాలు తీసుకోగా, వారిలో లక్ష రుణాలు పొందిన 500 మందికి మాఫీ అయింది. సంస్థాన్ నారాయణపురం మండలం గుజ్జ సహకార సొసైటీలో 117 మంది లక్షలోపు రుణాలు తీసుకున్న వారు ఉన్నారు. వీరిలో ఎంత మందికి రుణమాఫీ వర్తించిందనేదానిపై సాయంత్రానికి కూడా స్పష్టత లేకుండా పోయింది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి ఎల్‌సీఎస్ పరిధిలో 777 మంది లక్ష రూపాయల్లోపు పంట రుణాలు తీసుకున్న రైతులు ఉన్నారు. 555 మందికి రుణమాఫీ అయింది.

యువరైతు ఆత్మహత్య




నర్మెట, జూలై 18: అప్పుల బాధలు తాళలేక ఓ యువరైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గురువారం జనగామ జిల్లా నర్మెట మండలం కన్నెబోయినగూడెంలో చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన తోకల సాంబరాజు (29) తనకున్న 3.5 ఎకరాల భూమిని వ్యవసాయానికి అనుకూలంగా మార్చాడు. అందులో సుమారు 3 బోర్లు వేయగా ఒక్క బోరు మాత్రమే కొద్దిగా నీరు పోస్తున్నది. మూడు బోర్లకు, పంట పెట్టుబడికి సుమారు రూ.10 లక్షల వరకు అప్పు లయ్యాయి. చేసిన అప్పులు ఎలా తీర్చాలో దారిలేక తీవ్ర మనస్తాపం చెంది ఈ నెల 16న పురుగుల మందు తాగాడు. దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

'అడంగల్' అన్నదాతల ఆశలు ఆవిరి

చుంచుపల్లి, జూలై 18: ఊహించిందే అయింది. కర్షకుల రుణమాఫీకి కొర్రీలమీద కొర్రీలు పెట్టిన కాంగ్రెస్ సర్కారు కొత్తగూడెం సహకార సంఘంలో కర్షకులకు కొత్త చిక్కు తెచ్చిపెట్టింది. ఇప్పటికే పట్టాదారు పాస్‌పుస్తకాలు, రేషన్‌కార్డులు అంటూ ఎడాపెడా నిబంధనలు పెడుతూ వచ్చిన రేవంత్ ప్రభుత్వం రుణమాఫీ రైతుల్లో వీలైనంతమందిని తొలగించాలని నిర్ణయించుకున్నట్టుగా ఉంది. పట్టాదారు పాస్ పుస్తకం లేదన్న కారణంగా అనేక మంది రైతులను రుణ మాఫీ నుంచి పక్కకు తప్పించింది. కొత్తగూడెం సహకార సంఘం బాధ్యులు తమ సొసైటీ పరిధిలో మొత్తం 3,140 మంది రైతులకు రూ.12.71 కోట్ల పంట రుణాలను మంజూరు చేశారు. వీరిలో 720 మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు లేకపోవడంతో కేవలం పహాణీల మీదనే పంట రుణాలు ఇచ్చారు. అర్హులైన రైతుల వివరాలు పంపాలని ప్రభుత్వం కోరడంతో మొత్తం జాబితా పంపారు. కానీ, గురువారం ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ అర్హుల జాబితాలో 720 మంది రైతుల పేర్లు లేవు. పట్టాబుక్కు లేదన్న కారణంతోనే రుణమాఫీ అర్హుల జాబితాలోంచి ప్రభుత్వం వీరిని తొలగించింది.

హరీశ్‌ను రాజీనామా అడిగే హక్కులేదు

- రాజీనామాల చరిత్ర బీఆర్ఎస్‌ది
- బీఆర్ఎస్ నేత దేవీ ప్రసాద్ డిమాండ్



హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ) : మాజీ మంత్రి హరీశ్‌రావును రాజీనామా చేయాలని అడిగే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదని, వందరోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని, గత డిసెంబర్ 9నాటికే రైతులకు రెండు లక్షల వరకు సంపూర్ణ రుణ మాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ అన్ని వర్గాల ప్రజలను వంచించిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దేవీప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు. ఆరు గ్యారెంటీలకు మొదటి అసెంబ్లీ సెషన్‌లోనే చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన రాహుల్ గాంధీ మాటలు బుట్టదాఖలయ్యాయని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్ట్ 15లోగా అమలు చేస్తామని మరోసారి ప్రజలను మోసం చేసే ప్రయత్నాన్ని ప్రజాపక్షం వహించిన హరీశ్‌రావు అడ్డుకున్నారని, ఆరు గ్యారెంటీలతో పాటు రెండు లక్షల రుణమాఫీ చేయకుంటే సీఎం రాజీనామా చేయాలని, అమలు చేస్తే తాను రాజీనామా చేస్తానని హరీశ్ ప్రకటించారని వివరించారు. నాడు చాలెంజ్‌కు ముందుకు రాని ముఖ్యమంత్రి, ఆ చాలెంజ్ వల్ల అనివార్యంగా ఇప్పుడు కేవలం లక్ష వరకు అదీ కొందరికే లబ్ధికలిగేలా 6వేల కోట్లు మాత్రమే వేసి సంబురాలు జరుపుకోవడం హాస్యాస్పదంగా ఉన్నదని ఎద్దేవాచేశారు. ఇంకా 25 వేల కోట్ల రుణమాఫీ, ఆరు గ్యారెంటీలను సంపూర్ణంగా అమలు చేయకుండా హరీశ్‌రావు రాజీనామా చేయాలని సీఎం, ఇతర కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేయడం ప్రజాపక్షంగా నిలబడే హరీశ్‌రావుపై వారికున్న అక్కసును తెలియజేస్తున్నదని విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం పదవులకు రాజీనామా చేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదని, ఇప్పటికైనా హామీలను కోతలు లేకుండా అమలుచేయాలని సూచించారు. అమలు చేసి అన్నీ అమలు చేశామనే దబాయింపును ఇకనైనా ఆపాలని, కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలుచేసే దాకా ప్రశ్నిస్తూనే ఉంటామని, ప్రజల పక్షాన పోరాడుతామని ప్రకటించారు.

నేతన్నల రుణాలూ మాఫీ చేయాలి

రైతుల రుణమాఫీ మాదిరిగానే చేనేత సహకార సంఘాలు, కార్మికుల వ్యక్తిగత రుణాలనూ మాఫీ చేయాలని చేనేత కార్మికసంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెంకట్రాములు గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.

రుణమాఫీ వేదికల్లో గందరగోళం

- వీసీ ద్వారా సీఎం ప్రసంగిస్తుండగానే వెళ్లిపోయిన రైతులు
- చాలాచోట్ల రైతు వేదికలు వెలవెల
- సంబురాల్లోనూ కాంగ్రెస్ నేతల మధ్య వర్గపోరు
- ఆందోళనల మధ్యనే ముగిసిన వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం ప్రసంగం కొనసాగుతుండగా పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం తేలుకుంట రైతు వేదికలో రైతులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

నమస్తే తెలంగాణ న్యూస్‌నెట్‌వర్క్, జూలై 18: రైతు రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమం రసాభాసగా మారింది. రుణమాఫీ సందర్భంగా గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ వరంగల్, కరీంనగర్, మంచిర్యాల తదితర జిల్లాల్లో గందరగోళ వాతావరణం నెలకొన్నది. వరంగల్ జిల్లా ఖిలావరంగల్ మండలం బొల్లికుంటలోని రైతు వేదికలో ఇద్దరు రైతులు పోటాపోటీగా మైక్ లాక్కున్నారు. 2017లో రుణం తీసుకున్న రైతులు చేపట్టిన నిరసనలతో రైతు వేదిక దద్దరిల్లింది. 344 మంది లబ్ధిదారులకు కనీసం 50 మంది కూడా హాజరు కాలేదు. గుంట భూమి లేని నాయకులు కూడా కార్యక్రమానికి హాజరై కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా నినదించారు. ఈ కాన్ఫరెన్స్‌కు మంత్రి కొండా సురేఖ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు హాజరు కాలేదు. ఉమ్మడి కరీంనగర్ పరిధిలోని జగిత్యాల జిల్లా కథలాపూర్, పెద్దపల్లి జిల్లా ఓదెల, జూలపల్లి మండలం తేలుకుంటలోని రైతు వేదికలు రైతులు లేక బోసిపోయాయి. కరీంనగ్ జిల్లా కొత్తపల్లి రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా సీఎం, మంత్రులు మాట్లాడుతున్న సమయంలో కొన్ని నిమిషాలు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో రైతులు ఇబ్బందిపడ్డారు.

సంబురాల్లో వర్గపోరు

మంచిర్యాల జిల్లా చెన్నూర్ కాంగ్రెస్‌లో మరోసారి వర్గపోరు బహిర్గతమైంది. రుణ మాఫీ సంబురాల్లో కొందరు కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసేందుకు సిద్ధమవుతుండగా, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు మూల రాజిరెడ్డి అక్కడికి చేరుకొని అడ్డుకున్నారు. తనకు చెప్పకుండా ఎవరు చేయమన్నారంటూ అదే పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు అయిత హిమవంతరెడ్డిపై మండిపడ్డారు.

చెన్నారావుపేట కాంగ్రెస్‌లో ఫ్లెక్సీల రగడ

వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య ఫ్లెక్సీల రగడ రాజుకున్నది. రుణ మాఫీ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చెన్నారావుపేట రైతు వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమం సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇందులో తమ ఫొటోలు పెట్టలేదని కొందరు, కింది వరుసలో పెట్టారని మరికొందరు బాహాటంగానే విమర్శలకు దిగారు.

యువకుడిపై కేసు

దిలావర్‌పూర్, జూలై 18 : రైతు రుణమాఫీపై రేవంత్‌రెడ్డి ప్రకటన చేస్తున్న సమయంలో నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌కు చెందిన ఓ యువకుడు సామాజిక మాధ్యమంలో అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనిపై కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు.

సిద్దిపేట కలెక్టర్ తీరు వివాదాస్పదం



సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి వ్యవహరించిన తీరు విమర్శలకు తావిస్తున్నది. గురువారం రుణమాఫీ సందర్భంగా సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి రైతువేదిక వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ అగ్రనేతలైన సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. కలెక్టర్ హోదాలో ఉండి రాజకీయ నేతల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేయడం వివాదాస్పదమైంది.

కాంగ్రెస్ జెండా మోసిన నాకే మాఫీ కాలేదు



కాంగ్రెస్ పార్టీ కోసం మొదటి నుంచి జెండా మోసిన. రైతు రుణమాఫీ చేస్తామని ఎన్నికల హామీలో ఇస్తే విస్తృతంగా ప్రచారం చేసిన. రైతులకు మేలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి నాకు న్యాయం చేయలేదు. 2017లో రూ.30 వేలు రుణం తీసుకున్న. నాకు మాత్రం మాఫీ కాలేదు. కాంగ్రెస్ పార్టీ కోసం ఎంత్తు తరబడి జెండాలు మోస్తే నాకు న్యాయం జరగలేదు. - పొన్నోటి రవీందర్, కాంగ్రెస్ కార్యకర్త, బొల్లికుంట, ఖిలావరంగల్

కేసీఆర్ చేసిండు.. ఇప్పుడు కాలే..

రుణమాఫీ జాబితాలో నాపేరు లేదు



నాకు 26 గుంటల వ్యవసాయ భూమి ఉన్నది. పాస్‌బుక్ సహాయంతో నిడమనూరు రూ.38 వేల పంట రుణం తీసుకున్న. ప్రభుత్వం గురువారం ప్రకటించిన మొదటి విడత రుణమాఫీ జాబితాలో నా పేరు లేదు. లక్షలోపు రుణాలు మాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వానికి సంబంధిత అధికారుల నైపల్యం వల్ల నాలాగా చాలామంది రైతుల పేర్లు జాబితాలో లేవు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నేను రూ.34 వేలు రుణం తీసుకోగా వడ్డీతో కలిపి నాకు రూ.38 వేలు మాఫీ అయ్యింది. ఆ తర్వాత తిరిగి రూ.38 వేలు పంట రుణం తీసుకున్న. తాజాగా రుణమాఫీ జాబితాలో నా పేరు లేదు.

- షేక్ రంజాన్, రైతు, కొత్తపేట, మం: కేతేపల్లి, జిల్లా: నల్లగొండ





కాంగ్రెస్ సర్కార్ మాఫీ చేయలె..

నాకు 9 ఎకరాల భూమి ఉన్నది. దాదాపు 30 ఏండ్లుగా సాగు చేసుకుంటున్న. తెలంగాణ గ్రామీణ బ్యాంకులో మహిళతో రూ. 50 వేల రుణం తీసుకున్న. మొదటి విడతలో రూ. లక్ష రుణమాఫీ అయ్యింది. కానీ అందులో నా పేరు లేదు. నాకు తెల్లరేషన్ కార్డు ఉన్నది. కానీ పట్టా లేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మాఫీ అయ్యింది. ఈ ప్రభుత్వం మాఫీ చేయలేదు. మాలాంటి పేద రైతులకు రుణం మాఫీ చేయాలి. ఎన్నో ఆశలతో మాఫీ కోసం ఎదురు చూస్తే చివరకు నిరాశే మిగిలింది. ఇప్పటికైనా మాలాంటి నిరుపేద రైతులకు మాఫీ చేయాలి.

- జాడి లింగన్న, రైతు, ఘనపూర్, జిల్లా ఆదిలాబాద్

నాకెందుకు చేస్తలేరు?

నాకు మూడు ఎకరాలు ఉన్నది. పెట్టుబడి కోసం కమలాపూర్ యూనియన్ బ్యాంకులో పాసు పుస్తకం కుదువపెట్టి లక్ష రూపాయలు క్రాప్‌లోన్ తీసుకున్న. పెట్టుబడికి తీసుకున్న లక్షకు మిత్తి రూ.60 వేలు అయింది. కేసీఆర్ సార్ ప్రభుత్వంలో లక్ష మాఫీ కాగా, అరవై వేల మిత్తి మిగిలి ఉన్నది. మిత్తి చెల్లించే వరకు పట్టాదారు పాసుపుస్తకం బ్యాంకులోనే ఉంచుకున్నరు. రూ. 60 వేలు అప్పు అట్లనే ఉన్నది. మా ఊళ్లో లక్ష రూపాయల లోపు అప్పు ఉన్న వాళ్లకు 237 మందికి మాఫీ అయిందన్నరు. నాకు ఎందుకు మాఫీ కాలేదో తెలియదు.

- మామిడిశెట్టి పిట్టి లక్ష్మి, రైతు, గూడూరు, జిల్లా హనుమకొండ

ఎవరిని అడిగినా చెప్తలేరు



నాకు 2 ఎకరాలు 30 గుంటలు భూమి ఉన్నది. బ్యాంకులో రూ.75 వేల రుణం తీసుకున్న. కాంగ్రెస్ ప్రభుత్వం విడదల చేసిన లక్ష లోపు రుణ మాఫీ లిస్టులో నా పేరు లేదు. ఇప్పుడు ఎవరిని అడిగినా చెప్తలేరు. నాకు పెట్టుబడి సాయం రైతు భరోసా ఇవ్వలేదు. రుణమాఫీ కూడా కాలేదు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం సీఎం కేసీఆర్ 2023లో రూ.75 వేలు రుణమాఫీ చేసిన్రు.

- చెక్కల రామచంద్రయ్య, రైతు, తొరేళ్ల గూడెం, జిల్లా మహబూబాబాద్

రుణమాఫీపై రైతుల భిన్నస్వరాలు



అడిగితే రెండో విడత అంటున్నరు

నేను మాచారెడ్డి ఎస్‌బీఐలో రూ.37 వేల పంట రుణం తీసుకున్న. రుణమాఫీ లిస్టులో నా పేరు రాలేదు. అధికారులను అడిగితే మొదటి విడతలో కొంతమంది రైతులనే అర్హులుగా గుర్తించారని, రెండో విడతలో మిగతా రైతులకు రుణమాఫీ అవుతుందని చెప్తున్నరు. ఏకకాలంలో లక్షలోపు ఉన్న ప్రతి ఒక్కరికీ రుణమాఫీ చేస్తామన్న ప్రభుత్వం రూ.50 వేలలోపు ఉన్నవారిని అనర్హులుగా గుర్తించడం విడ్డూరంగా ఉన్నది.

- బల్ల ఎల్లయ్య, లక్ష్మాపూర్, మం: మాచారెడ్డి, జిల్లా కామారెడ్డి

లిస్టులో నా పేరు లేదు!



నాకు పాముసూర్ గ్రామంలో ఎకరం ఐదు గుంటల వ్యవసాయ భూమి ఉన్నది. నేను 7 డిసెంబర్ 2021న శివునిపల్లి ఎస్‌బీఐలో రూ. 52 వేల పంట రుణం తీసుకున్న. మిత్తితో కలిపి రూ.61 వేలు అయ్యింది. లక్ష లోపు పంట రుణాలను సీఎం రేవంత్‌రెడ్డి గురువారం మాఫీ చేస్తున్నారంటే సంతోషపడ్డ. తీరా లిస్టులో చూస్తే నా పేరు లేదు. అధికారులను అడిగితే ప్రాసెస్‌లో ఉన్నదని అంటున్నరు. నాకు పంట రుణం మాఫీ అయితదో, కాదో అని టెన్షన్‌గా ఉన్నది. - వంగ నరసింహం, రైతు, శివునిపల్లి

నాకే కాదు.. చాలామందికి రాలే!



పాపన్నపేట కోఆపరేటివ్ బ్యాంకులో 2022లో రూ.70 వేల పంట రుణం తీసుకున్న. 2023లో రెన్యువల్ సైతం చేసుకున్న. నాకు రెండు ఎకరాల పైచిలుకు పట్టాభూమి ఉంది. పాసుబుక్ కూడా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టా పాసుబుక్ ఉన్న అందరికీ పంట రుణ మాఫీ చేస్తా అని చెప్పింది. లిస్టులో నాపేరు లేదు. నాలాంటి వారు చాలామంది రైతులకు రుణమాఫీ కాలేదు. కాంగ్రెస్ సర్కారు మాట తప్పద్దు. అందరు రైతులకు రుణమాఫీ చేయాలి. - వల్లోళ్ల రవళి, రైతు, మల్లంపేట గ్రామం, మెదక్ జిల్లా

ఎమ్మెల్యే కాలెను అడిగితే చెప్తలేదు



నేను చేవెళ్ల సొసైటీ బ్యాంక్‌లో 2018లో రూ.35 వేలు తీసుకున్న. తీరా చూస్తే నా రుణం అలాగే ఉన్నది. జాబితాలో నా పేరే లేదంటున్నరు. నాకు రుణమాఫీ ఎందుకు కాలేదని చేవెళ్ల రైతు వేదికలో జరిగిన సీఎం వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, అధికారులను అడిగితే స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. వివరాలను తెలుసుకుంటామని చెప్తుతున్నరు. రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం చెప్తుంతున్నది. 35 వేలే రుణమాఫీ చేయలేదు. ఇంక రూ.2 లక్షలు మాఫీ ఎప్పుడవుతుందో దేవుడికే తెలియాలి. నాకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. - బండారి సుధాకర్ రెడ్డి, రైతు, గ్రా: చేవెళ్ల, రంగారెడ్డి



సీఎం ముచ్చటంతా డొలే కొడ్తున్నది!

రుణమాఫీ చేస్తాం.. చేస్తాం అని ఊరించారు.. రూ.లక్ష లోపు రుణం తీసుకున్నవారివి మాఫీ చేస్తున్నామని ప్రకటించారు. జాబితా పెట్టారు. తీరా చూస్తే అందులో నాపేరు లేదు. అసలు ఇదేం రుణమాఫీ అనేది అర్థం కావడం లేదు. నాకు భార్య, ఇద్దరు పిల్లలు. మొదటి నుంచి వ్యవసాయంపైనే ఆధారపడి బతుకుతున్నం. నాకు ఎకరం పది గుంటల భూమి ఉంది. ఈ భూమే మాకు జీవనాధారం. పెద్ద సాగు ఉన్న రైతును కూడా కాదు. జగిత్యాల పట్టణంలోని యూనియన్ బ్యాంక్‌లో రెండేండ్ల కింద యాభై వేల క్రాప్ లోన్ తీసుకున్న. వడ్డీతో కలిపి ఇప్పుడు అరవై వేలు కూడా కాలే. రైతు రుణమాఫీ అంటున్నరు కదా. నాకు అవుతుందని అనుకున్న. రూ.లక్ష లోపు రుణం ఉన్నవారికి చేస్తమని సీఎం చెప్పడంతో పక్కా అవుతుందని అనుకున్న. బుధవారం రాత్రి జాబితా ప్రకటించామని చెప్పారు. అందులో కచ్చితంగా నాపేరు ఉంటుందనుకున్నా. తీరా ఇవ్వాళ పొద్దుగాళ వచ్చిన లిస్టు చూస్తే నా పేరు లేదు. రెండుమూడు సార్లు చూసిన. నా పేరు కనిపించలేదు. అధికారులను అడగాలనుకున్నా ఎవరూ అందుబాటులో లేరు. లక్షలోపు వారికి అన్నరు. మరి ఏంటో నాకు అర్థం కావడం లేదు. నాకు ఆహార భద్రత కార్డు ఉన్నది. ఇన్‌కంటాక్స్ కట్టేంది లేదు. నాకు సర్కార్ నౌకరి లేదు. పదవీవిరమణైగా పెన్షన్ రాదు. మరి నాకెందుకు మాఫీ కాలేదో అర్థం కావడం లేదు. ఫ్రీ కరెంట్ కూడా అందడం లేదు. ఇప్పటివరకు 200 యూనిట్లకు మించి కరెంట్ వాడలేదు. ఇదంతా చూస్తే కాంగ్రెస్ పనితీరు, సీఎం ముచ్చట అంతా డొలే కొడుతున్నది.


- బొంగిరెడ్డి రమేశ్, తాటిపల్లి, జగిత్యాల రూరల్ మండలం



అటు రైతుబంధు లేదు.. ఇటు మాఫీ లేదు!

నా పేరు మీద రూ.43 వేలు పంట రుణం తీసుకున్న. 2024 ఫిబ్రవరిలో రూ.10 వేలు వడ్డీ చెల్లిస్తే రుణం రెన్యువల్ చేసి తిరిగి రూ.48 వేలు ఇచ్చిండ్రు. సీఎం చెప్పినట్టు డిసెంబర్ వరకు అయితే నాకు పంట రుణం మాఫీ కావాలే. కానీ నాపేరు లిస్టులో లేదు. ఒక్కే ఇంట్లో ముగ్గురు, నలుగురు పేర్ల పంట రుణం అయినట్టు వచ్చినాయి. చెప్పింది ఒకటి చేసేది మరొకటిలా ఉన్నది. నా కుటుంబం మొత్తం డిసెంబర్ 2023 వరకు నా పేరున ఎస్‌బీఐలో రూ.43 వేలు, నా కొడుకు పేరట డీసీసీ బ్యాంకులో రూ.45 వేలు మాత్రమే ఉన్నాయి. లక్ష లోపు రుణం మాఫీ చేస్తామని చెప్పిను తప్ప చేసిందేమ లేదు. పంట పెట్టుబడికి కష్టంగా ఉన్నది. అటు రుణమాఫీ లేదు. ఇటు రైతుబంధూ వేయడం లేదు. మాలాంటి రైతులకు న్యాయం చేయండి.

- తుంపిల్ల సోమయ్య, రైతు కొమ్ములవంచ, మహబూబాబాద్



లక్షలోపు ఉన్నవారికి చేస్తానన్నడు కదా?

లక్షలోపు రుణం ఉన్న ప్రతి ఒక్కరికీ మాఫీ చేస్తానని సీఎం సార్ చెప్పిండు. కానీ నాపేరు లిస్టులో రాలేదు. నా పేరు మీద రూ.35 వేల అప్పు మాత్రమే ఉన్నది. నాకు ఎందుకు రుణమాఫీ కాలేదు. అధికారులను అడిగితే రెండోవిడత అని చెబుతున్నరు. అది ఎప్పుడు వస్తదో ఏమో తెలుస్తలేదు.

-విస్లావత్ లాల్‌సింగ్, కాకులగుట్టతండా, జిల్లా కామారెడ్డి



బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ఫొటోకు బదులు కాంగ్రెస్ ఎమ్మెల్యే ఫొటోతో సంబురాలు

మెదక్ జిల్లా వెల్దుర్తి రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సంబురాల్లో వేదికపై ఏర్పాటు చేసిన బ్యానర్‌లో ప్రొటోకాల్ విస్మరించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఫొటో కాకుండా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ఫొటో పెట్టడం చర్చనీయాంశమైంది. తప్పును గుర్తించకుండా కార్యక్రమాన్ని ప్రారంభించడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలస్యంగా మేల్కొన్న అధికారులు మధ్యలోనే బ్యానర్ తొలగించి కార్యక్రమాన్ని కొనసాగించారు. - వెల్దుర్తి

పహాణీ ఉన్న మేము రైతులం కాదా?



'పట్టాదారు పాసుబుక్కులు ఉన్న రైతులే అసలైన రైతులా? పట్టాబుక్కులు లేకుండా పహాణీలతో రుణాలు తెచ్చుకొని పంటలు సాగుచేస్తున్న మేము అసలు రైతులమే కాదా?' 'రైతులందరికీ రుణమాఫీ' అంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు పట్టాబుక్కు రైతులనే మాఫీ చేస్తున్నదంటే పట్టాబుక్కుల్లేని రైతులను మోసం చేసినట్టు కాదా? రుణమాఫీకి అర్హులను గుర్తించడంలో నిజమైన రైతులకు పూర్తిగా అన్యాయం జరిగింది. పట్టాబుక్కులున్న రైతులు పంట రుణాలు పొంది వ్యవసాయం చేయకున్నా వారికి రుణమాఫీ జరిగింది. కానీ పహాణీలో పంట రుణాలు తెచ్చుకొని రెక్కలు ముక్కలు చేసుకొని పంటలు పండించిన మేము రైతులం కాదా? నాకు పట్టాబుక్కు లేదు. పహాణీ ఉంది. దానిమీదనే నేను చండ్రుగొండ గ్రామీణ వికాస్ బ్యాంకులో పంట రుణం తెచ్చుకొని వ్యవసాయం చేసుకుంటున్న. కానీ ఈ రుణమాఫీ జాబితాలో నా పేరు లేదు. నాకు రుణమాఫీ కాలేదు. నాలాంటి వారు ఇంకా ఎందరో ఉన్నారు.

-దామెరమడుగు రామరాజు, రైతు, అయ్యన్నపాలెం, చండ్రుగొండ, భద్రాద్రి జిల్లా



రైతులందరికీ ఒకేసారి ఇస్తే బాగుండేది

మా ఊర్లో నాకు మూడెకరాల భూమి ఉన్నది. తెలిసి వచ్చిన నాటి నుంచి ఎవుసమే ఆధారంగా బతుకుతున్న. నా పొలం మీద రూ.1.2 లక్షలు లోను తీసుకున్న. ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని టీవీల్లో, పేపర్లల్ల చూసి సంతోషపడ్డం. కానీ, ఇయ్యాల లక్ష రూపాయల లోపు ఉన్న వాళ్లకే రుణమాఫీ చేస్తున్నారని తెలిసింది. రైతులందరికీ ఒకేసారి రుణమాఫీ చేసి ఉంటే బాగుంటుండే.

- ఎస్ రమేశ్, మూడుచింతలపల్లి, మేడ్చల్



లిస్టులో నా పేరు లేకపోవడం బాధగా ఉన్నది

రైతు రుణమాఫీ జాబితాలో నా పేరు లేకపోవడం బాధగా ఉంది. తర్వాత లిస్టులో వస్తుందని అధికారులు చెప్తున్నారు. ప్రభుత్వం ఏక కాలంలో రుణ మాఫీ చేస్తే బాగుంటుంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 9 ఏండ్లు రైతులు సుఖంగా ఉన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్నా రైతులను పట్టించుకోవడం లేదు. -రామిరెడ్డి నర్సింహారెడ్డి, కీసర దాయరా, మేడ్చల్ జిల్లా



బ్యాంకుల అడుగుమంటున్నరు..

నేను రూ.25 వేల క్రాప్‌లోన్ తీసుకున్న. దీనిని ఏటా రెన్యువల్ చేయించిన. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు చేసిన రుణమాఫీ నాకు వర్తించలేదు. గురువారం సాయంత్రానికల్లా రూ.లక్ష మాఫీ చేస్తమన్నరు. కానీ, నేను తీసుకున్న రూ.25 వేలే అయినా మాఫీ కాలేదు. ఇంకా రూ.లక్ష ఎప్పుడయితది? వ్యవసాయాధికారులను అడిగితే బ్యాంకులో అడగాలని చెబుతున్నరు.

-పొతం కిషన్, రాజాపూర్, మం: రాయికల్, జిల్లా జగిత్యాల



మాకేలిస్టు రాలేదు.. నీకేం చెప్పాలంటున్నరు

స్టేషన్‌ఘన్‌పూర్ కాకతీయ గ్రామీణ బ్యాంకులో మూడేండ్ల క్రితం రూ. 21 వేలు పంట రుణం తీసుకున్న. రెన్యువల్ చేశా. మిత్తితో ఇప్పుడు రూ. 28 వేలు అయ్యింది. కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష లోపు పంట రుణాలను మాఫీ చేసిందని ఆనందపడ్డ. తీరా లిస్టులో నా పేరు లేదు. బ్యాంకుకు పోయి అడిగితే మాకే లిస్టు రాలేదు, నీకేం చెప్పాలి అంటున్నరు. లక్ష లోపు అందరికీ మాఫీ చేశారా? లేక కొందరికి మాత్రమే ఇచ్చారో తెలియడం లేదు.

- ఎండీ మహబూబ్‌పాషా, రైతు, ఇప్పగూడెం, జిల్లా జనగామ

గూడెం, బండ్లకు నిరసన సెగ

- ఏసీ(అసలు కాంగ్రెస్) వర్సెస్ వీసీ (వలస కాంగ్రెస్)
- కాంగ్రెస్‌లో భగ్గుమన్న విభేదాలు
- వలస నేతలకు తప్పని భంగపాటు
- మాఫీ సంబురాల్లో చేదు అనుభవం



కాంగ్రెస్ కార్యకర్తపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం/గద్వాల, జూలై 18: రైతు రుణమాఫీ సంబురాలు సంగ్రామాలను తలపించాయి. రైతువేదికల సాక్షిగా ఏసీ(అసలు కాంగ్రెస్) వర్సెస్ వీసీ (వలస కాంగ్రెస్) మాటల యుద్ధం జరిగింది. సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం సోలక్‌పల్లిలో గురువారం నిర్వహించిన రుణమాఫీ సంబురాల్లో పటాన్‌చెరు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో గ్రూపు విభేదాలు భగ్గుమన్నాయి. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు జై కాట శ్రీనివాస్‌గౌడ్.. జై కాంగ్రెస్ అని నినాదాలు చేయడంతో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఒకింత అసహనానికి గురయ్యారు. ఎన్నో ఏండ్ల నుంచి కాట శ్రీనివాస్‌గౌడ్ పటాన్‌చెరులో కాంగ్రెస్ బలోపేతానికి కృషిచేస్తుండగా.. ఇప్పుడు బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే పార్టీలో చేరడాన్ని హస్తం నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. కాంగ్రెస్ కార్యకర్తల నినాదాలు జోరు అందుకోగా, రైతులు స్వీటు తినిపించి జిన్నారం మండలంలో గ్రామాల రుణమాఫీ లబ్ధిదారుల సంఖ్యను మాత్రమే చదివి ఎమ్మెల్యే రెండు నిమిషాల్లోనే ప్రసంగాన్ని ముగించారు. వేదికపై కూర్చున్న కాంగ్రెస్ నేతలు సీఎం మధు, గాలి అనిల్‌కుమార్, రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పనగేశ్ పేర్లు కూడా ఉచ్చరించకుండానే రుణమాఫీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు.. రైతులకు శుభాకాంక్షలు.. అని కానిచ్చారు. కాంగ్రెస్ కార్యకర్తలకు దన్యవాదాలు అంటూ స్టేజీ దిగి వెళ్లిపోయారు. అంతకుముందు సీఎం వీడియో కాన్ఫరెన్స్‌కు వేసిన కుర్చీలపై ముఖ్య నాయకులతోపాటు మాజీ జడ్పీటీసీ కూర్చోవడం.. మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నిలబడటంతో కార్యక్రమంలో గందరగోళానికి కారణమైంది. పార్టీ కోసం పని చేసిన తాము నిలబడి, ఇప్పుడు వచ్చిన వారు కూర్చోవడమేమిటి? తామంతా ఎక్కడ కూర్చోవాలి? అని వారించి దిగారు. మాజీ జడ్పీటీసీ కుర్చీలోంచి లేచే వరకూ కాంగ్రెస్ కార్యకర్తలు మొండికేసి నిల్చున్నారు. కాంగ్రెస్ కార్యకర్తల ఆగ్రహ జ్వాలలు కార్యక్రమంలో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. వాడెవ్వడు.. వీడెవ్వడు అని కాంగ్రెస్ కార్యకర్త చేసిన నినాదంపై ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఒక్కసారిగా సీరియస్ అయ్యారు. 'ఏయ్.. తమాషాగా ఉందా.. అట్ల మాట్లాడితే బాగుండదు.. హా..' అని ఊగిపోతూ హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలను సర్దిచెప్పే ప్రయత్నం చేసినా ఎవరూ తగ్గలేదు. దీంతో ఎమ్మెల్యేతోపాటు కూర్చున్న నాయకులందరూ ఒక్కొక్కరుగా లేచి వేదికపైకి వెళ్లారు. మాజీ జడ్పీటీసీ కే ప్రభాకర్ ఒక్కరే కింద కార్యకర్తలతోపాటు నిలబడ్డారు.



గద్వాల జిల్లా ధరూర్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాలలో ఎవరికి వారే..

గద్వాల కాంగ్రెస్‌లో మరోసారి విభేదాలు బయటపడ్డాయి. గురువారం సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ ప్రకటన చేయడంతో ఉదయమే తన అనుచరులు సంబురాలు చేసుకోవాలని మాజీ జడ్పీచైర్‌పర్సన్ సరిత సూచించడంతో అన్ని మండల కేంద్రాల్లో నిర్వహించారు. అనంతరం జిల్లా కేంద్రంలో మున్సిపల్ చైర్మన్ కేశవ్‌తో కలిసి ఎడ్లబండిపై ర్యాలీ చేపట్టి సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తర్వాత ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ధరూర్‌లో సీఎం చిత్రపటానికి తన అనుచరులతో కలిసి క్షీరాభిషేకం చేసి సంబురాలు చేశారు. ఇలా వేర్వేరుగా సంబురాలు చేసుకోవడం గమనార్హం.

ఫాస్టాగ్ అమర్చని వాహనాలకు
రెట్టింపు టోల్



న్యూఢిల్లీ, జూలై 18: ఉద్దేశపూర్వకంగా తమ వాహనాల ముందు భాగంలోని విండ్ షీల్డ్(అద్దం)కు ఫాస్టాగ్‌ను అతికించని వారి నుంచి రెట్టింపు టోల్ చార్జీలు వసూలు చేయాలని భారత జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) గురువారం ఆదేశించింది. విండ్ షీల్డ్‌కు ఫాస్టాగ్ అతికించకపోవడం వల్ల టోల్ ప్లాజాల వద్ద ఇతర వాహనదారులకు అనవసర జాప్యం జరుగుతున్నదని తెలిపింది. తాజా ఆదేశాలను అన్ని టోల్ ప్లాజాల వద్ద ప్రదర్శిస్తామని చెప్పింది. ఫాస్టాగ్ అతికించని వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్ సీసీటీవీ ఫుటేజీని రికార్డు చేస్తామని వెల్లడించింది. ప్రామాణిక నిబంధనల ప్రకారం ఫాస్టాగ్ కలిగి ఉండి దాన్ని ప్రదర్శించని వాహనాలకు ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ లావాదేవీలు నిర్వహించరని.. అలాంటి వాహనాల నుంచి రెట్టింపు టోల్ చార్జీ వసూలు చేయడంతో పాటు వాటిని బ్లాక్ లిస్టులో ఉంచొచ్చని తెలిపింది. విండ్‌షీల్డ్‌కు ఫాస్టాగ్‌ను అతికించుకొన్నారా లేదా అనే విషయాన్ని వాటిని జారీ చేసే బ్యాంకులు కూడా పరిశీలించాలని ఎన్‌హెచ్‌ఏఐ తన ఆదేశాల్లో పేర్కొంది.

సీబీఐ దర్యాప్తు చేయాలంటే మా అనుమతి తప్పనిసరి
మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు

భోపాల్, జూలై 18: బీజేపీ అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. తమ రాష్ట్ర పరిధిలో సీబీఐ ఏదైనా కేసును దర్యాప్తు చేయాలనుకుంటే ముందుగా తమ నుంచి రాతపూర్వక అనుమతి తీసుకోవాలని స్పష్టం చేసింది. ప్రభుత్వం మంగళవారం ఒక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ ఉత్తర్వులు జూలై 1 నుంచి అమలులోకి వచ్చినట్టు పేర్కొంది. ఇంతవరకు విపక్షాలు అధికారంలో ఉన్న బెంగాల్, తమిళనాడు, పంజాబ్, కేరళ, తెలంగాణ రాష్ట్రాలు మాత్రమే తమ రాష్ట్రాల్లో కేసుల దర్యాప్తునకు తమ అనుమతి తీసుకోవాలంటూ ఆంక్షలు విధించగా, ఇప్పుడు బీజేపీ అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్ ఈ తరహా ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. కొత్త న్యాయ చట్టాల ప్రకారం ఈ అనుమతి అవసరం.

కొందరు దేవుడిలా మారాలనుకుంటారు
ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్

రాంచీ, జూలై 18: ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. జార్ఖండ్‌లోని బిష్ణుపూర్‌లో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'ఆశకు అంతు లేదు. జనం సూపర్‌మ్యాన్ అవాలనుకుంటారు. కానీ అక్కడితో ఆగిపోరు. ఆ తర్వాత దేవత అవాలని, అనంతరం భగవంతుడిగా మారాలని కోరుకుంటారు. అయితే భగవంతుడు.. తాను 'విశ్వరూపుడిని' అని అంటారు. విశ్వరూపం కన్నా పెద్దది ఇంకా ఏదైనా ఉందేమో ఎవరికీ తెలియదు. కార్యకర్తలు దీనిని అర్థం చేసుకోవాలి. ఎప్పటికీ మరింత ఎక్కువగా శ్రమించాలి' అన్నారు. అయితే, భాగవత్ చేసిన వ్యాఖ్యలు ప్రధాని మోదీని ఉద్దేశించినవేనని కాంగ్రెస్ పార్టీ పేర్కొన్నది.

నిద్ర సరిగా లేకపోతే డయాబెటిస్ ముప్పు

న్యూఢిల్లీ : వారం రోజులు సరిగా నిద్ర లేకపోతే టైప్-2 డయాబెటిస్ ముప్పు పెరుగుతుందని తాజా అధ్యయనం హెచ్చరించింది. నిద్ర సమయం గంట తగ్గినా.. వృద్ధులు, మధ్య వయస్కులు డయాబెటిస్ బారినపడే ముప్పు 34 శాతం పెరుగుతుందని తెలిపింది. జీవనశైలిని మార్చుకోవటం ద్వారా డయాబెటిస్ రాకుండా చూసుకోవచ్చని పేర్కొన్నది. 84 వేల మందికి సంబంధించిన బయో బ్యాంక్ డాటా బేస్ ఆధారంగా, పరిశోధకులు కీలక విషయాలు కనుగొన్నారు. 'డయాబెటిస్ కేర్' జర్నల్ వార్తా కథనం ప్రకారం, ఎక్కువ సేపు నిద్రపోతున్న వారిలో జన్యుపరంగా డయాబెటిస్ ముప్పు తక్కువగా ఉందని సైంటిస్టులు గుర్తించారు.

పరీక్ష కేంద్రాల వారీగా ఫలితాలు

- నీట్-యూజీపై ఎన్టీఏకు సుప్రీంకోర్టు ఆదేశం
- ఈ నెల 20 లోగా ప్రకటించాలని గడువు
- విస్తృత స్థాయిలో పరీక్ష పవిత్రత దెబ్బతిన్నట్టు నిర్ధారణ అయితేనే రీటెస్ట్
- తదుపరి విచారణ ఈ నెల 22కు వాయిదా



నీట్ అక్రమాల కేసు వాదనలు వింటున్న సీజేఐతో కూడిన ధర్మాసనం

న్యూఢిల్లీ, జూలై 18: నీట్-యూజీ పరీక్ష ఫలితాలను పరీక్ష కేంద్రాలు, నగరాల వారీగా ప్రకటించాలని జాతీయ పరీక్ష సంస్థ(ఎన్టీఏ)ను సుప్రీంకోర్టు గురువారం ఆదేశించింది. ఇందుకు గాను జూలై 20 మధ్యాహ్నం 12 గంటల వరకు గడువు ఇచ్చింది. అయితే, అభ్యర్థుల గుర్తింపును మాత్రం గోప్యంగా ఉంచాలని సూచించింది. నీట్-యూజీలో అక్రమాలకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. పూర్తిస్థాయిలో పరీక్ష పవిత్రత దెబ్బతిన్నదని ఒక బలమైన నిర్ధారణకు వస్తేనే మళ్లీ పరీక్ష నిర్వహించాలని ఆదేశిస్తామని కోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. పట్నా, హజారీబాగ్‌కు మాత్రమే ప్రశ్నాపత్రం లీకేజీ పరిమితం అయినట్టు ప్రాథమికంగా కనిపిస్తున్నట్టు ధర్మాసనం పేర్కొన్నది. గోద్రాలో మాత్రం ఒక వ్యక్తి పలువురు అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లలో సమాధానాలు రాసేందుకు డబ్బులు తీసుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయని తెలిపింది. నీట్-యూజీలో అక్రమాలపై విచారణ జరుపుతున్న సీబీఐ కోర్టుకు తెలిపిన వివరాలను బయటకు వెల్లడించలేమని, ఇలా చేస్తే విచారణపై ప్రభావం పడుతుందని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. ఈ పిటిషన్లపై విచారణను జూలై 22కు కోర్టు వాయిదా వేసింది.

నలుగురు ఎంబీబీఎస్ విద్యార్థుల అరెస్ట్

నీట్-యూజీ పేపర్ లీక్ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ బుధవారం పాట్నా ఎయిమ్స్ ఎంబీబీఎస్ విద్యార్థులు నలుగురిని అరెస్ట్ చేసింది. వీరిలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్న చందన్ సింగ్, రాహుల్ అనంత్, కుమార్ షాను, రెండో సంవత్సరం విద్యార్థి కరన్ జైన్ ఉన్నారు. వారుంటున్న హాస్టల్ రూమ్‌లను సీబీఐ అధికారులు సీజ్ చేశారు. నీట్ పేపర్ లీక్‌కు సంబంధించి సీబీఐ ఇప్పటివరకు ఆరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసింది. కాగా హజారీబాగ్‌లో ఎన్టీఏ ట్రంక్ పెట్టె నుంచి పరీక్ష పేపర్ అపహరించిన పంకజ్ కుమార్ అలియాస్ ఆదిత్య అనే సివిల్ ఇంజినీర్, పేపర్ అపహరణలో అతనికి సహకరించిన రాజు సింగ్ అనే వ్యక్తిని రెండు రోజుల క్రితమే సీబీఐ అరెస్ట్ చేసింది.

సీఎస్ఐఆర్ పరీక్షలోనూ
అక్రమాలు?

- ఎస్‌ఓ, ఏఎస్‌ఓ నియామకాలకు జూలై 7న పరీక్ష నిర్వహణ
- బ్లాక్‌లిస్ట్ అయిన కంపెనీకి ఎగ్జామ్ కాంట్రాక్టు అప్పగింత
- అవకతవకలకు అవకాశం కల్పించేలా సాఫ్ట్‌వేర్
- కొందరికి పరీక్ష సిబ్బంది సహకరించినట్టు ఆరోపణలు
- క్లాస్‌రూములా పరీక్ష కేంద్రం.. వీడియో వైరల్
- సీఎస్ఐఆర్ పరీక్షలో అక్రమాలపై 'ది వైర్' వెబ్‌సైట్ కథనం



అభ్యర్థులకు కొందరు సిబ్బంది సహకరిస్తున్నట్టు ఉన్న వీడియో దృశ్యాలు

న్యూఢిల్లీ, జూలై 18: నీట్-యూజీ, నెట్ పరీక్షల్లో అక్రమాలపై సర్వత్రా ఆందోళన కొనసాగుతుండగానే సీఎస్ఐఆర్ నియామక పరీక్షలోనూ అవకతవకలు జరిగాయనే అంశం వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి 'ది వైర్' పరిశోధనాత్మక కథనం ప్రచురించింది. ఈ కథనం ప్రకారం.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షుడిగా ఉండే కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్(సీఎస్ఐఆర్)లో సెక్షన్ ఆఫీసర్(ఎస్ఓ), అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్(ఏఎస్ఓ) ఉద్యోగాల భర్తీకి జూలై 7న రెండో దశ పరీక్ష జరిగింది. పరీక్ష నిర్వహించడంలో సీఎస్ఐఆర్ పూర్తిగా విఫలమైందనే వాదనలు వినిపిస్తున్నాయి.

బ్లాక్‌లిస్ట్ అయిన కంపెనీకి కాంట్రాక్టు

మొదటి విడత పరీక్షలో ఎంపికైన విద్యార్థులకు రెండో విడతగా కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ) నిర్వహించారు. ఈ పరీక్ష నిర్వహించే కాంట్రాక్టును గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన ఎడ్యుటెస్ట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీకి సీఎస్ఐఆర్ అప్పగించింది.

అయితే, ఈ సంస్థను గతంలోనే ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం బ్లాక్‌లిస్ట్‌లో చేర్చింది. మొదటి దశ పరీక్షపై ఆరోపణలు వచ్చినప్పటికీ రెండో దశ పరీక్ష నిర్వహించే బాధ్యతలను కూడా ఈ కంపెనీకే సీఎస్ఐఆర్ ఇచ్చింది. ఈ కంపెనీ గుజరాత్‌కు చెందిన బీజేపీ సన్నిహితులుండగా 'ది వైర్' పేర్కొన్నది. ఈ కంపెనీ వ్యవస్థాపకుడు సురేశ్‌చంద్ర ఆర్య అధ్యక్షుడిగా ఉన్న ఓ సంఘం కార్యక్రమాలకు గతంలో ప్రధాని మోదీ సైతం హాజరయ్యారని తెలిపింది. ఈ సంస్థ ఎండీ వినీత్ ఆర్య గతంలో ఓ పేపర్ లీక్ కేసులో జైలుకు కూడా వెళ్లినట్టు వైర్ తన కథనంలో తెలియజేసింది.

అక్రమాలకు వీలుకల్పించేలా సాఫ్ట్‌వేర్

సీబీటీ పరీక్ష జరుగుతున్నప్పుడు పరీక్ష కేంద్రాల్లో తీసిన ఫొటోలు, వీడియోలు వైరల్‌గా మారాయి. అభ్యర్థులు గుంపులుగా ఉండటం, మాట్లాడుకుంటున్నట్టు వీటిల్లో కనిపిస్తున్నది. సాధారణంగా సీబీటీ పరీక్ష జరిగేప్పుడు కంప్యూటర్ మొత్తంపై అభ్యర్థులకు నియంత్రణ ఉండొద్దు. కేవలం పరీక్ష జరిగే వెబ్‌పేజీ మాత్రమే కనిపించాలి. కానీ, ఈ పరీక్ష జరిపిన సాఫ్ట్‌వేర్ అక్రమాలకు అవకాశం కల్పించేలా ఉందని పలువురు అభ్యర్థులు ఆరోపించారు. కంప్యూటర్‌లోని వేరే ఫైల్స్‌పై అభ్యర్థులకు నియంత్రణ లభించేలా సాఫ్ట్‌వేర్ ఉందని, పెన్‌డ్రైవ్ కూడా వినియోగించే అవకాశం ఉందని చెప్పారు. పరీక్ష నిర్వహించిన సిబ్బంది కొందరు అభ్యర్థులకు సహకరించారని సైతం పలువురు ఆరోపించారు.



100 మందితో రండి..
ప్రభుత్వాన్ని ఏర్పాటుచేద్దాం
బీజేపీ ఎమ్మెల్యేలకు అఖిలేశ్ ఆఫర్

లక్నో, జూలై 18: ఉత్తరప్రదేశ్ అధికార బీజేపీలో అసంతృప్తి జ్వాలలు ఆ రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇదే అంశంపై సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ 'ఎక్స్' వేదికగా గురువారం కీలక వ్యాఖ్యలు చేశారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు పార్టీ మారాలని సూచించారు. 'వర్షాకాలం ఆఫర్ ఇది: 100 మందితో రండి. ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయండి' అంటూ అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. బీజేపీలో సీఎం యోగిపై అసంతృప్తిగా ఉన్నవారిని ఉద్దేశించి తాను ఈ మాటలు చెప్పానని అన్నారు.

జాహ్నవి కందుల కేసులో..
పోలీస్ అధికారి డిస్మిస్

సియాటిల్: భారతీయ విద్యార్థిని మరణంపై నవ్వడమే కాక, అనుచిత వ్యాఖ్యలు చేసిన అమెరికా పోలీస్ అధికారిని ఎట్టకేలకు విధుల నుంచి తప్పించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జాహ్నవి కందుల (23) గత ఏడాది జనవరి 23న రోడ్డును దాటుతుండగా సియాటిల్ పోలీస్ అధికారి ఒకరు నడుపుతున్న పోలీస్ వాహనం ఢీకొనడంతో మరణించింది. ఆ సమయంలో డ్రైవర్ వాహనాన్ని 74 కి.మీ వేగంతో నడుపుతున్నారు. అయితే ఆమె మరణంపై పోలీస్ అధికారి డేనియల్ ఆడెరెర్ బిగ్గరగా నవ్వుతూ ఎగతాళిగా మాట్లాడాడు. అతని చర్యపై అప్పట్లో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. దీంతో డేనియల్‌ను అప్పట్లో సస్పెండ్ చేసిన అధికారులు తాజాగా అతడిని విధుల నుంచి పూర్తిగా తొలగిస్తున్నట్టు ప్రకటించారు. దీనిపై సియాటిల్ పోలీస్ శాఖ చీఫ్ స్యూ రహర్ మాట్లాడుతూ డేనియల్ చేసిన వ్యాఖ్యలు పోలీసు శాఖకు అవమానమని అన్నారు.

ఆస్ట్రేలియాలో నీట మునిగి
ఇద్దరు తెలుగు విద్యార్థుల మృతి

సిడ్నీ, జూలై 18: ఆస్ట్రేలియాలో జలపాతం వద్ద ప్రమాదవశాత్తు నీట మునిగి ఇద్దరు తెలుగు విద్యార్థులు మృతి చెందారు. ఆస్ట్రేలియాలో ఉన్నత విద్యాభ్యాసం కోసం వెళ్లిన ఇద్దరు విద్యార్థులు మంగళవారం క్వీన్స్‌ల్యాండ్‌లోని మిల్లా మిల్లా జలపాతం వద్ద నీటమునిగి మృతి చెందారు. వారిని ఏపీలోని బాపట్ల జిల్లాకు చెందిన చైతన్య ముప్పరాజు, ప్రకాశం జిల్లాకు చెందిన సూర్య తేజ బొబ్బాగా గుర్తించారు. వారితో పాటు ఉన్న మరో విద్యార్థి పార్క్‌లో ఉండటంతో అతని నుంచి వివరాలేవీ తెలియరాలేదు. వారిద్దరి మృతదేహాలు నీటిలో గల్లంతయ్యాయని, వాటి కోసం గాలిస్తున్నట్టు క్వీన్స్‌ల్యాండ్ పోలీసులు తెలిపారు. కాగా, అంత్యక్రియలు, మృతదేహాల తరలింపునకు అయ్యే ఖర్చు కోసం స్నేహితులు ఆన్‌లైన్‌లో విరాళాల సేకరణ చేపట్టారు.



సమీర్ సిద్ధరామయ్య

నా పిల్లలు కర్ణాటకలో ఉద్యోగానికి అర్హులు కారా?
స్థానిక కోటా బిల్లుపై ఫోన్‌పే సీఈవో ఆగ్రహం

న్యూఢిల్లీ, జూలై 18: ప్రైవేట్ రంగంలో స్థానికులకు సింహ భాగం ఉద్యోగాలు కల్పించాలన్న కర్ణాటక కాంగ్రెస్ సర్కారు స్థానిక కోటా బిల్లుపై ఫోన్‌పే సీఈవో సమీర్ నిగమ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల ఉద్యోగం కారణంగా వివిధ రాష్ట్రాల్లో నివసించిన తన లాంటి వారికి ఈ బిల్లు అసమంజసమని తెలిపారు. 'మా నాన్న భారత నౌకాదళ ఉద్యోగిగా దేశమంతటా పనిచేశారు. నేను ఏ రాష్ట్రంలోనూ 15 ఏండ్ల కంటే ఎక్కువ నివసించలేదు' అని ఆయన బుధవారం ఎక్స్‌లో వ్యాఖ్యానించారు. 'నేను కొన్ని కంపెనీలు స్థాపించి దేశ వ్యాప్తంగా 25 వేల ఉద్యోగాలు సృష్టించాను. అయినప్పటికీ కర్ణాటకలో పెరిగిన నా పిల్లలు అక్కడ ఉద్యోగాలకు అర్హులు కారా' అని ప్రశ్నించారు. కర్ణాటక ప్రభుత్వ ప్రయత్నాలు సిగ్గుచేటని మండిపడ్డారు.


ముస్లింలను దేశంలో ఉండనివ్వటం పెద్ద తప్పు
కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్

న్యూఢిల్లీ, జూలై 18: కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ముస్లింలను ఉద్దేశించి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'దేశ విభజన జరిగాక.. ముస్లింలను భారత్‌లో ఉండనివ్వటం పెద్ద తప్పు' అంటూ వ్యాఖ్యానించారు. '1947లోనే ముస్లింలందర్నీ పాకిస్థాన్‌కు పంపినట్టయితే, భారతదేశం మరోలా ఉండేది. అలా జరగకపోవటం దేశానికి దురదృష్టకరంగా మారింది. ఈ దేశంలో ముస్లింలను ఉండనివ్వటం పెద్ద తప్పు' అని అన్నారు. ఆయన వ్యాఖ్యల్ని ఆర్‌ఎస్‌ఎస్ మ్యాగజైన్ 'పాంచజన్య' సోషల్ మీడియా 'ఎక్స్'లో షేర్‌చేసింది.

చైల్డ్ పోర్నోగ్రఫీని చూడటం నేరం కాదు : హైకోర్టు

బెంగళూరు: ఆన్‌లైన్‌లో చైల్డ్ పోర్నోగ్రఫీని చూడటం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) చట్టంలోని సెక్షన్ 67బీ ప్రకారం నేరం కాదని కర్ణాటక హైకోర్టు తెలిపింది. అయుంటే మెటీరియల్‌ను ప్రచురించడం లేదా ప్రసారం చేయడం మాత్రమే నేరం అవుతుందని చెప్పింది. 2022 మార్చిలో నిందితుడు చైల్డ్ పోర్నోగ్రఫీ వెబ్‌సైట్‌ను చూసినట్టు సైబర్, ఎకనామిక్, నార్కొటిక్స్ పోలీసులు నమోదు చేసిన కేసును రద్దు చేసింది. పిటిషనర్ తన వాదనలో, పోర్నోగ్రఫీకి బానిసయ్యానని, అయితే, ఆ మెటీరియల్‌ను ఇతరులకు పంపించలేదని చెప్పారు.

స్ట్రాంగ్ రూమ్‌కు జగన్నాథుడి ఆభరణాలు
రత్న భాండాగారం నుంచి తరలింపు



పూరీ, జూలై 18: పూరీ జగన్నాథ్ ఆలయంలోని రత్న భాండార్‌లో ఉన్న ఆభరణాలను బయటకు తీశారు. 46 ఏండ్ల తర్వాత జూలై 14న మొదటిసారి రత్న భాండార్‌లోని లోపలి గదిని తెరిచిన దేవాలయ అధికారులు గురువారం మరోసారి తెరిచారు. అందులోని ఆభరణాలను ఆలయంలోని తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించారు. ఈ ప్రక్రియకు ఏడు గంటల సమయం పట్టింది. మూడు చెక్క అల్మారాలు, రెండు చెక్క పెట్టెలు, ఒక స్టీల్ అల్మారా, ఒక ఇనుప పెట్టెలో ఆభరణాలను భద్రపరిచి సీల్ వేసినట్టు శ్రీ జగన్నాథ్ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్(ఎస్‌జేటీఏ) చీఫ్ అరబిందా పాఢీ తెలిపారు. తాము రత్న భాండార్‌లో ఏయే ఆభరణాలు చూశామనేది బయటకు చెప్పబోమని తెలిపారు. రత్న భాండాగారానికి పురావస్తు శాఖ మరమ్మతులు చేపడుతుందని, అనంతరం ఆభరణాలు, ఇతర విలువైన వస్తువుల లెక్కింపు ఉంటుందని పేర్కొన్నారు. కాగా, ముందు జాగ్రత్తగా పాములను పట్టేవారిని, ఒడిశా ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, అగ్నిమాపక సిబ్బందిని రప్పించినప్పటికీ వీరి అవసరం పడలేదు. చివరిసారిగా 46 ఏండ్ల కిందట రత్నభాండాగారాన్ని తెరిచారు.

ఎయిడ్స్ పూర్తిగా నయం
జర్మనీ దేశస్థుడికి స్టెమ్ సెల్ చికిత్స విజయవంతం
వ్యాధి నుంచి పూర్తిగా కోలుకున్న ఏడో వ్యక్తి

బెర్లిన్, జూలై 18: ఎయిడ్స్ మహమ్మారి చికిత్సలో మరో ముందడుగు పడింది. జర్మనీకి చెందిన 60 ఏండ్ల వ్యక్తికి ఈ వ్యాధి పూర్తిగా నయమైంది. 40 ఏండ్ల ఎయిడ్స్ చరిత్రలో పూర్తిగా ఈ వ్యాధి బారి నుంచి బయటపడ్డ ఏడో వ్యక్తి ఈయన. బాధితుడికి చేసిన స్టెమ్ సెల్ చికిత్స విజయవంతమైనట్టు వైద్యులు గురువారం ప్రకటించారు. ఇతడికి 2015లో ప్రమాదకరమైన, బోన్మ్యారోతో కూడుకున్న స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంట్ చేసినట్టు తెలిపారు. హెచ్ఐవీతో పాటు మైలాయిడ్ లుకేమియా ఉన్న వారికి మాత్రమే ఈ చికిత్స చేస్తామన్నారు. ఈ చికిత్స తీసుకున్నప్పటి నుంచి ఇతడి శరీరంలో మళ్లీ వైరస్ జాడలు కనిపించలేదని వైద్యులు తెలిపారు. కాగా, ఎయిడ్స్ బారి నుంచి పూర్తిగా బయటపడ్డ మొదటి వ్యక్తి టిమోతి రే బ్రౌన్‌కు కూడా లుకేమియా సమస్య ఉండేది. దీంతో 2007లో ఆయనకు కూడా స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంట్ చేశారు. ఆ తర్వాత అతడు ఈ వ్యాధి నుంచి పూర్తిగా కోలుకున్న మొదటి వ్యక్తిగా నిలిచారు.



డెంగ్యూతో బ్రెయిన్ స్ట్రోక్ ముప్పు
రక్తం గడ్డ కట్టే ప్రమాదం

న్యూఢిల్లీ, జూలై 18: దోమల ద్వారా వచ్చే డెంగ్యూ వ్యాధి వల్ల బ్రెయిన్ స్ట్రోక్ ముప్పు కూడా ఉంటుందని వైద్యులు హెచ్చరించారు. ఇన్ఫెక్షన్ సోకిన మొదటి రెండు నెలల్లో ఈ ప్రమాదం మరింత ఎక్కువ ఉంటుందని తెలిపారు. సాధారణంగా డెంగ్యూ బాధితుల్లో జ్వరం, ఒళ్లు నొప్పులు, దద్దుర్లు, వాంతులు, వికారం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొందరిలో డెంగ్యూ ప్రభావం మెదడు, నాడీ వ్యవస్థపై కూడా పడుతుందని, ప్రాణాంతకమైన స్ట్రోక్‌లకు కారణమవుతుందని పలువురు వైద్యులు పేర్కొన్నారు. డెంగ్యూ షాక్ సిండ్రోమ్‌గా పిల్చేనే తీవ్రమైన ప్లాస్మా లీకేజీ వల్ల మెదడు సహా కీలకమైన అవయవాలకు రక్త సరఫరా సరిగ్గా జరగదని, ఇలాంటి పరిస్థితుల్లోనే స్ట్రోక్ ముప్పు ఉంటుందని న్యూరాలజిస్ట్ డాక్టర్ లోకేశ్ భిడుక్ తెలిపారు. డెంగ్యూ వైరస్ కొన్నిసార్లు నరాల కణాలను ఆక్రమించి పనితీరును దెబ్బతీస్తుందని చెప్పారు. మెదడు, వెన్నెముకలో వాపు ఏర్పడి కణజాలం దెబ్బతినే ప్రమాదం ఉంటుందన్నారు.



పట్టాలు తప్పిన బోగీల వద్ద గుమిగూడిన ప్రయాణికులు, స్థానికులు

పట్టాలు తప్పిన చండీగఢ్-డిబ్రూగఢ్ ఎక్స్‌ప్రెస్
ముగ్గురు మృతి.. 34 మందికి తీవ్రగాయాలు
యూపీలోని గోండా సమీపంలో ప్రమాదం

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో రైలు ప్రమాదం చోటుచేసుకుంది. గురువారం గోండా రైల్వే స్టేషన్‌కు సమీపంలో చండీగఢ్-డిబ్రూగఢ్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. 12 బోగీలు పక్కకు ఒరిగాయి. పట్టాలు తప్పిన బోగీల్లో ఒకటి పూర్తిగా పల్టీలు కొట్టింది. ఈ ప్రమాద ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని వార్తలు వెలువడ్డాయి. 34 మంది తీవ్రంగా గాయపడ్డారని నార్త్ ఈస్టర్న్ రైల్వే జనరల్ మేనేజర్ సౌమ్య మాథుర్ విలేకరులకు తెలిపారు. మృతుల సంఖ్యపై అధికారులు, మంత్రులు రకరకాలుగా మాట్లాడారు. యూపీ డిప్యూటీ సీఎం బ్రజేశ్ పాఠక్, జిల్లా కలెక్టర్ నేహా శర్మ.. నలుగురు చనిపోయారని వెల్లడించారు. రైల్వే అధికారి.. ముగ్గురు మృతి చెందారని ప్రకటించారు. ఆ తర్వాత మృతుల సంఖ్యను ఒకటికి తగ్గించారు. క్షతగాత్రులను వెంటనే దవాఖానకు పంపి వైద్య చికిత్స అందిస్తున్నామని బ్రజేశ్ పాఠక్ చెప్పారు. జిల్లా అధికారులు, విపత్తు సహాయక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. 'బుధవారం రాత్రి చండీగఢ్ నుంచి బయల్దేరిన రైలు నెంబర్ 15904 చండీగఢ్-డిబ్రూగఢ్ ఎక్స్‌ప్రెస్, గురువారం మధ్యాహ్నం 2.37 గంటలకు పట్టాలు తప్పింది' అని రైల్వే శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రైలు ప్రమాదంపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రయాణికుల భద్రత కోసం కేంద్రం ఏం చేస్తున్నది? వరుస రైలు ప్రమాదాలు జరుగుతున్నా.. కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి ఎప్పుడొస్తుంది?' అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మోదీ సర్కార్ ఒక క్రమపద్ధతిలో రైల్వేను ప్రమాదంలోకి నెట్టింది అనేందుకు తాజా ఘటనే ఉదాహరణ' అని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే అన్నారు.

ఆయుష్షు పెంచే ఔషధం
ఎలుకలపై విజయవంతమైన ప్రయోగం
వృద్ధాప్యాన్ని నెమ్మదింపజేస్తున్నట్టు గుర్తించిన సైంటిస్టులు



లండన్, జూలై 18: మనుషుల జీవితకాలాన్ని పెంచాలనే లక్ష్యంతో అభివృద్ధి చేసిన ఓ ఔషధం ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. ఎలుకలపై విజయవంతమైన ఈ ఔషధ ప్రయోగం మనుషుల ఆయుష్షును కూడా పెంచవచ్చనే ఆశలు చిగురిస్తున్నాయి. లండన్‌లోని ఇంపీరియల్ కాలేజీకి చెందిన ఎంఆర్‌సీ ల్యాబొరేటరీ ఆఫ్ మెడికల్ సైన్స్, సింగపూర్‌లోని డ్యూక్-ఎన్‌యూఎస్ మెడికల్ స్కూల్‌కు చెందిన పరిశోధకులు తయారుచేసిన ఈ ఔషధానికి సంబంధించిన వివరాలు 'నేచర్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

25 శాతం పెరిగిన ఎలుకల జీవితకాలం

పరిశోధకులు ఈ ప్రయోగంలో భాగంగా ఇంటర్‌ల్యూకిన్-11 అనే ప్రొటీన్‌పై దృష్టి సారించారు. వయసు పెరుగుతున్న కొద్దీ శరీరంలో దీని స్థాయిలు పెరుగుతాయి. వృద్ధాప్యానికి ఇదే ప్రధాన కారణమని పరిశోధకులు గుర్తించారు. ఇంటర్‌ల్యూకిన్-11 ఉత్పత్తిని అడ్డుకునేందుకు ఒక ఔషధాన్ని అభివృద్ధి చేశారు. దీనికి 75 వారాల వయసు ఉన్న ఎలుకలపై ప్రయోగించారు. ఇది మనుషులకు 55 ఏండ్ల వయసుతో దాదాపుగా సమానం. ఈ ఔషధాన్ని ప్రయోగించిన ఎలుకల జీవితకాలం 20-25 శాతం పెరిగిందని పరిశోధకులు తెలిపారు. ఎలుకల కండరాల పనితీరు మెరుగయ్యిందని, సన్నగా, దృఢంగా మారాయని, వెంట్రుకలు ఎక్కువగా వచ్చాయని గుర్తించినట్టు చెప్పారు. ఎలుకలపై సత్ఫలితాలను ఇచ్చిన ఈ ఔషధాన్ని ప్రస్తుతం మనుషులపై కూడా ప్రయోగిస్తున్నారు. ముందుగా ఊపిరితిత్తుల ఫైబ్రోసిస్‌తో బాధపడుతున్న వారికి ఈ ఔషధం ఇవ్వామని, ఇది మనుషులు తీసుకోవడానికి సురక్షితమే అనేది తాము గుర్తించినట్టు ప్రొఫెసర్ స్టువర్డ్ కుక్ తెలిపారు. అయితే, మనుషులపై ఇది ఎలా పని చేస్తుందనే తేలాల్సి ఉంది.

మీట నొక్కితే మరణమే!
సూసైడ్ క్యాప్సూల్ తయారుచేసిన స్విట్జర్లాండ్ సంస్థ
మరికొన్ని నెలల్లో ఇది అందుబాటులోకి వచ్చే అవకాశం



జ్యూరిచ్, జూలై 18: ఆత్మహత్య చేసుకోవాలనుకునే వారు నొప్పి లేకుండా తనువు చాలించేలా చేసే సూసైడ్ క్యాప్సూల్ మరికొన్ని నెలల్లో స్విట్జర్లాండ్‌లో అందుబాటులోకి రానున్నది. సార్కో క్యాప్సూల్‌గా పిలిచే ఈ సూసైడ్ మెషీన్‌ను లాస్ట్ రిసార్ట్ ఆర్గనైజేషన్ అనే సంస్థ తయారుచేసింది. ఈ క్యాప్సూల్ పనితీరును దీని సృష్టికర్త ఫిలిప్ నిట్స్కే వివరించారు. ఆత్మహత్య చేసుకోవాలని అనుకునే వారు క్యాప్సూల్‌లో కూర్చొని మూత పెట్టేసిన తర్వాత.. ఎవరు మీరు? మీరు ఇప్పుడు ఎక్కడ ఉన్నారో తెలుసా? ఈ బటన్ నొక్కితే ఏమవుతుందో తెలుసా? వంటి మూడు ఆటోమేటెడ్ ప్రశ్నలను క్యాప్సూల్ అడుగుతుంది. వీటికి సమాధానం చెప్పిన తర్వాత.. 'మీరు చనిపోవాలనుకుంటే ఈ బటన్ నొక్కండి' అనే సందేశం వినిపిస్తుంది. బటన్ నొక్కిన 30 సెకన్లలో క్యాప్సూల్‌లో 21 శాతంగా ఉండే ఆక్సిజన్ స్థాయిలు 0.05 శాతానికి పడిపోయి, నైట్రోజన్ స్థాయిలు పెరిగిపోతాయి. దీంతో మనిషి ఐదు నిమిషాల పాటు స్పృహ కోల్పోయి, తర్వాత మరణిస్తారు. ఒకసారి బటన్ నొక్కిన తర్వాత ప్రాణాలు దక్కవని ఫిలిప్ తెలిపారు. క్యాప్సూల్ వినియోగించాలంటే కనీసం 50 ఏండ్ల వయస్సు ఉండాలని, తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్న వారైతే 18 ఏండ్లు దాటాలని చెప్పారు. ఈ క్యాప్సూల్ వినియోగానికి దాదాపు రూ.1,700 ఖర్చవుతాయని ఈ సంస్థ ప్రకటించింది.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కేంద్రమంత్రి గడ్కరీ

తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ • సర్వదర్శనానికి 18 గంటలు

హైదరాబాద్, జూలై18 (నమస్తేతెలంగాణ): కేంద్ర రోడ్లు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్‌గడ్కరీ గురువారం తిరుమలలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టీటీడీ జేఈవో వీర బ్రహ్మం, అర్చకులు ఘనస్వాగతం పలికి గర్భగుడికి తీసుకెళ్లారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించారు. తిరుమలలో స్వామి వారి దర్శనం కోసం 31 కంపార్టుమెంట్లలో భక్తులు వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులకు 18 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు పేర్కొన్నారు. బుధవారం స్వామివారిని 69,029 మంది దర్శించుకోగా 28,547 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తుల కానుకల ద్వారా రూ. 2.90 కోట్ల ఆదాయం వచ్చింది.

తిరుమలలో ఫుడ్ సేఫ్టీ మస్ట్!

- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు
- టీటీడీ ఈవో జే శ్యామలరావు
- ఫుడ్ సేఫ్టీ విభాగంతో కలిసి హోటళ్ల తనిఖీ
- మొబైల్ ల్యాబ్, ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ ప్రారంభం



హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): తిరుమలలోని హోటళ్లు, ఇతర దుకాణాల్లో ఆహార తయారీ నిబంధనలను తప్పకుండా పాటించాలని, లేనట్లయితే కఠిన చర్యలు తప్పవని టీటీడీ ఈవో జే శ్యామలరావు హెచ్చరించారు. తిరుమలలోని కౌస్తుభం విశ్రాంతి భవనం సమీపంలో ఉన్న బాలాజీ భవన్ హోటల్‌ను ఫుడ్ సేఫ్టీ విభాగం (ఎఫ్ఎస్) డైరెక్టర్ పూర్ణచంద్రరావు బృందంతో కలిసి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హోటల్‌లో తయారు చేస్తున్న ఆహార పదార్థాలు, నిల్వ ఉన్న ముడిసరుకులు, పరిశుభ్రత తదితర పద్ధతులను వారు పరిశీలించారు. కొన్ని కిరాణా సామగ్రితో సహా ఆలుగడ్డ, కాలీఫ్లవర్, ఇతర కొన్ని కూరగాయలు కుళ్లిపోయినట్లు గుర్తించారు. పరిశుభ్రత, పారిశుద్ధ్య చర్యలు సక్రమంగా లేవని వారు తెలిపారు. యాత్రికుల ఫిర్యాదు మేరకు హోటల్‌ను తనిఖీలు చేశామని చెప్పారు. హోటల్ నిర్వాహకులు ఆహార భద్రతా నిబంధనలను పాటించడం లేదని, అపరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాలు తయారు చేస్తున్నట్లు ఈవో శ్యామలరావు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు మరిన్ని నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అనంతరం మొబైల్ ల్యాబ్, ఫుడ్‌సేఫ్టీ ఆన్ వీల్స్‌ను ఈవో, ఎఫ్ఎస్ డైరెక్టర్ ప్రారంభించారు. ప్రత్యేకమైన ఈ వాహనం ఆహారం, నీటి నాణ్యతను తనిఖీ చేయడానికి అవసరమైన ల్యాబ్ పరికరాలతో ఉంటుందని వివరించారు. ఈ మొబైల్ ల్యాబ్ 80 రకాల పదార్థాల నాణ్యతలను తనిఖీ చేస్తుందని తెలిపారు.



మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో బోడుప్పల్ బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు

దర్శకుడు పూరిపై బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు

బోడుప్పల్, జూలై 18: డబుల్ స్మార్ట్ సినిమా పాటలో కేసీఆర్ వాయిస్ వాడినందుకు దర్శకుడు పూరి జగన్నాథ్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బోడుప్పల్ బీఆర్ఎస్ నేతలు ఉప్పుని విజయ్, రాజా గురువారం మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే కేసీఆర్ వాయిస్‌ను తొలగించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా సినిమాను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో విజయ్, రాజా, వినయ్, మురళి, రాకేశ్ పాల్గొన్నారు.

ఏపీలో 17 విశ్వవిద్యాలయాలకు

ఇన్‌చార్జి వీసీలు

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): ఏపీలోని 17 యూనివర్సిటీలకు ఇన్‌చార్జి వీసీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ చిప్పాడ అప్పారావు, అనంతపురం ఎస్కేయూ వీసీగా ప్రొఫెసర్ అనిత, విశాఖ ఆంధ్రాయూనివర్సిటీ వీసీగా ప్రొఫెసర్ గొట్టాపు శశిభూషణ్ రావు, గుంటూరు నాగార్జునవర్సిటీ వీసీగా ప్రొఫెసర్ కంచర్ల గంగాధర్, అనంతపురం జేఎన్టీయూ వీసీగా సుదర్శనరావు, తిరుపతి పద్మావతి మహిళా వర్సిటీ వీసీగా ప్రొఫెసర్ ఉమ, విజయనగరం జేఎన్టీయూ గురజాడ వర్సిటీ వీసీగా ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి, కాకినాడ జేఎన్టీయూ వీసీగా ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, రాజమండ్రి ఆదికవి నన్నయ్య వర్సిటీ వీసీగా ప్రొఫెసర్ శ్రీనివాసరావు, నెల్లూరు విక్రమసింహపురి వర్సిటీ వీసీగా ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు, బందరు కృష్ణా వర్సిటీ వీసీగా శ్రీనివాసరావు, కర్నూలు రాయలసీమ వర్సిటీ వీసీగా ఎన్టీకే నాయక్, కుప్పం ద్రవిడవర్సిటీ వీసీగా దొరైస్వామి, కడప వైఎస్సార్ ఆర్కిటెక్చర్ వర్సిటీ వీసీగా విశ్వనాథకుమార్, ఒంగోలు ఆంధ్రకేసరి వర్సిటీ వీసీగా డీవీఆర్ మూర్తి, కర్నూలు అబ్దుల్ హక్ ఉర్దూ వర్సిటీ వీసీగా పఠాన్ షేక్ షావలీఖాన్, కడప యోగి వేమన వర్సిటీ వీసీగా కృష్ణారెడ్డి నియమితులయ్యారు.

కిలో బంగారు ఆభరణాల చోరీ!

సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో ఘటన

బేగంపేట్ జూలై 18: సికింద్రాబాద్ మోండా మార్కెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి భారీ బంగారం చోరీ జరిగింది. సికింద్రాబాద్ క్లాక్ టవర్ సమీపంలోని శ్రీని జువెలర్స్ నుంచి రాత్రి 7 గంటలకు దినేశ్ జైన్ అనే వ్యక్తి పాట్ మార్కెట్‌లోని ఎస్ఎస్ జువెలర్స్ దుకాణంలో అప్పగించేందుకు బంగారు ఆభరణాలను తీసుకొని బైక్‌పై వెళ్తున్నాడు. బాటా చౌరస్తా సమీపంలో స్టేట్ బ్యాంక్ మీదుగా వెళ్తుండగా ముఖానికి మాస్కులు, హెల్మెట్ ధరించి ఉన్న ఇద్దరు దుండగులు దినేశ్ జైన్ వాహనాన్ని అడ్డగించి బంగారు ఆభరణాల బ్యాగును లాక్కొని పారిపోయారు. వెంటనే దినేశ్ జైన్ దుకాణ యజమానికి ఫోన్ చేసి విషయాన్ని చెప్పారు. మార్కెట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బ్యాగులో సుమారు కిలో వరకు బంగారు ఆభరణాలు ఉన్నట్లు తెలిసింది. పోలీసులు నిందితులను గుర్తించేందుకు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని బృందాలుగా నిందితుల కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. బాధితుడు దినేశ్‌జైన్‌నూ పోలీసులు విచారిస్తుండటం గమనార్హం.

శ్రీవాణి దర్శన టికెట్లు వెయ్యికి పరిమితం

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): తిరుమల శ్రీవారి దర్శనాన్ని సామాన్య భక్తులకు మరింతగా కల్పించేందుకు టీటీడీ చర్యలు తీసుకుంది. ఈ నెల 22 నుంచి శ్రీవాణి దర్శన టికెట్ల రోజువారీ కోటాను వెయ్యికి పరిమితం చేసింది. ఆన్‌లైన్‌లో 500, ఆఫ్‌లైన్‌లో 1000 టికెట్లు జారీ చేయనున్నారు. తిరుమల గోకులం విశ్రాంతి భవనంలో 900 శ్రీవాణి టికెట్లను మొదట వచ్చిన వారికి మొదట ప్రాతిపదికగా ఇస్తారు. మిగిలిన 100 టికెట్లను శ్రీవాణి దాతలకు విమానాశ్రయంలో కరెంట్ బుకింగ్ కౌంటర్‌లో అందుబాటులో ఉంచారు. బోర్డింగ్ పాస్ ద్వారా తిరుపతి ఎయిర్‌పోర్టు కౌంటర్‌లో మాత్రమే ఈ ఆఫ్‌లైన్ టికెట్లు జారీచేస్తారు. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

మానసికోల్లాసానికి దిక్సూచి 'నారాయణ గైడ్‌కాస్ట్'

నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ సింధూర


జూబ్లీహిల్స్, జూలై 18: విద్యార్థుల్లో మానసికోల్లాసానికి 'నారాయణ గైడ్‌కాస్ట్' దిక్సూచిగా నిలుస్తుందని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ సింధూరనారాయణ తెలిపారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని తీర్చిదిద్దేందుకు యూట్యూబ్ వేదికగా గైడ్‌కాస్ట్ మొదటి సీజన్, మొదటి ఎపిసోడ్‌ను మరో డైరెక్టర్ శరణినారాయణతో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ గైడ్‌కాస్ట్ తల్లిదండ్రులు, పిల్లల మధ్య ఉండాల్సిన సంబంధాలు, భావోద్వేగ సమయంలో మద్దతు, డిపెండెన్సీ, ఆందోళనలను ప్రస్తావిస్తుందన్నారు. దీనిని విని ఆచరిస్తే అనేక ప్రయోజనాలు పొందవచ్చని సూచించారు.

సంగారెడ్డి సీఈగా ధర్మ

హైదరాబాద్, జూలై18 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి ఇరిగేషన్ సర్కిల్ చీఫ్ ఇంజినీర్‌గా ధర్మను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ధర్మ హైదరాబాద్ సీఈగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన స్థానంలో హైదరాబాద్ సీఈగా వరంగల్ క్వాలిటీ కంట్రోల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ దేవేందర్‌రెడ్డికి పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించింది.

సెల్‌ఫోన్ డ్రైవర్‌కు ఇచ్చి.. అనేక ఊళ్లు తిప్పి!

- సిమ్‌కార్డులను మారుస్తూ అజ్ఞాతంలోకి
- ఫ్రీలాంచ్ కేసులో శ్రీనివాసరావు అరెస్టు



హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 18 (నమస్తే తెలంగాణ): ఫ్రీలాంచ్ పేరుతో 31 మందిని మోసగించి రూ.60 కోట్లు కాజేసిన జీఎస్ఆర్ ఇన్‌ఫ్రా ఎండీ గుంటుపల్లి శ్రీనివాసరావును సైబరాబాద్ పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. ఈ అరెస్టుకు ముందు ఆయన పోలీసుల దృష్టి మళ్లించేందుకు సెల్‌ఫోన్‌ను డ్రైవర్‌కు ఇచ్చి, ఏపీలోని పలు ప్రాంతాల్లో తిప్పారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా గాలింపు చేపట్టిన పోలీసులు డ్రైవర్‌ను పట్టుకున్నారు. చివరికి శ్రీనివాస్‌ను అరెస్టు చేసి, గురువారం కోర్టులో హాజరుపర్చారు. శ్రీనివాసరావును పీటీ వారెంట్‌పై హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు కూడా కస్టడీలోకి తీసుకొనే అవకాశాలున్నాయి.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, వి.హెచ్, గుజ్జ సత్యం, గుజ్జ కృష్ణ, తదితరులు

ఆగస్టులో బీసీల పార్లమెంట్ ముట్టడి

- ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య
- వికసిత భారత్ అంటే అంబానీ, అదానీ బాగు కాదు: వీహెచ్

కాచిగూడ, జూలై 18: బీసీల సమస్యల పరిష్కారం కోరుతూ ఆగస్టు 5, 6, 7 తేదీల్లో వేలాది మందితో పార్లమెంట్ ముట్టడిస్తామని ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య వెల్లడించారు. గురువారం హైదరాబాద్ కాచిగూడ అభినందన్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, చైర్మన్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన 13 బీసీ సంఘాలు, 30 కుల సంఘాల నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ జనాభాలో దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, అందుకు పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమం తరహాలో బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. బీసీలకు సామాజిక న్యాయం అందకపోతే కేంద్రంపై మిలిటెంట్ పోరాటం చేస్తామని ప్రకటించారు. మాజీ ఎంపీ వీ హనుమంతరావు మాట్లాడుతూ పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. వికసిత్ భారత్ అంటే అంబానీ, అదానీ కాదని, దేశంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీలైన బహుజనులను బాగు చేయడమని సూచించారు. సమావేశంలో బీసీ నేతలు ఆర్ లక్ష్మణ్‌యాదవ్, నీలా వెంకటేశ్, నందగోపాల్, వీ రామకృష్ణ, జీ మల్లేశ్, ఉదయ్, జయంతి, జ్యోతి, కరుణశ్రీ, శివమ్మ, అంజి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీ ఉద్యోగులకు నిరాశే

జీతాల పెరుగుదల అంతంతే • టాప్ కంపెనీల్లో వృద్ధి శాతం సింగిల్ డిజిట్



సగటున జీతాల పెంపు %	TCS*	Infosys*	HCL*	Wipro**	TechM*
FY24	7-9	9	NA	9.4	5.6
FY23	6-9	9.9	5.1	13.4	6
FY22	10.5	14.6	6.8	10.4	5.2
FY21	6.4	6	4	10	0.3

బెంగళూరు, జూలై 18: సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు గత ఆర్థిక సంవత్సరం (2023-24) నిరాశే మిగిల్చింది. అంతకుముందు రెండు ఆర్థిక సంవత్సరాలు సిబ్బంది జీతాలను రెండంకెల స్థాయి వృద్ధిలో పెంచిన ప్రధాన ఐటీ రంగ సంస్థలు.. గత ఆర్థిక సంవత్సరం మాత్రం సింగిల్ డిజిట్‌కే పరిమితం చేశాయి మరి. దేశంలోని టాప్-5 ఐటీ కంపెనీల్లో మూడింట్లో వ్యయ నియంత్రణ చర్యలు స్పష్టంగా కనిపిస్తుండటం గమనార్హం. అనిశ్చితమైన సవాళ్లను ఎదుర్కొనేందుకు ఆయా సంస్థలకు ఖర్చుల కట్టడి తప్పట్లేదు. ఇందులోభాగంగానే ఉద్యోగులకు వార్షిక వేతనాల పెంపులో కోత పెడుతున్నాయి. దీంతో మెజారిటీ ఐటీ ఉద్యోగులకు ఈ ఏడాది మార్చి ఆఖరుతో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో 5 శాతం నుంచి 9 శాతం మేరకే సాలరీల్లో ఇంక్రిమెంట్లు దక్కాయి.

దిగ్గజ సంస్థల్లో..

దేశీయ ఐటీ రంగ సంస్థల్లో రెండో అతిపెద్ద సంస్థ అయిన ఇన్ఫోసిస్‌లో గత ఆర్థిక సంవత్సరం ఉద్యోగుల జీతాలు సగటున 9 శాతమే పెరిగాయి. ఐటీ రంగ దిగ్గజం టీసీఎస్‌లోనైతే 7-9 శాతమే. విప్రో విషయానికొస్తే.. 2023-24లో 9.4 శాతంగా ఉంటే.. టెక్ మహీంద్రాలో 5.6 శాతమే. కాగా, కరోనా ప్రభావం ఉన్నప్పటికీ 2021-22లో టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో కంపెనీలు తమ ఉద్యోగుల జీతాలకు రెండంకెల స్థాయిలో పెంపు శాతాన్నిచ్చాయి. టెక్ మహీంద్రా 5.2 శాతం, హెచ్‌సీఎల్ 6.8 శాతంతోనే సరిపెట్టాయి.

ప్రతికూలతల వల్లే..

భారీ సంఖ్యలో ఉద్యోగులు, పెరుగుతున్న వ్యాపార ఖర్చులు.. భారతీయ ఐటీ రంగాన్ని దెబ్బతీస్తున్నట్లు రిక్రూట్‌మెంట్ కన్సల్టెన్సీ మిషిల్ పేజ్ ప్రతినిధి ప్రస్తు ఉపాధ్యాయ్ అన్నారు. సంస్థాగత ఆదాయం-లాభాలు తగ్గడంతో దానికి తగ్గట్టుగానే పెరుపు మంత్రం జపిస్తున్నాయన్నారు. ఇక ప్రవేశ స్థాయిలో ప్రతిభ, నైపుణ్యం కలిగిన ఉద్యోగుల లభ్యత లేకపోవడం కూడా సమస్యగా మారిందని చెప్పారు. కాగా, సంక్లిష్టమైన సాంకేతిక నైపుణ్యాలను కలిగిన ఉద్యోగులకు 12 నుంచి 15 శాతం సగటున సాలరీలు పెరుగుతున్నట్లు రాండ్‌స్టాడ్ డిజిటల్ ఇండియా ఎండీ మిలింద్ షా తెలిపారు. ఆయా సంస్థలు డిజిటలైజేషన్ దిశగా అడుగులు వేస్తుండటంతో ప్రతిభావంతులకు సహజంగానే పెద్దపీట దక్కుతున్నదని తెలియజేశారు. వారి అవసరాలు బాగా ఉండటంతోనే జీతాలు అంతలా పెరుగుతున్నాయని గుర్తుచేస్తున్నారు. ఈ క్రమంలోనే వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) ఏఐ, ఎంఎల్, సైబర్‌సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, డాటా అనలిటిక్స్ విభాగాల్లో నిపుణులకు గిరాకీ ఎక్కువగా ఉంటుందని ఆయన అంచనా వేశారు.

ముమ్ముందూ తిప్పలే

దేశ, విదేశాల్లో నెలకొన్న ఆర్థిక మందగమన చాయలు.. భారతీయ ఐటీ కంపెనీలకు ముమ్ముందు మరిన్ని ఇబ్బందులను సృష్టించగలవన్న అభిప్రాయాలు ఇప్పుడు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ముఖ్యంగా అమెరికా, యూరప్ దేశాల్లో ఆర్థిక సంక్షోభ పరిస్థితులు.. దేశీయ ఐటీ కంపెనీల ఆదాయానికి ఇప్పటికే గండి కొడుతున్నాయని వారు గుర్తుచేస్తున్నారు. అందుకే భారీగా ఉద్యోగ కోతలు, అంతంతమాత్రంగా జీతాల పెంపులని ఐటీ రంగ నిపుణులు ప్రస్తుత సరళిని విశ్లేషిస్తున్నారు. అగ్ర దేశాల రక్షణాత్మక ధోరణులు, వివిధ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాలు కూడా ఆర్థిక వ్యవస్థల్ని ప్రభావితం చేస్తున్నాయని పేర్కొంటున్నారు. ఈ పరిస్థితులు మారకపోతే ఐటీయేగాక అన్ని రంగాల మనుగడకు ముప్పేనని హెచ్చరిస్తుండటం గమనార్హం.

రూపాయే..

ముంబై, జూలై 18: దేశీయ కరెన్సీ రికార్డు స్థాయికి పతనమైంది. ఫారెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి డాలర్-రుపీ ఎక్స్ఛేంజ్ రేటు 5 పైసలు కరిగిపోయి 83.63 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు పెరగడంతో డాలర్‌కు అనూహ్యంగా మద్దతు లభించింది. దీంతో ఇతర కరెన్సీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయని ఫారెక్స్ ట్రేడర్ వెల్లడించారు. 83.57 వద్ద ప్రారంభమైన డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ ఇంట్రాడేలో 83.55 గరిష్ఠ స్థాయిని తాకింది. ఒకదశలో 83.66 చారిత్రక కనిష్ఠ స్థాయిని తాకిన విలువ చివరకు నష్టాల ముగింపుతో పోలిస్తే ఐదు పైసలు తరిగిపోయి 83.57 వద్ద స్థిరపడింది.

అరబిందో 750 కోట్ల బైబ్యాక్!

హైదరాబాద్, జూలై 18: ప్రముఖ ఫార్మా సంస్థ అరబిందో ఫార్మారూ.750 కోట్ల విలువైన షేర్లను తిరిగి కొనుగోలు చేయబోతున్నది. ఇందుకుగాను కంపెనీ బోర్డు సమావేశమై గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. షేరును రూ.1,460 చొప్పున 51,36,986 షేర్లను బైబ్యాక్ చేయనుండటంతో 0.88 శాతం వాటా పెరగనున్నది. ప్రస్తుతం సంస్థలో ప్రమోటర్లకు 51.8 శాతం వాటా ఉండగా, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు 16.73 శాతం, మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్టర్లకు 19.17 శాతం వాటా ఉన్నది.

81 వేల పైకి సెన్సెక్స్

మరో మైలురాయిని అధిగమించిన సూచీ

ముంబై, జూలై 18: దేశీయ స్టాక్ మార్కెట్లు మరో మైలురాయిని అధిగమించాయి. రికార్డుల మీద రికార్డులు బద్దలు కొడుతున్న సూచీలు గురువారం మరో ఉన్నత శిఖరానికి చేరుకున్నాయి. ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్, ఎఫ్ఎంసీజీ రంగ షేర్ల నుంచి లభించిన మద్దతుతో 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ తొలిసారిగా 81 వేల మైలురాయిని అధిగమించింది. దేశీయ ఈక్విటీ మార్కెట్ చరిత్రలో ఈ రికార్డును అధిగమించడం ఇదే తొలిసారి కావడం విశేషం. మార్కెట్ ముగిసే సమయానికి సూచీ 626.91 పాయింట్లు అందుకొని 81,343.46 పాయింట్ల వద్ద స్థిరపడింది. బలహీనంగా ప్రారంభమైన సూచీలు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలతో రివ్వున ఎగిశాయి. ఐటీ రంగ సంస్థలు అంచనాలకుమించి రాణిస్తుండటంతో మదుపరులు ఈ షేర్లను కొనుగోలు చేయడానికి ఎగబడటంతో ఇంట్రాడేలో 800 పాయింట్లకు పైగా ఎగబాకింది. చివర్లో ఈ భారీ లాభాలను నిలుపుకోలేకపోయింది. మరో సూచీ నిఫ్టీ ఒక దశలో 220 పాయింట్లకు పైగా బలపడ్డ సూచీ చివర్లో 187.85 పాయింట్లు అందుకొని 24,800.85 వద్ద స్థిరపడింది.

- టీసీఎస్ 3.33 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. ఇన్ఫోసిస్ 1.93 శాతంతోపాటు బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా, టెక్ మహీంద్రా, హెచ్‌యూఎల్, హెచ్‌సీఎల్, ఎన్టీపీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- యెస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కెనరా బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎన్టీపీసీ, అదానీ పోర్ట్స్ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- ఐటీ, టెలికం, ఆటో, టెక్ రంగ షేర్లు లాభపడగా..క్యాపిటల్ గూడ్స్, ఇండస్ట్రియల్స్, యుటిలిటీ రంగ షేర్లు నష్టపోయాయి.
- గత నాలుగు సెషన్లలో సెన్సెక్స్ 1,446 పాయింట్లు(1.79 శాతం), నిఫ్టీ 485 పాయింట్లు(1.98 శాతం) బలపడ్డాయి.
- బ్రెంట్ క్రూడాయిల్ ధర తగ్గడం కూడా సూచీలు పుంజుకునేలా చేసింది.

500 కోట్లతో తోషిబా ప్లాంట్ విస్తరణ

న్యూఢిల్లీ, జూలై 18: జపాన్‌కు చెందిన ఎలక్ట్రిక్ పరికరాల తయారీ సంస్థ తోషిబా గ్రూపు..భారత్‌లో ఉన్న ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచుకోనున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం 10 బిలియన్ జపాన్ యెన్(రూ.500 కోట్లకు పైమాటే)తో తెలంగాణలోని హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న ప్లాంట్ సామర్థ్యాన్ని రెండింతలు పెంచబోతున్నట్లు కంపెనీ ప్రెసిడెంట్, ఎండీ హిరోషి ఫురుటా ఈ సందర్భంగా తెలిపారు. 2023-24 నుంచి 2025-26 మధ్యకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ఈ నిధులను ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. మేక్ ఇన్ ఇండియాతోపాటు ఎక్స్‌పోర్ట్ ఇండియాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ పెట్టుబడులు పెడుతున్నట్లు చెప్పారు. ఇందుకోసం అసెంబ్లింగ్ యూనిట్‌లో లైన్ కెపాసిటీని పెంచుతున్నది. ప్రస్తుతం భారత్‌లో అత్యధిక డిమాండ్ ఉన్న 400కేవీ/765కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను సంస్థ ఉత్పత్తి చేస్తున్నది.



గురువారం బ్రిటిష్ హై కమిషన్, ఈ అండ్ వై ప్రతినిధులతో మంత్రి శ్రీధర్ బాబు

డిసెంబర్‌కల్లా మలబార్ ప్లాంట్ రెడీ

- మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): ప్రముఖ బంగారం, వజ్రాభరణాల తయారీ సంస్థ మలబార్ జ్యువెల్లరీ తెలంగాణ ప్లాంట్.. ఈ ఏడాది చివరికల్లా ఉత్పత్తిలోకి రానున్నది. రూ.750 కోట్ల పెట్టుబడితో మహేశ్వరంలో ఈ నగల తయారీ కేంద్రాన్ని మలబార్ ఏర్పాటు చేస్తున్నది. గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో సంస్థ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. మొదటి దశలో ఇప్పటికే కంపెనీ రూ.183 కోట్ల పెట్టుబడులు పెట్టింది. ఈ క్రమంలోనే గురువారం మలబార్ వర్గాలు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో సచివాలయంలో సమావేశమయ్యారు. ప్లాంట్ నిర్మాణం తదితర వివరాలను తెలియజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మలబార్ సంస్థ మహేశ్వరంలో నెలకొల్పుతున్న యూనిట్ దేశంలోనే అతిపెద్దదని చెప్పారు. డిసెంబర్‌కల్లా సిద్ధమవుతుందన్నారు. ప్రభుత్వ పాలన, పారిశ్రామిక రంగాల్లో కృత్రిమ మేధ(ఏఐ) వినియోగంపై వచ్చే 20 ఏండ్లకు అవసరమైన ఒక రోడ్‌మ్యాప్‌ను రూపొందించాలని మంత్రి శ్రీధర్ బాబు బ్రిటిష్ హై కమిషన్, ఎర్నెస్ట్ అండ్ యంగ్(ఈ అండ్ వై) కంపెనీ ప్రతినిధులకు సూచించారు. ప్రభుత్వం 200 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న ఏఐ సిటీలో బ్రిటిష్ హై కమిషన్, ఈ అండ్ వై సంస్థలు కీలక భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

ఆగస్టు 1 నుంచి బహు భాషా నాటకోత్సవాలు

మూడు రోజులపాటు వేడుకలు

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ) : ఆగస్టు 1 నుంచి 3 వరకు 18వ జాతీయ బహుభాషా నాటకోత్సవాలను హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించనున్నట్టు అభినయ థియేటర్ ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. గురువారం మాసబ్‌ట్యాంక్‌లోని ఎలక్షన్ కమిషన్ కార్యాలయంలో కమిషనర్ పార్థసారథి ఉత్సవాల పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ సాంస్కృతిక శాఖ, అభినయ థియేటర్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో తెలుగు, కన్నడ, నాగ, మణిపూరి, మరాఠీ నాటకాలను ప్రదర్శించనున్నట్టు చెప్పారు. సాయంత్రం 5:30 గంటలకు ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు.

డీఎస్సీ పరీక్షల వాయిదాకు హైకోర్టు నిరాకరణ

కౌంటర్ దాఖలుకు ప్రభుత్వానికి నోటీసులు

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షలను వాయిదా వేసేందుకు హైకోర్టు నిరాకరించింది. పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం అయ్యాయని ఈ పరిస్థితుల్లో పరీక్షలను నిలిపివేస్తూ మధ్యంతర ఆదేశాలను జారీచేయబోమని తేల్చి చెప్పింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని విద్యాశాఖను ఆదేశించింది. అభ్యర్థులు లేవనెత్తిన అభ్యంతరాలపై కౌంటర్ పిటిషన్‌లో వివరణ ఇవ్వాలని న్యాయమూర్తి జస్టిస్ పుల్లా కార్తీక్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. తదుపరి విచారణను ఈనెల 28కి వాయిదా వేశారు. ఈనెల 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు జరగనున్న టీఆర్టీ (డీఎస్సీ) పరీక్షలను వాయిదా వేయాలంటూ వికారాబాద్‌కు చెందిన ఆర్ అశోక్ సహా పది మంది దాఖలుచేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది.

డీఎస్సీ పరీక్షలు ప్రారంభం

తొలిరోజు 83 శాతంమంది హాజరు

పలువురు అభ్యర్థుల గృహనిర్బంధం

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామక పరీక్షలు(డీఎస్సీ) కొందరు అభ్యర్థుల నిర్బంధం మధ్య గురువారం ప్రారంభమయ్యాయి. తొలిసారిగా ఆన్‌లైన్ విధానంలో మొదలైన ఈ పరీక్షలు ఆగస్టు 5 వరకు కొనసాగనున్నాయి. తొలిరోజు 26 వేల మందికి 83 శాతం పరీక్షలకు హాజరైనట్టు అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 56 పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేయగా, ఒక్క గ్రేటర్ హైదరాబాద్‌లోనే 27 కేంద్రాలు ఉన్నాయి. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించారు. తమను గృహ నిర్బంధంలో ఉంచి పరీక్షలకు హాజరు కానివ్వలేదని పలువురు అభ్యర్థులు ఆరోపించారు.

20,21న ఆన్‌లైన్‌లో సింగరేణి పరీక్షలు

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ) : సింగరేణి సంస్థలో 272 ఎక్స్‌టర్నల్ పోస్టుల భర్తీకి హైదరాబాద్ కేంద్రంగా ఈ నెల 20, 21 తేదీల్లో నిర్వహించే పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్టు ఆ సంస్థ డైరెక్టర్ బలరాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 18,665 మంది అభ్యర్థులకు హాల్‌టికెట్లు జారీ చేసినట్టు వెల్లడించారు. తొలిసారిగా కంప్యూటర్ ఆధారిత పరీక్షలు(సీబీటీ) నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇందుకోసం హైదరాబాద్ జంట నగరాల్లోని 12 పరీక్ష సెంటర్లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకునే క్రమంలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే 08744-249992 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మహీంద్రాలో డిజైన్ ఇన్నోవేషన్ కోర్సు

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని మహీంద్రా విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ డిజైన్ ఇన్నోవేషన్ కోర్సును ప్రారంభించినట్టు వీసీ డాక్టర్ యాజులు మేడూరి తెలిపారు. పినిన్ ఫరినా డిజైన్ అకాడమీ, టొరినో, ఇటలీ, ఎపోయ్ ఇన్నోవేషన్ స్టూడియో ఐటీసీ బెంగళూరుతో స్కూల్ ఆఫ్ డిజైన్ ఇన్నోవేషన్ భాగస్వామ్యంతో కోర్సును ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. తొలి అకడమిక్ సెషన్ వచ్చేనెల 15 నుంచి బ్యాచిలర్స్ ప్రోగ్రామ్ ఇన్ డిజైన్‌తో ప్రారంభమవుతుందని వెల్లడించారు. 10+2 విద్యార్థులు ఈ కోర్సుకు అర్హులని తెలిపారు.

'హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్' కీ విడుదల

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ) : హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టుల భర్తీ పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక కీని గురువారం టీజీపీఎస్సీ విడుదల చేసింది. కీ వివరాలను వెబ్‌సైట్‌లో పెట్టింది. ఈ నెల 22 నుంచి కీతో పాటు రెస్పాన్స్ షీట్లు కూడా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపింది. అభ్యంతరాల స్వీకరణకు ఈ నెల 27 వరకు గడువు విధించింది.

గ్రూప్ 2 పరీక్షలు వాయిదా!

- నిరుద్యోగులతో కాంగ్రెస్ ప్రతినిధుల చర్చలు
- 24 గంటల్లో వెబ్‌నోట్ వస్తుందని హామీ
- గ్రూప్ 2, 3 పోస్టుల పెంపుపై స్పష్టత కరువు
- గ్రూప్ 1లో 1:100 నిష్పత్తిపై నిరుద్యోగుల పట్టు
- చర్చలపై నిరుద్యోగ ప్రతినిధుల అసంతృప్తి



హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): టీజీపీఎస్సీ గ్రూప్ 2 పరీక్ష వాయిదా వేసే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తున్నది. ఈ మేరకు గురువారం సుమారు 50 మంది నిరుద్యోగ ప్రతినిధులతో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు జరిపిన చర్చల్లో ఈ విషయం తేటతెల్లమైంది. అయితే ఇతర డిమాండ్లపై ఎలాంటి హామీ రాకపోవడంతో ఈ చర్చలు ఫలించలేదని నిరుద్యోగ ప్రతినిధులే తేల్చి చెప్పారు. దీంతో మళ్లీ నిరుద్యోగ ఉద్యమం రాగానే ఇప్పట్లో చల్లారేలా కనిపించడం లేదు. ఒకవైపు అభ్యర్థుల వినతిని పట్టించుకోకుండా మొండిగా డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కేవలం గ్రూప్ 2 పరీక్షలు వాయిదా వేయడానికే సానుకూలత వ్యక్తంచేసింది. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి, 24 గంటల్లో వెబ్‌నోట్ వచ్చేలా కృషి చేస్తామన్న ప్రభుత్వ ప్రతినిధుల హామీతో నిరుద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నది. నెలరోజుల తమ పోరాటానికు ప్రభుత్వం ఒక మెట్టు దిగినా తమ డిమాండ్ల పరిష్కారానికి మాత్రం పూర్తి భరోసా రాలేదని నిరుద్యోగులు మండిపడుతున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం గ్రూప్ 2, 3లో అసలు పోస్టుల సంఖ్యను పెంచుతారా? లేదా? అన్న అంశంపై స్పష్టత కరువైందని ఆగ్రహంతో ఉన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ ప్రతినిధులు తమతో జరిపిన చర్చలు ఫలప్రదంగా లేవని నిరుద్యోగ ప్రతినిధులు తేల్చిచెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతినిధులుగా ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మానవతారాయ్, చరణ్‌కౌశిక్, బాలలక్ష్మి తదితరులు నిరుద్యోగులతో చర్చలు జరిపారు. నిరుద్యోగుల తరఫున దాదాపు 50 మంది ప్రతినిధులు ఈ చర్చల్లో పాల్గొన్నట్టు సమాచారం.

గ్రూప్ 1 మెయిన్స్‌కు 1:100 సంగతి ఏమైంది?

గ్రూప్-1 మెయిన్స్ కోసం 1:100 నిష్పత్తి అమలు విషయమై నిరుద్యోగ ప్రతినిధులు చర్చల సందర్భంగా నిలదీసినట్టు సమాచారం. దీనిపై సాంకేతిక సమస్యలను సాకుగా చూపి ప్రభుత్వం తప్పించుకోజూస్తున్నదని నిరుద్యోగ ప్రతినిధులు మండిపడుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లో గ్రూప్ 1 కోసం విడుదల చేసిన జీవో 29ను వెనక్కి తీసుకొని, కొత్తగా అమల్లోకి తెచ్చిన షార్ట్‌ఫాల్ విధానం రద్దు చేసి, కమ్యూనిటీ పోస్టుల వారీగా అభ్యర్థులను మెయిన్స్‌కు ఎంపిక చేసే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

డిమాండ్ల సాధన కోసం ఉద్యమాలే దిక్కు

ఉద్యోగార్థుల డిమాండ్ల పరిష్కారం కోసం ఉద్యమాలే దిక్కని నిరుద్యోగ నేతలు పిలుపునిచ్చారు. కేవలం మొక్కుబడిగానే ప్రభుత్వం చర్చలు జరిపిందని, తమ డిమాండ్లను నెరవేరుస్తామని స్పష్టమైన హామీని ఇవ్వలేకపోయిందని నిరుద్యోగులు మండిపడుతున్నారు. గ్రూప్ 1, జీవో 29 రద్దు, గ్రూప్ 2, 3లో అదనపు పోస్టుల పెంపు, గురుకుల పోస్టుల్లో రిలింక్విష్‌మెంట్ అమలు, నిరుద్యోగ భృతి, జీవో 46 రద్దు, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్ విడుదల వంటి డిమాండ్లను పరిష్కరించేంత వరకు ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ స్పష్టం చేసింది.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న అద్దూర్ ఎమ్మెల్సీ పైడి రాకేశ్‌రెడ్డి

నిరుద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలి

రౌండ్‌టేబుల్ మీటింగ్‌లో ఎమ్మెల్సీ రాకేశ్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 18: రాష్ట్రంలోని నిరుద్యోగ యువత కోరుతున్న న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని అద్దూర్ ఎమ్మెల్సీ పైడి రాకేశ్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఓయూ జేఏసీ, టీఎస్‌జేఏసీ, నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం జరిగిన నిరుద్యోగ, విద్యార్థి రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని యువత, నిరుద్యోగులు, విద్యార్థుల వల్లే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, వారి ఆకాంక్షలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉన్నదని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పోరాటం చేసింది విద్యార్థులేనని గుర్తుచేశారు. ఆనాడు ఏ ఒక్క నాయకుడి కుటుంబసభ్యులు చనిపోలేదని, కేవలం విద్యార్థులే ఆత్మబలిదానం చేసుకున్నారని పేర్కొన్నారు. గ్రూప్ 2, గ్రూప్ 3 నోటిఫికేషన్లలో పోస్టుల సంఖ్యను పెంచి డిసెంబర్‌లో పరీక్షలను నిర్వహించాలని కోరారు. గ్రూప్ 1లో 1:100 నిష్పత్తితో మెయిన్స్‌కు ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. 25 వేల ఉద్యోగాలతో తక్షణమే మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంతో పాటు నిరుద్యోగ భృతిని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రవాణాశాఖలో కొత్తగా 110 మంది ఎంవీఐలు

- ఎంవీఐల శిక్షణ కాలం పెంపు
- ఆదాయం పెంచడమే లక్ష్యంగా చర్యలు

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ) : రవాణాశాఖకు కొత్తగా 110 మంది మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు (ఎంవీఐలు) రాబోతున్నారు. గతంలో ఎంవీఐలకు మూడు నెలల శిక్షణ ఉండేది. కొత్తవారికి ఈ వ్యవధిని పెంచడంతో పాటు విస్తృత శిక్షణ ఇవ్వనున్నారు. ఐదేండ్ల ఇతర రాష్ట్రాల్లోని విధానాలపై అధ్యయనం చేసిన అధికారులు నివేదికను రవాణాశాఖకు అందించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.8,478 కోట్ల భారీ రాబడి లక్ష్యాన్ని నిర్దేశించింది. 2024-25లో లైఫ్‌ట్యాక్స్ రూ.6,024.97 కోట్లు, త్రైమాసిక పన్ను, గ్రీన్ ట్యాక్స్ రూ.75.68 కోట్లు, ఫీజులు 648.10 కోట్లు, ట్రాఫిక్ చలాన్ల రూపంలో రూ.300 కోట్లు, బకాయిల వసూలు రూ.186.03 కోట్లు, యూజర్ చార్జీలు రూ.159.65 కోట్లు ఆర్జించాలని ఆర్థిక శాఖ నిర్ధారించింది. రవాణాశాఖకు రాబడి సమకూర్చే అంశాల్లో లైఫ్ ట్యాక్స్ ఒకటి. 2022-23లో రూ.5,345 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశిస్తే రూ.6,390.80 కోట్ల ఆదాయం వచ్చింది. 2023-24లో రూ.7,212.60 కోట్లకు రూ.6,990.29 కోట్లు వచ్చింది.

ఎగదోశారు.. నట్టేట్లో వదిలేశారు!

- పదవులు దక్కగానే పెదవులు మూశారు
- కాంగ్రెస్ నేతల తీరుపై గురుకుల అభ్యర్థుల గుర్రు
- రిలింక్విష్‌మెంట్‌పై తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధం
- పోస్టులను బ్యాక్‌లాగ్ చేసే కుట్రని ఆగ్రహం

తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధం..

ఇప్పటికే ఆయా సొసైటీలు పోస్టింగ్స్ ఇచ్చే ప్రక్రియను ప్రారంభించాయని, రిలింక్విష్‌మెంట్ అమలు చేయకుండా పోస్టింగ్స్ ఇచ్చిన తరువాత చేసేదేమీ లేదని అభ్యర్థులు చెప్తున్నారు. పలువురు మంత్రులను, కాంగ్రెస్ సీనియర్ నేతలను, ఆఖరికి సీఎం రేవంత్‌రెడ్డి, సీఎంవో అధికారులను మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిలింక్విష్‌మెంట్ అమలు కోసం ఆమరణ దీక్షకు పూనుకుంటామని అభ్యర్థులు వెల్లడిస్తున్నారు. అందుకు సంబంధించిన కార్యాచరణ రూపొందించుకొంటున్నామని, ఇక ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామని గురుకుల అభ్యర్థులు తెలిపారు.

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): "ఎన్నికలకు ముందు ఓట్ల కోసం ఎగదోశారు. కాంగ్రెస్ తరఫున ప్రచారం కోసం ఊరూరా తిప్పారు. ఓట్లను వేయించుకున్నారు. పదవులను పొందారు. మమ్మల్ని నట్టేట్లో వదిలేసి పెదవులు మూసుకున్నారు" అంటూ పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలపై గురుకుల అభ్యర్థులు నిప్పులు చెరుగుతున్నారు. న్యాయం చేయాలని 4 నెలలుగా తిరుగుతున్నా ఆ దిశగా స్పష్టమైన హామీ ఇవ్వడం లేదని మండిపడుతున్నారు. పోస్టుల భర్తీలో డిసెండింగ్ ఆర్డర్‌ను పాటించకుండా అన్యాయం చేస్తున్నారని, బ్యాక్‌లాగ్ పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదని ధ్వజమెత్తుతున్నారు. ఇకనైనా స్పష్టత ఇవ్వాలని, లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

డిసెండింగ్ జాబితాపై స్పష్టత కరువు

గురుకులాల్లో 9,210పోస్టులను డిసెండింగ్ ఆర్డర్‌లో భర్తీ చేస్తామని, ఒక్క పోస్ట్ కూడా బ్యాక్‌లాగ్ లేకుండా చూస్తామని ట్రిబ్ నోటిఫికేషన్ ఇచ్చింది. రాత పరీక్షల వరకు అనేకసార్లు బాహాటంగానే చెప్తూ వచ్చింది. అయితే తుదకు ఎన్నికల అనంతరం మాత్రం అందుకు విరుద్ధంగా డిసెండింగ్ ఆర్డర్



హామీని తుంగలో తొక్కి పోస్టుల భర్తీని చేపట్టింది. తొలుత డీఎల్, ఆ తరువాత టీజీటీ, జేఎల్, టీజీటీ పోస్టులకు మెరిట్ జాబితాలను ప్రకటించి అభ్యర్థులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చింది. దీంతో వేలాది పోస్టులు బ్యాక్‌లాగ్ పడే అవకాశం ఉన్నదని అభ్యర్థులు వాపోతున్నారు. కేవలం రిలింక్విష్‌మెంట్ విధానాన్ని అమలు చేయాలని, తద్వారా పోస్టులు బ్యాక్‌లాగ్ పడకుండా ఉంటాయని పేర్కొంటున్నారు. గత ఫిబ్రవరి నుంచి ట్రిబ్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ప్రధానంగా ఆ నలుగురి నేతలపైనే..

నాడు ధర్నాలు చేయించిన నేతలే నేడు తమను చులకనగా చూస్తున్నారని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ యువనాయకుడితోపాటు ఎమ్మెల్సీ పదవి దక్కించుకున్న ఓ నేత ఇప్పుడు తమ సమస్యను పరిష్కరించడం లేదని వాపోతున్నారు. ఎప్పుడు అడిగినా నేడు రేపు అంటూ దాటవేస్తున్నారే తప్ప ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఇప్పించడంలేదని మండిపడుతున్నారు. ఇదేమని అడిగితే ఉన్నత పదవి దక్కించుకున్న మరో కాంగ్రెస్ నేత తమనే దుర్భాషలాడుతున్నారని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై ఇటీవల దర్శించేలా చూస్తానని సదరు యువనేత ఇచ్చిన హామీ సైతం ఉత్తముచ్చటే అయ్యిందని అభ్యర్థులు పేర్కొంటున్నారు.

'దాశరథి' పురస్కారానికి అందెశ్రీ ఎంపిక

తెలుగు యూనివర్సిటీ, జూలై 18: శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం ప్రదానం చేస్తున్న మహాకవి దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కారం- 2024కు ప్రజావాగ్గేయకారుడు అందెశ్రీని ఎంపిక చేసినట్టు భాషానిలయం గౌరవ కార్యదర్శి టి ఉదయవర్లు గురువారం తెలిపారు. 23న సుల్తాన్‌బజార్ భాషానిలయం ఆడిటోరియంలో అందెశ్రీని రూ. 10 వేలు, జ్ఞాపికతో సత్కరిస్తామన్నారు.

యార్లగడ్డకు సినారె పురస్కారం

రసమయి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి నారాయణరెడ్డి 93వ జయంతి ఈనెల 22న తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్టు సంస్థ అధ్యక్షుడు రాము గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సినారె పురస్కారాన్ని ఏపీ అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షుడు, పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు ప్రదానం చేయనున్నట్టు ఆయన వెల్లడించారు.

రెగ్యులరైన అధ్యాపకులకు బదిలీల్లో అన్యాయం

సూర్యాపేట, జూలై 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర వ్యాప్తంగా 11 ఏండ్లుగా జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసి రెగ్యులరైన 3,750 మంది అధ్యాపకులకు ప్రస్తుత బదిలీల్లో తీరని అన్యాయం జరుగుతున్నది. వారంతా 11 ఏండ్లుగా ఒకే చోట పని చేస్తున్నా ఉన్నత విద్యాశాఖ వారికి బదిలీల్లో అవకాశం కల్పించడంలేదు. 2013లో ఐదేండ్ల సర్వీసు పూర్తి చేసుకున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను బదిలీ చేసిన ఉన్నత విద్యాశాఖ.. రెగ్యులర్ అయ్యాక బదిలీ చేయకపోవడంపై వారిలో ఆవమానం నెలకొన్నది. ఈ విషయమై ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి నేతృత్వంలో తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్-475 ఆధ్వర్యంలో ఉన్నత విద్యాశాఖ అధికారులను కలిసి వినతిపత్రాలు అందించినా స్పందన లేదు. బదిలీలపై నిషేధం ఎత్తేస్తూ ప్రభుత్వం జీవో 80 జారీ చేయగా.. దీని ప్రకారం కనీసం రెండు సంవత్సరాల సర్వీసు నిబంధన అమలు చేయాలి. జీవోలో స్పౌజ్, మెడికల్ క్యాటగిరీ ఉద్యోగులకు రెండు సంవత్సరాల నిబంధన వర్తించదని పేర్కొంది. ఈ లెక్కన కాంట్రాక్ట్ బేస్ నుంచి ఏడాది క్రితం రెగ్యులర్ అయిన స్పౌజ్, మెడికల్ గ్రౌండ్‌లో ఉన్న ఉద్యోగులంతా బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చు. జీవో 80కి అనుబంధంగా ఉన్నత విద్యాశాఖ మరో జీవో 118ను తీసుకొచ్చింది. ఈ జీవోలో స్పౌజ్, మెడికల్ క్యాటగిరీ ఉద్యోగులకు అవకాశం కల్పించకపోవడంతో వెయ్యి మంది అధ్యాపకులు బదిలీ అవకాశం కోల్పోతున్నారు. మళ్లీ బదిలీల ప్రక్రియ ఎప్పుడు ఉంటుందో తెలియదని పేర్కొంటున్నారు. 11 ఏండ్లుగా ఒకే చోట కాంట్రాక్ట్ బేస్డ్‌గా పనిచేస్తూ ఏడాది క్రితం రెగ్యులర్ అయిన అధ్యాపకుల పట్ల ఉన్నత విద్యాశాఖ మానవీయ కోణంలో ఆలోచించి బదిలీలకు అవకాశం కల్పించాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్-475 రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సురేశ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. ప్రభుత్వం ఇచ్చిన జీవో 80 ప్రకారమైనా కుటుంబాలకు దూరంగా ఉంటున్న స్పౌజ్, మెడికల్ క్యాటగిరీ ఉద్యోగులు బదిలీకి దరఖాస్తు చేసుకొనే అవకాశం కల్పించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు 317 జీవో క్యాబినెట్ సబ్ కమిటీ భేటీ

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ) : జీవో 317, జీవో 46పై ప్రభుత్వం నియమించిన క్యాబినెట్ సబ్ కమిటీ శుక్రవారం భేటీ కానున్నది. మంత్రులు దామోదర, శ్రీధర్ బాబు, పొన్నం హాజరుకానున్నారు. గత సమావేశంలోనే స్పౌజ్, మెడికల్, మ్యూచువల్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల భార్య/భర్త చేసుకున్న దరఖాస్తులపై కమిటీ సానుకూల నిర్ణయం తీసుకున్నది. ఈ నివేదికను కమిటీ పరిశీలించే అవకాశం ఉన్నది. దీంతోపాటు 2008 డీఎస్సీ బాధితులకు ఉద్యోగాల అంశంలో విధివిధానాలపైనా సబ్ కమిటీ చర్చించే అవకాశం ఉన్నది.

రుణమాఫీ బిజీలో బదిలీలు లేనట్టేనా?

హైదరాబాద్, జూలై 18(నమస్తే తెలంగాణ): వ్యవసాయ శాఖలో ఉద్యోగుల బదిలీలపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఒక్క రోజే గడువు ఉండటం, ఇప్పటివరకు సీనియార్టీ జాబితా రూపొందించకపోవడంతో సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. వ్యవసాయాధికారులతో పాటు క్షేత్రస్థాయి అధికారులు రుణమాఫీ కార్యక్రమంలో తలమునకలై ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అధికారులకు కనీసం అప్లయ్ ఇచ్చుకునే అవకాశమూ లేకపోయింది. ఉన్నతాధికారులు బదిలీల జాబితాను సిద్ధం చేయడంపై దృష్టి పెట్టలేదు. ఈ నేపథ్యంలో ఈ షెడ్యూల్‌లో వ్యవసాయ శాఖ ఉద్యోగుల బదిలీలు సాధ్యం కాకపోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకోసం గడువు కోరే ఆలోచనను చేస్తున్నట్టూ తెలిసింది.

గాంధీ, ఉస్మానియా సూపరింటెండెంట్ల బదిలీ

- వైద్యశాఖలో బదిలీలు ప్రారంభం
- నిబంధనలు పాటించలేదని ఆరోపణ



హైదరాబాద్/సిటీబ్యూరో, జూలై 18 (నమస్తే తెలంగాణ): గాంధీ, ఉస్మానియా దవాఖానలను సుదీర్ఘకాలంగా నడుపుతున్న సూపరింటెండెంట్లను ప్రభుత్వం బదిలీ చేసింది. వైద్యశాఖలో ఉద్యోగుల బదిలీకి శుక్రవారం కౌన్సెలింగ్ ప్రారంభం అయ్యింది. గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావును యాదాద్రి భువనగిరి జిల్లా దవాఖాన సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో నల్లగొండ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజకుమారిని నియమించారు. ఉస్మానియా సూపరింటెండెంట్ నాగేందర్ మహేశ్వరం టీచింగ్ హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. వీరితోపాటు ఇద్దరు మాజీ డీఎంఈలు బదిలీ అయ్యారు. డీఎంఈ రమేశ్‌రెడ్డిని యాదాద్రి భువనగిరి జిల్లా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా, త్రివేణిని మహేశ్వరం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. నిజామాబాద్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఇందిరను గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా, కాకతీయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ మోహన్‌దాస్‌ను నర్సంపేట మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. టీవీవీపీ, డీహెచ్‌లో పనిచేస్తున్న స్టాఫ్‌నర్సుల ట్రాన్స్‌ఫర్ల కౌన్సెలింగ్ కొనసాగుతున్నది. 20 నాటికి కౌన్సెలింగ్ ముగిస్తామని అధికారులు తెలిపారు. రాష్ట్రంలోనే కీలకమైన గాంధీ, ఉస్మానియా సూపరింటెండెంట్లను ఒకేసారి బదిలీ చేయడంపై వైద్య వర్గాల్లోనే అసంతృప్తి వ్యక్తం అవుతున్నది. కొవిడ్ సమయంలో రెండు దవాఖానలు కీలకంగా పనిచేశాయని చెప్తున్నారు. కొవిడ్ నోడల్ సెంటర్‌గా గాంధీ దవాఖానను డాక్టర్ రాజారావు నడిపించిన తీరు దేశానికే ఆదర్శంగా నిలిచిందని గుర్తు చేస్తున్నారు. అలాంటి వ్యక్తిని మరికొంత కాలం కొనసాగించాల్సిందని అభిప్రాయపడుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా?

ప్రస్తుత బదిలీల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు మొదలయ్యాయి. తనకు స్పౌజ్ కేసు కింద రక్షణ ఉన్నా.. పక్క జిల్లాకు బదిలీ చేశారని వనలక్ష్మి అనే స్టాఫ్ నర్సు వాపోయారు. నాగర్‌కర్నూల్ జిల్లా తెల్కపల్లి పీహెచ్‌సీలో పనిచేస్తున్నానని, తన భర్త శ్రీనివాసులు తెల్కపల్లి మండలంలోనే హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నట్టు చెప్పారు. తాను స్పౌజ్ సర్వీస్ సర్టిఫికెట్ సమర్పించినా మహబూబ్‌నగర్ జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీకి బదిలీ చేశారని వాపోయారు. ప్రస్తుతం వైద్యారోగ్య శాఖ పరిధిలో టీజీజీడీఏ మాత్రమే గుర్తింపు పొందిన సంఘంగా ఉన్నది. నిబంధనల ప్రకారం గుర్తింపు పొందిన సంఘాల్లోని సభ్యులకు బదిలీ నుంచి మినహాయింపు ఉన్నది. టీజీజీడీఏకు 2014లో ఎన్నికలు జరిగాయని, ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు నిరుడు తీర్పు నిచ్చింది. ఈ ప్రక్రియ పర్యవేక్షణ బాధ్యతలను ఇద్దరు న్యాయవాదులకు అప్పగించింది. ఈ మేరకు టీజీజీడీఏలో 17జిల్లా కమిటీలు (మెడికల్ కాలేజీ కేంద్రంగా) ఏర్పడ్డాయి. కానీ కేంద్ర సంఘం ఎన్నికలు పూర్తి కాలేదు. జిల్లా కమిటీల సభ్యులకు మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నారు.. సంఘానికి ఎన్నికలు పూర్తి కాలేదు కాబట్టి ఇంకా కోర్టు పరిధిలోనే ఉన్నట్టు కొందరు చెప్తున్నారు. కేంద్ర సంఘం ఎన్నికలు పూర్తయిన తర్వాతే కోర్టు పరిధి నుంచి బయటికి వచ్చినట్టు అవుతుందన్నారు. కాబట్టే మినహాయింపు సిఫారసులు పట్టించుకోవట్లేదని కోరుతున్నారు. సంఘాల పేరుతో దశాబ్దాలుగా పాతుకుపోయి, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, వారిని బదిలీ చేయాలని కోరుతున్నారు. ఇటీవల డీఎంఈ కార్యాలయంలోనే నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన డాక్టర్ శేఖర్‌పై మెడికల్ జేఏసీ నేతలు దాడి చేసిన సంగతిని గుర్తు చేస్తున్నారు. వైద్యారోగ్య శాఖ మంత్రి స్పందించి సరైన నిర్ణయం తీసుకోవాలని, బదిలీలను పారదర్శకంగా జరిగేలా చూడాలని కోరుతున్నారు.

ఖాళీల భర్తీ ఎలా?

- సరోజినీ దేవి కంటి దవాఖానలో రెండు ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉండగా తాజా బదిలీల్లో నలుగురు ప్రొఫెసర్లను బదిలీ చేశారు. రెటీనల్ సర్జన్‌ను ఒకే ప్రొఫెసర్ ఉండగా ఆప్పుడు బదిలీపై వెళ్లారు. పీడియాట్రిక్, ఆప్తమాలజీ ప్రొఫెసర్ ఒక్కరే ఉండగాఇప్పుడు సరోజినీ కంటి ఆసుపత్రిని విడిచి వెళ్లారు.
- గాంధీలో జనరల్ మెడిసిన్ విభాగంలో 6 మంది ప్రొఫెసర్లను గాను ఐదుగురిని జిల్లాలకు పంపించారు. జనరల్ సర్జరీ విభాగంలో 5 మందిని బదిలీ చేశారు. రేడియాలజీలో ఇద్దరు ప్రొఫెసర్లు బదిలీపై వెళ్లారు. కార్డియాలజీ, నెఫ్రాలజీ సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో సీనియర్ల కొరత కనిపిస్తోందని చెప్తున్నారు.
- ఫీవర్ హాస్పిటల్‌లో ఉన్న ముగ్గురు ప్రొఫెసర్లను బదిలీ చేశారు. అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేరని సీజనల్ వ్యాధుల కాలంలో ప్రొఫెసర్లు లేక ఎలా సేవలు అందించగలుగుతారని ప్రశ్నిస్తున్నారు. బదిలీలతోపాటు దవాఖానాల్లో ఖాళీ అయ్యే పోస్టుల భర్తీ పైన దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

ప్రమోషన్లలో పారదర్శకత లోపం

ఉపాధ్యాయులకు నష్టం జరిగితే ఊరుకోం ▪ టీజీ యూటీఎఫ్ మైనార్టీ విభాగం హెచ్చరిక

హైదరాబాద్, జూలై18 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యాలయాల సొసైటీలో(టీజీఎంఆర్ఈఐఎస్)లో చేపట్టిన ఉపాధ్యాయులు, సిబ్బంది బదిలీలు, పదోన్నతుల్లో పారదర్శకత లోపించిందని టీజీ యూటీఎఫ్ మైనార్టీ విభాగం మండిపడింది. ప్రమోషన్లు, బదిలీల్లో ఏ ఒక్క ఉపాధ్యాయుడికి నష్టం జరిగినా ఊరుకోబోమని టీజీయూటీఎఫ్ అధ్యక్షుడు రాంబాబు, ప్రధాన కార్యదర్శి మహేశ్ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మైనార్టీ గురుకులాల్లో చేపట్టిన ప్రమోషన్లు, బదిలీలు గందరగోళంగా మారాయన్నారు. ఇటీవల విడుదల చేసిన జాబితా తప్పులతడకగా ఉందని, పదోన్నతులకు సంబంధించి తుది అర్హుల జాబితా ప్రకటించకపోవడమేంటని ప్రశ్నించారు. జేఎల్ క్యాడర్‌కు పదోన్నతులు, బదిలీలు చేపట్టి ఆ తర్వాత పీజీటీలకు జేఎల్‌గా పదోన్నతులు కల్పించాలని, మిగిలిన పీజీటీలకు బదిలీలు, టీజీటీలకు పీజీటీగా పదోన్నతి కల్పించి ఆ తర్వాత టీజీటీలకు బదిలీలు చేపట్టాల్సి ఉందని పేర్కొన్నారు. పద్ధతి లేకుండా సొసైటీ ఉన్నతాధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా సొసైటీ ఉన్నతాధికారులు బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను సవరించాలని, జాబితాలో తప్పిదాలను గుర్తించి ఆ తరువాతే ప్రక్రియను చేపట్టాలని డిమాండ్ చేశారు.

అర్థగణాంక శాఖలో బది'లీలలు'!

- నిబంధనలు అమలు కావడం లేదని విమర్శిస్తున్న ఉద్యోగులు
- 'తప్పనిసరి బదిలీ' జాబితాలో ఉన్నా రిటెయిన్ చేశారని ఆరోపణ

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా అన్ని విభాగాల్లో ఉద్యోగుల బదిలీలు జరుగుతున్నా తమకు మాత్రం అన్యాయం జరుగుతున్నదని అర్థగణాంక శాఖ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. బదిలీలకు సంబంధించి ఈ నెల 8న ప్రభుత్వ జీవో ప్రకారం.. ఏ ఉద్యోగి అయినా నాలుగేండ్లకు మించి ఒకే చోట పనిచేయరాదన్న నిబంధన ఉన్నదని గుర్తు చేస్తున్నారు. నిబంధనను తుంగలో తొక్కి బదిలీల్లో తమ పేరు లేకుండా 'మేనేజ్' చేశారని చెప్పుకుంటున్నారు.

- 40 శాతం మంది ఉద్యోగులు తప్పనిసరిగా బదిలీ కావాలన్న నిబంధన ప్రకారం.. గతంలో ఒక జాబితాను విడుదల చేసినప్పటికీ అందులోని పలువురు ఉద్యోగులను హెల్త్ సర్టిఫికెట్ల పేరుతో రిటెయిన్ చేసినట్టు చెప్తారు. వారిలో చాలా మంది నకిలీ సర్టిఫికెట్లు సమర్పించినట్టు ఆరోపిస్తున్నారు.
- మరికొందరు గుర్తింపు పొందిన సంఘం ఆఫీస్ బేరర్లుగా సర్టిఫికెట్ తెచ్చుకుంటున్నారని, హైదరాబాద్‌లోని డైరెక్టరేట్‌తోపాటు జిల్లాల్లో విచ్చలవిడిగా ఆఫీస్ బేరర్ల సర్టిఫికెట్లు మంజూరవుతున్నాయని చెప్తున్నారు.
- తప్పనిసరి బదిలీల జాబితాలో ఉన్న కొందరు ఉద్యోగులు ఆ జాబితాలో లేనివారికి పోస్టు చేసి, అప్లయ్ పెట్టుకోవడంటూ 'మేనేజ్' చేశారని, తద్వారా వారు ఖాళీ అయ్యే స్థానంలోకి ఎవరూ రావడం లేదన్న వంకతో రిటెయిన్ చేయించుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అర్థగణాంక శాఖలో బదిలీలన్నీ గందరగోళంగా తయారయ్యాయని, ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు చొరవ తీసుకొని తమకు న్యాయం చేయాలని పలువురు ఉద్యోగులు తమ శాఖ ముఖ్య కార్యదర్శికి విన్నవించినట్టు సమాచారం.

హైదరాబాద్ విడిచివెళ్లం!

- వైద్యశాఖలో సీనియర్ల పైరవీలు
- యూజీ, పీజీ సీట్లు పోతాయని దబాయింపు

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): దీర్ఘకాలంగా హైదరాబాద్‌లో తిష్టవేసిన ప్రభుత్వ వైద్యులు జిల్లాలకు వెళ్లకుండా ఉండేందుకు మార్గాలు వెతుకుతున్నారు. తాము వెళ్లిపోతే మెడికల్ కళాశాలలకే నష్టమంటూ బెదిరింపులకు దిగుతున్నట్టు తెలిసింది. 'లాంగ్ స్టాండింగ్ పేరుతో మమ్మల్ని ఇక్కడి నుంచి పంపిస్తే.. కొత్తగా ఎవరూ రాకపోతే ఎంబీబీఎస్, పీజీ సీట్లు తగ్గిపోతాయి. ఎక్కడో మారుమూల జిల్లాలో మెడికల్ కాలేజీ అనుమతి కోసం హైదరాబాద్‌లో సీట్లను తగ్గించుకుంటారా' అంటూ ఉన్నతాధికారులనే దబాయిస్తున్నట్టు తెలిసింది.

నర్సులూ పాతుకుపోయారు

గాంధీ, ఉస్మానియా, నిలోఫర్, చెస్ట్ హాస్పిటల్, సరోజినిదేవి, ఎర్రగడ్డ మానసిక వైద్యశాలల్లో 20 నుంచి 30 ఏండ్లుగా తిష్టవేసినవారు దండిగానే ఉన్నారని తెలుస్తున్నది. సీనియారిటీ జాబితా ప్రకారం నాగర్‌కర్నూల్‌లో పనిచేస్తున్న ఓ హెడ్ నర్సు ఏకంగా 38 ఏండ్లుగా అక్కడే ఉంటున్నారు. హుజూర్‌నగర్, మిర్యాలగూడలో 30 ఏండ్లకు పైబడి పనిచేస్తున్నవారూ ఉన్నారు. ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, మెదక్, సిరిసిల్ల, సిద్దిపేట, కొత్తగూడెం జిల్లాల్లో పదుల మంది నర్సులు పాతుకుపోయారు.

120 ఏండ్ల సర్వీస్ ఉన్నదట!

నర్సింగ్ విభాగంలోని సీనియారిటీ జాబితాలో తప్పులు దొర్లాయంటూ పలువురు అందోళన వ్యక్తం చేస్తున్నారు. నర్సింగ్ ఆఫీసర్ ఒకే స్టేషన్‌లో 120 ఏండ్లకు పైగా ఉంటున్నట్టు, మరొకరు 110 ఏండ్లుగా ఉంటున్నట్టు కనిపించడంతో అవాక్కయ్యారు. బదిలీలను ఆపేందుకు సిఫారసు లేఖలతో డీహెచ్, డీఎంఈ, టీవీవీపీల చుట్టూ తిరుగుతున్నట్టు చెప్పుకుంటున్నారు.

• సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన



ఆరు నెలలుగా కరెంట్ సరిగ్గా ఉండటం లేదంటూ నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం జకినాలపల్లి సబ్‌స్టేషన్ ఎదుట ఊర్కొండపేట గ్రామస్థులు, రైతులు ఊర్కొండపేట మాజీ సర్పంచ్ కృష్ణాగౌడ్ ఆధ్వర్యంలో గురువారం సబ్‌స్టేషన్ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కారు ఏర్పడినప్పటి నుంచి గ్రామంలో కరెంట్ ఎప్పుడు పోతుందో.. ఎప్పుడు వస్తుందో తెలియడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. చిన్నపాటి వర్షం కురిసినా కరెంట్ కోతలు విధిస్తున్నారని విమర్శించారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న ఏఈ రమణ, ఎస్సై వీర బాబు అక్కడికి చేరుకొని గ్రామస్థులతో మాట్లాడారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. -ఊర్కొండ

• రెండో ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి



నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద 17 ఏండ్లుగా పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం కోఠిలోని కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట రెండో ఏఎన్ఎంలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీ యూసీ రాష్ట్ర ఉపకార్యదర్శి నరసింహ మాట్లాడుతూ.. శాశ్వత ఉద్యోగాల కోసం గతేడాది ఆగస్టులో సమ్మె నిర్వహించినప్పుడు కాంగ్రెస్ నాయ కులు వచ్చి, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కచ్చితంగా రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. రెండో ఏఎన్ఎంల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బోస్ రామాంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిని శ్యామల, సహాయ కార్యదర్శులు పద్మ, జయమ్మ, ఉపాధ్యక్షురాలు పారతి, రాజేశ్వరి, గుణవతి, తమ్మిశెట్టి జయమ్మ, యాదాలక్ష్మి, సాయం సరోజ పాల్గొన్నారు. -హైదరాబాద్, (నమస్తే తెలంగాణ)

• ఏటూరునాగారం ఐటీడీఏ వద్ద గిరిజనుల ధర్నా



ములుగు జిల్లా వాజేడు మండలం సర్వే నంబర్ 11లోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న వారికి హక్కు పత్రాలు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ ఏటూరునాగారం ఐటీడీఏ వద్ద గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ మిడియం బాబూరావు మాట్లాడుతూ నిరుపేదలు గుడిసెలు వేసుకుని ఎనిమిది నెలలు కావస్తుందని, వారికి వెంటనే హక్కు పత్రాలు ఇవ్వడంతోపాటు తాగునీటి వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. -ఏటూరునాగారం

ఎమ్మెల్యేల ఇండ్లను ముట్టడించిన ‘ఆశ’లు

కొల్లాపూర్‌లో మంత్రి జూపల్లి ఇల్లు కూడా.. • హామీలు నెరవేర్చాలని డిమాండ్

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జూలై 18 : అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఎన్నో హామీలు ఇచ్చి.. అధికారంలోకి రాగానే విస్మ రించిందని ఆశ కార్యకర్తలు ధ్వజమెత్తుతున్నారు. ఈ మేరకు గురువారం వారు మంత్రులు, ఎమ్మెల్యేల ఇండ్లను ముట్టడించారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఇంటిని ముట్ట డించి పెద్దపెట్టున నినాదాలు చేశారు. నిజామా బాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి క్యాంపు కార్యాలయం ఎదుట బైఠాయించారు. అనం తరం ఎమ్మెల్యేకు డిమాండ్లతో కూడిన వినతిప త్రాన్ని సమర్పించారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి క్యాంపు కార్యాలయం ఎదుట ఆశ కార్యకర్తలు నిరసన తెలిపారు. మంచిర్యాల, చెన్నూరు ఎమ్మెల్యేల ఇండ్ల ముందు ఆశ కార్యక ర్తలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆశ కార్యకర్తలు మాట్లాడుతూ.. తమకు ఫిక్స్‌డ్ వేతనంతోపాటు ప్రమాద బీమా, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం వెంటనే జేఏసీ అధికారితో కమిటీ వేయాలని కోరారు.

ఆశ కార్యకర్తల జీతాలు పెంచాలి: ఎమ్మెల్యే మల్లారెడ్డి

గ్రేటర్ హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లిలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి క్యాంపు కార్యాలయం వద్ద ఆశ కార్యకర్తలు బైఠాయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి వారితో మాట్లాడుతూ.. మాతా శిశు సంరక్షణలో ఆశ కార్యకర్తలు నిరం తరం కృషి చేస్తున్నారని కొనియాడారు. మాతృత్వ శిశు మరణాల రేటు గణనీయంగా తగ్గిపోవడానికి ఆశ వర్కర్ల సేవలు అమోఘ మని అన్నారు. ప్రస్తుతం ఇస్తున్న జీతాలు సరి పోవడంలేదని, వారి జీతాన్ని కనీసం రూ.18 వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఆశ వర్కర్ల జీతాలతోపాటు వారి సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకోవాల్సిన అంశాలను ప్రస్తా వి స్తారని తెలిపారు. ఆశలకు పెరుగుతున్న పనిభారం తగ్గించాలని, ఏడాదిలో 20 రోజుల జీతంతో కూడిన సెలవులు ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించారు. వీరికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌక ర్యాలు కల్పించాలని, శ్రమ దోపిడీ చేయవద్దని ప్రభుత్వాన్ని కోరారు.



నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఎదుట తమ గోడు వెళ్లబోసుకుంటున్న ఆశ కార్యకర్తలు

• జీతాల కోసం ఎత్తిపోతల పథకం కార్మికుల ధర్నా



ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ గుత్ప, అలీసాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ కార్మికులు మూడు రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం నిజామాబాద్ జిల్లా నవీపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. రెండు ఎత్తిపోతల పథకాల్లో పనిచేసే 120 మందికి ఐదు నెలలుగా జీతాలు లేక పస్తులు ఉంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జీతాలు చెల్లించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. -నవీపేట

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు భారతి

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలం గాణ) : తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీల యూనియన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు గురువారం స్త్రీ, శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ, కమిషనర్ కాంతివెస్లీని యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి ఆధ్వ ర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా నడుపుతున్నందున టీచర్లకు అద నపు పనులు అప్పగించొద్దని, టీఎల్‌వో విధు లను రద్దు చేయాలని, 3 నెలల ఏరియర్స్‌తో పాటు పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. సుదీర్ఘకాలంగా అనారోగ్య సమస్య లతో బాధపడుతున్న వారికి వాలంటరీ రిటై ర్మెంట్ అవకాశం కల్పించాలన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో యూనియన్ ప్రధాన కార్యదర్శి రమాతార, కోశాధికారి వేదవతి, ఎల్లమ్మ, శిరీష, పుష్ప, నాగలక్ష్మి, చిన్నమ్మడు, అనిత ఉన్నారు.



స్త్రీ, శిశు సంక్షేమశాఖ కమిషనర్ కాంతివెస్లీకి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి తదితరులు

బొగ్గు బావులను వేలం వేయొద్దు

శ్రావణపల్లి బొగ్గు బ్లాకును సింగరేణికి కేటాయించాలి • ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చలో రాజ్‌భవన్

ఖైరతాబాద్/కృష్ణకాలనీ, జూలై 18: రాష్ట్రంలోని బొగ్గుబావులను వేలం వేయొ ద్దని ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం చలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖైరతాబాద్ మీదుగా ర్యాలీగా బయలుదేరగా, మెట్రోస్టేషన్ వద్ద కార్మిక సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్య క్షుడు జీ రాంబాబుయాదవ్ మాట్లాడుతూ సింగరేణి నుంచి కేంద్ర, రాష్ట్రాలకు డివి డెండ్స్, పన్నుల రూపంలో ప్రతి సంవ త్సరం రూ.4వేల కోట్లు చెల్లిస్తున్నదని తెలి పారు. ఎన్డీఏ ప్రభుత్వం మూడోసారి అధి కారంలోకి వచ్చిన తర్వాత పదో విడత బొగ్గు బావుల వేలాన్ని ప్రారంభించిందని, తెలంగాణకు చెందిన కిషన్‌రెడ్డికి బొగ్గు గనుల శాఖ కేటాయించి మరి అమ్మకానికి పెట్టిందని విమర్శించారు. ఇందులో శ్రావణ పల్లి బొగ్గు బ్లాకు కూడా వేలం పెట్టడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. బొగ్గు బావు లను ప్రైవేటీకరణ చేసి రూ.29వేల కోట్లు సంపాదించాలని కేంద్రం ప్రయత్నిస్తున్న దని, 40వేల మంది పర్మినెంట్, 26వేల కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్న సింగరేణిని ప్రైవేటీకరణ చేస్తే ఊరుకునేది లేదని హెచ్చ రించారు. రాష్ట్రంలోని ప్రతి బొగ్గు బ్లాకు సింగరేణికే దక్కాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ప్రధాన కార్య దర్శి కృష్ణ, ఉపాధ్యక్షులు గడప రాజయ్య, శ్రీనివాస్, జాఫర్ హుస్సేన్, వెంకటేశ్వర్లు, కిరణ్, నర్సయ్య, నరేశ్, ఆదినాగ్ రెడ్డి, సీఐ టీయూ నాయకులు బాల్‌రాజ్, సీఐటీయూ నాయకులు పాండురంగ బాస్కర్, హెచ్ఎం ఎస్ నాయకులు రామారావు, ఐఎఫ్‌టీయూ నాయకుడు సూర్యం పాల్గొన్నారు.



కార్మిక సంఘాల నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

అరెస్టులు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం: ఎమ్మెల్యే కూనంనేని

తెలంగాణ బొగ్గు గనులను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టొద్దని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న నాయకులను అరెస్టు చేయ డాన్ని సంఘం గౌరవాధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తీవ్రంగా ఖండించారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన మాట్లా డుతూ.. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘా తమని వ్యాఖ్యానించారు. భవిష్యత్‌లో ప్రజాఉద్యమాలను అడ్డుకునే చర్యలకు పాల్పడవద్దని సాంబశివరావు రాష్ట్ర ప్రభు త్వానికి విజ్ఞప్తి చేశారు.

వేలాన్ని రద్దు చేయాలి: గిరిజన సమాఖ్య

సింగరేణి బొగ్గు గనుల వేలంపాటను రద్దు చేయాలని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజ య్యనాయక్ డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని మగ్దూంభవన్‌లో తెలం గాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సమావేశం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆత్మారాం రామ్మూర్తినాయక్ అధ్యక్షతన నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ సింగరేణి సంస్థకే బొగ్గు బ్లాక్‌లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయకార్యదర్శి రమేశ్‌నాయక్, శంకర్‌నాయక్, రామచంద ర్‌నాయక్, స్వరూపబాయి, రమాదేవి, మాలోత్ శంకర్‌నాయక్, ధీరావత్ లింగానా యక్, లావుడియా దస్రునాయక్, జర్పుల శివనాయక్ (ప్రచండ), రత్తునాయక్, భర త్‌నాయక్ పాల్గొన్నారు.

కవిత వైద్య పరీక్షలకు కోర్టు అనుమతి

• పరీక్షల నివేదికను అందించాలి: కోర్టు
• కస్టడీ 22 వరకు పొడిగింపు

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): తీహార్ జైలులో అస్వస్థ తకు గురైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవి తకు వైద్య పరీక్షలు నిర్వహించేం దుకు కోర్టు అనుమతినిచ్చింది. రెండు రోజుల క్రితం అనారోగ్యానికి గురైన కవితను వెంటనే దీన్‌దయాళ్ దవాఖానకు తరలించారు. చికిత్స అనంతరం సాయంత్రానికి కోలుకో వడంతో డిశ్చార్జి చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కవితను కోర్టులో హాజరు పరచగా, తనకు ఎదురవు తున్న అనారోగ్య సమస్యలు, పరీక్ష ఫలితాల్లో వ్యత్యాసాలను న్యాయ మూర్తి దృష్టికి కవిత తీసుకెళ్లారు. దీంతో ఢిల్లీ ఎయిమ్స్‌లో వైద్య పరీ క్షలు చేయించుకునేందుకు కోర్టు అనుమతినిస్తూ ఆదేశాలు జారీచే సింది. పరీక్షల అనంతరం ఆమె ఆరో గ్యానికి సంబంధించిన నివేదికలను కోర్టుకు అందించాలని న్యాయమూర్తి ఆదేశించారు. మరోవైపు కవిత జ్యుడీ షియల్ కస్టడీని ఈ నెల 22 వరకు కోర్టు పొడిగించింది.

బురద.. బంగారం!

• సేంద్రియ ఎరువుగా వినియోగం
• ప్రభుత్వానికి బోలెడు ఆదాయం
• వెలికితీసే సాంకేతికత అభివృద్ధి
• రైస్‌మిల్లర్ దొరయ్య ఘనత
• టెక్నాలజీకి పేటెంట్ హక్కులూ

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 18 (న మస్తే తెలంగాణ): బురద అంటే.. అదో బురద, పోయి పోయి ఒంటికి రాసుకుం టామా? అనుకుంటాం. కానీ, ఆ బురద బంగారం అంటున్నారు సుభల ఎనర్జీ మేనే జింగ్ డైరెక్టర్ దొరయ్య. బురదను సేంద్రియ ఎరువుగా వినియోగించుకోవచ్చని చెప్తున్న ఆయన.. దాన్ని వెలికితీసే సాంకేతికతను అభి వృద్ధి చేసి, పేటెంట్లు కూడా సాధించారు. ఒక ప్పుడు సాధారణ రైస్‌మిల్లర్ అయిన ఆయన.. ఇంజినీరింగ్ నైపుణ్యాలను జోడించి మురుగు నీటి నిర్వహణకు అవసరమైన టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చారు.

తక్కువ ఖర్చుతో పూడికతీత

చెరువులు, కుంటలు, జలాశయాల్లో భారీగా పేరుకుపోయిన పూడికను చాలా తేలి కగా తీసే విధానాన్ని దొరయ్య డెవలప్ చేశారు. తక్కువ విద్యుత్ వినియోగం, అతి తక్కువ మానవ వనరులతోనే మట్టిని తొలగిం



చొచ్చు. ఈ సాంకేతికత పేరు ‘విండ్ మిల్ పవర్డ్ వాటర్ లిఫ్టింగ్ మెకానిజం’. ఈ పద్ధతి పాతకాలంలో ఐతెన్లను ఉపయోగించి నీటి తోడే విధానం తరహాలోనే ఉంటుంది. కరెంట్ అందుబాటులో లేని కాలంలో ఐతెన్లను ఉప యోగించి రాట్నం తిప్పుతూ నీటిని తోడే విధానాన్ని అనుసరించింది. నీటి అడుగున పేరు కుపోయిన పూడిక తీసేలా డిజైన్ చేశారు. 15-20 అడుగుల ఎత్తులో ఉండే భారీ టవ ర్లకు బకెట్లను బిగించి, ఆ టవర్లకు కరెంట్ సర ఫరా చేయడం వలన తిరుగుతుంది. ఈ సమ యంలో నీటి అడుగు భాగంలో అధిక పీడనం కలుగజేస్తే పూడిక పైకి లేచి బకెట్లలోకి చేరు తుంది. ఈ టెక్నాలజీ సాయంతో టన్ను మట్టిని బయటకు తీసేందుకు రూ. 2,500 మాత్రమే ఖర్చు అవుతుందని, సాధారణ పద్ధ తిలో బయటకు తీయాలంటే రూ.15-20 వేల ఖర్చు వస్తుందని చెప్తున్నారాయన. ఆ పూడికలో కంపోస్ట్ ఎరువు తరహాలో సేంద్రియ గుణాలు ఉంటాయని, కొంత ప్రాసెస్ చేసి వాడుకోవచ్చని తెలిపారు. ఆ మట్టిని సేంద్రియ ఎరువుగా ప్రాసెస్ చేసి విక్ర యించడం వల్ల ఎరువుల భారం తగ్గడంతో పాటు, రూఫ్ గార్డెన్, ఇంటీరియల్ గార్డెనిం గ్‌తో సేంద్రియ ఎరువుల డిమాండ్ తగ్గుతుం దని, దీన్ని విక్రయించడం ద్వారా ప్రభుత్వా నికి రూ.50 వేల కోట్ల ఆదాయం సమకూరు తుందని వివరించారు. పూడిక తీసిన మట్టితో ఇటుకలు తయారుచేస్తే నిర్మాణరంగానికి అవ సరమైన ఇటుకల ఖరీదు భారం తగ్గుతుందని తెలిపారు. ప్రస్తుతం ఒక్క ఎర్ర ఇటుక తయా రీకి రూ.3-5 ఖర్చు అవుతుండగా, పూడిక మట్టిని వినియోగిస్తే 60-80 పైసలే ఖర్చు అవుతుందని, ఒక్కో ఇటుకకు రూ.3-5కే విక్రయించే వీలు ఉంటుందని వెల్లడించారు.

పట్టించుకోని అధికారులు

జాతీయ స్థాయిలో తన టెక్నాలజీకి పేటెంట్ ఉన్నా దీనిని అమలు చేయడం విషయంలో ఇప్పటికీ అధి కారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా రని దొరయ్య అంటున్నారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక అధికారులు, ప్రజాప్రతినిధులకు తన ప్రాజెక్టు గురించి వివరించానని తెలిపారు. మంత్రులు, ముఖ్యమంత్రుల కార్యా లయాల నుంచి స్పందన వస్తున్నా, క్షేత్రస్థాయి సిబ్బంది పట్టించుకోవటం లేదని వాపోయారు. గత ఏడాది కర్ణా టక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను కలిసి వివరించానని, పైలట్ ప్రాజె క్టులో ప్రారంభించేందుకు సూత్రప్రా యంగా అనుమతించారని వివరిం చారు. సీఎం రేవంత్ రెడ్డి కూడా దీన్ని ఆసక్తి చూపినా.. హెచ్ఎండీఏ, వాట ర్‌బోర్డు అధికారులు ఆసక్తి చూపడం లేదని పేర్కొన్నారు.

కొడుకుల వద్దకు చేరిన తల్లి

కొడుకులకు తహసీల్దార్ కౌన్సెలింగ్

గార్ల, జూలై 18: కలెక్టర్ చొరవతో వృద్ధాశ్రమంలో ఉన్న తల్లి కొడుకుల వద్దకు చేరింది. కొడుకులు తల్లిని గెంటేయడంపై ఈ నెల 17న ‘నమస్తే తెలంగాణ’లో ప్రచు రితమైన ‘అమ్మను కొట్టి గెంటేశారు’ కథ నానికి కలెక్టర్ స్పందించారు. చర్యలు తీసు కోవాలని ఈ మేరకు రెవెన్యూ, పోలీస్ అధి కారులను ఆదేశించారు. గురువారం తహ సీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రవీం దర్, సీఐ రవికుమార్, ఎస్సై జీనత్ కుమార్ సమక్షంలో వృద్ధురాలు గాదెపల్లి నర్సమ్మ కొడుకులు శ్రీనివాస్, కృష్ణకు కౌన్సెలింగ్ ఇచ్చారు. తప్పు తెలుసుకున్న కుమారులు తల్లికి ఎలాంటి లోటులే కుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. భవిష్యత్‌లో ఎలాంటి సమ స్యలు రాకుండా చూసుకుంటామని వారు పేర్కొన్నారు. అనంతరం తల్లిని ఇంటికి తీసుకె ళ్లారు.



తల్లి కొడుకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న తహసీల్దార్, పోలీస్ అధికారులు

నమస్తే ఎఫెక్ట్

నలుగురు వైద్యులకు మెమోలు

వరంగల్ చౌరస్తా, జూలై 18: రోగులకు వైద్యసేవలు అందించడంలో అలసత్వాన్ని ప్రదర్శించి విధులకు ఆలస్యంగా హాజరైన వరంగల్ కాకతీయ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ న్యూరాలజీ అసిస్టెంట్ ప్రొఫె సర్లు నలుగురికి ఎంజీఎం సూపరింటెం డెంట్ డాక్టర్ చంద్రశేఖర్ మెమోలు జారీ చేశారు. వైద్యులు సమయంలో విధులకు హాజరుకావడం లేదని ఈ నెల 17న ‘న మస్తే తెలంగా ణ’లో ప్రచురిత మైన ‘వైద్యుల కోసం రోగుల పడిగాపులు’ కథనానికి వైద్యాధికారులు స్పందించారు. న్యూరా లజీ విభాగం అసిస్టెంట్ వినయ్‌కుమార్, డాక్టర్ గౌతమ్, డాక్టర్ మానస, డాక్టర్ నవీన్‌కు మెమోలు జారీ చేస్తూ 24 గంటల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. హాస్పిటల్‌లో అన్ని విభాగాల పరిస్థితి ఇలాగే ఉన్నా ఒక్క విభాగానికి చెందిన వైద్యులకే మెమోలు జారీ చేయడాన్ని పలువురు వైద్యులు తప్పుబడుతున్నారు.